www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 12-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 315 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: తదియ సా. 5.46 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాభాద్ర మ 2.57 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా.11.36-1.03; దుర్ముహూర్తం: మ.12.53-1.38, మ.3.10-3.55; అమృతఘడియలు: ఉ.7.51-9.16; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.12 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## చకచకా ఉద్యోగ పరీక్షల ఫలితాలు

ఇప్పటికే గ్రూప్-4 రిజల్ట్స్ విడుదల

వారంలోనే మరో 3 పరీక్షల ఫలితాలు

టీఎస్‌పీఎస్సీ ఉన్నతాధికారుల నిర్ణయం

సుప్రీంలో కేసు కొలిక్కి వస్తే గ్రూప్-1 నోటిఫికేషన్.. 19న విచారణ

అప్పీల్ విత్‌డ్రాకు సర్కారు పిటిషన్

RESULTS

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే నిర్వహించిన ఉద్యోగ పరీక్షల ఫలితాలను వరుసగా వెల్లడించాలని టీఎస్‌పీఎస్సీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఏడాదిలోనే సుమారు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా పరీక్షలు పూర్తయిన పోస్టులకు సంబంధించిన ఫలితాలు

మిగతా 14వ పేజీలో...



డిప్యుటేషన్ల రద్దు

## సర్కారు దవాఖానాలపై పిడుగు!

ఉన్నపళంగా పాత పోస్టులకు డాక్టర్లు

స్పెషలిస్టు వైద్యుల్లేక నిలిచిన సేవలు

సాధారణ రోగులకు తీవ్ర ఇబ్బందులు

అత్యవసర వైద్యం కోసం జిల్లాల నుంచి హైదరాబాద్‌కు తరలివస్తున్న పేషెంట్లు

స్తంభించిన తెలంగాణ డయాగ్నస్టిక్స్

నేడు కోఠీలో డీహెచ్ ఆఫీస్ వద్ద వైద్య ఉద్యోగ సంఘాల ఆందోళన

డిప్యుటేషన్ రద్దయిన రోజే ఎఫ్ఎస్‌డీ తెచ్చుకున్న అధికారిణి.. వైద్యశాఖలో చర్చ

12


## కొడంగల్‌కు మెడికల్ కాలేజీ

నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలలు కూడా

220 పడకల ఆస్పత్రిగా సీహెచ్‌సీ

224.50 కోట్లకు పాలనాపరమైన అనుమతులిస్తూ సర్కారు జీవో

# మాకేంటి!?



యాదాద్రి పవర్ ప్లాంట్

## యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రంపై రాజకీయ క్రీనీడ.. నిలిచిన పనులు

మార్చిలో జరగాల్సిన రెండు ప్లాంట్ల ప్రారంభోత్సవంలో అనివార్య జాప్యం

ప్లాంటు కాంట్రాక్టు సంస్థల్లో బీఆర్ఎస్ పార్టీ సన్నిహితులు

ఇసుక, కంకర, డస్టు కాంట్రాక్టులూ ఆ పార్టీ నాయకులకే..

వాటిని తమ వారికి ఇవ్వాలని స్థానిక, కీలక నేతల ఒత్తిడి

గత ప్రభుత్వం తరహాలోనే తమతోనూ 'వ్యవహారాలు' జరపాలని డిమాండ్

నాలుగు నెలలుగా 2000 కోట్ల బిల్లులూ పెండింగ్

కాంట్రాక్టు సంస్థల లబోదిబో

*యాదాద్రి థర్మల్ ప్లాంట్..! రెండు యూనిట్లలో 90 శాతం పనులు పూర్తయ్యాయి! మిగిలిన మూడు యూనిట్లలో 70 శాతం పనులు పూర్తయ్యాయి! అంతా అనుకున్నట్లు జరిగితే.. వచ్చే నెల అంటే మార్చిలోనే రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి ప్రారంభం కావాలి! వేసవి అవసరాలను తీర్చేలా మరో 1,600 మెగావాట్ల విద్యుత్తు అందుబాటులోకి రావాలి! కానీ, సివిల్ పనులను పూర్తిస్థాయిలో నిలిపివేశారు. మిగిలిన పనులనూ నామమాత్రంగా చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే మార్చిలో ఈ ప్లాంట్లు ప్రారంభమయ్యే అవకాశం లేదు. ఇందుకు కారణం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్లాంటుపై రాజకీయ క్రీనీడ పడడమే!*

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణ పనులకు బ్రేకు పడింది. పవర్ ప్లాంట్‌పై ఆధిపత్యంతోపాటు ఇక్కడి పనులను తమ అనుయాయులకు ఇప్పించుకోవడానికి స్థానిక ప్రజా ప్రతినిధి, మరో కీలక ప్రజా ప్రతినిధి చేస్తున్న ఒత్తిడితో పనులు నిలిచిపోయాయి. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణానికి 2015 జూలై 8న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఒక్కోటీ 800 మెగావాట్ల సామర్థ్యంతో ఐదు యూనిట్లను నిర్మించాల్సి ఉంది. బొగ్గు సరఫరా కోసం రైల్వే లైన్, అరు టీఎంసీల కృష్ణా నీటిని కూడా ప్లాంటు కోసం కేటాయించారు. ప్లాంటు నిర్మాణానికి తొలుత రూ.29,500 కోట్ల అంచనా వ్యయం



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రవేశద్వారం

వేయగా, తర్వాత దానిని రూ.34,500 కోట్లకు పెంచారు. ప్రాజెక్టు పనుల్లో భూసేకరణ వంద శాతం పూర్తవగా, పునరావాస కేంద్రాల నిర్మాణం కూడా దాదాపు పూర్తయింది. మార్చిలో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించాలని అధికార యంత్రాంగం సన్నాహాలు

మిగతా 14వ పేజీలో...

## 395 మంది ఎంపీడీవోల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈసీ మార్గదర్శకాల నేపథ్యంలోనే..

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) బదిలీలు భారీగా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 612 మంది ఎంపీడీవోలు ఉండగా.. వీరిలో 395 మందిని బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్లకు సూచించారు. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారితోపాటు మూడేళ్లకుపైగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని గత డిసెంబరులో ఈసీ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వివిధ శాఖలు బదిలీలు చేపట్టాయి. తాజాగా ఎంపీడీవోలను బదిలీ చేశారు.



## బీఆర్ఎస్‌కు షాక్!

సీఎంను కలిసిన బొంతు రామ్మోహన్

త్వరలో కాంగ్రెస్‌లోకి గ్రేటర్ మాజీ మేయర్!

మల్కాజిగిరి లోక్‌సభ టికెట్‌పై ఆసక్తి

హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్

ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లే లక్ష్యంగా పావులు

13

## లోక్‌సభ ఎన్నికల కోసమే కేసీఆర్..

# నీళ్ల సెంటిమెంట్!



జగన్‌తో కుమ్మక్కై రాష్ట్రాన్ని దెబ్బతీశాడు

ఏ ముఖం పెట్టుకొని కేసీఆర్ నల్లగొండ వస్తాడు?

ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలి

కేసీఆర్ వచ్చే రోజు నల్లగొండలో నిరసన

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి

కేసీఆర్ సభను అడ్డగిస్తాం

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నేడు రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం

13



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు

ప్రాజెక్టులను బోర్డుకు ఇవ్వొద్దన్నదే మా విధానం

గెజిట్‌కు బీఆర్ఎస్ సర్కారే అభ్యంతరం చెప్పలేదు

బీఆర్ఎస్ పార్టీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

కేసీఆర్ నల్లగొండ సభకు ఒకరోజు ముందే అసెంబ్లీలో చర్చ చేపట్టాలని సర్కారు నిర్ణయం

సమగ్ర అవగాహనతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధం

అవగాహన సదస్సు నిర్వహించిన మంత్రి ఉత్తమ్

'కృష్ణా ప్రాజెక్టుల'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల కోసమే మాజీ సీఎం కేసీఆర్ నీళ్ల సెంటిమెంటును తెరపైకి తెచ్చారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టులను అప్పగించవద్దన్నదే ప్రభుత్వం విధానమని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు కేసీఆర్ ప్రభుత్వమే అభ్యంతరం చెప్పలేదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని శాసనసభలో, బయటా తిప్పికొట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం సూచించారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారంపై కేసీఆర్ మంగళవారం నల్లగొండలో సభ నిర్వహించనున్న నేపథ్యంలో.. అందుకు ఒకరోజు ముందే ఈ అంశంపై పార్టీని నేరుగా ఢీ కొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...



కరాచీలో ఇమ్రాన్ మద్దతుదారుల నిరసన ప్రదర్శన

## పాక్‌లో కుర్చీలాట!

పొత్తుకై నవాజ్ పీఎంఎల్-ఎన్, బిలావల్ భుట్టో పీపీపీ చర్చలు

ప్రధాని పదవి కావాలన్న బిలావల్ భుట్టో.. అంగీకరించని నవాజ్

ఫలితాల్లో ఇమ్రాన్ పార్టీ మద్దతున్న ఇండిపెండెంట్లకే అధిక సీట్లు

పార్టీ లేకపోవడంతో వారు అధికారానికి వచ్చే అవకాశాల్లేనట్లే

పీఎంఎల్-ఎన్‌లో చేరిన ఓ స్వతంత్ర అభ్యర్థి

తమనే ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలంటూ పీటీఐ డిమాండ్

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 11: పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ దేశంలో రాజకీయ అనిశ్చితికి తెరలేపాయి. జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా 101 స్థానాల్లో విజయం సాధించారు. అయినప్పటికీ, వారు ఇండిపెండెంట్లుగా ఉండటం, కనీస మెజారిటీ రాకపోవటంతో.. నవాజ్‌షరీఫ్ పార్టీ పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్), బిలావల్ జర్దారీ భుట్టోకు చెందిన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి

మిగతా 2వ పేజీలో...

## రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యల కేసు..

## బాల్క సుమన్‌కు నోటీసులు

జారీ చేసిన మంచిర్యాల పోలీసులు

కేసీఆర్‌ను తిట్టిన రేవంత్‌పైనా, ప్రతి కాంగ్రెస్ నేతపైనా కేసు పెట్టాలి: సుమన్



చైర్‌పర్సన్ చీర లాగుతున్న మహిళా రైతులు

## పంటపై కూర్చోబెట్టి.. కొంగు లాగి


అచ్చంపేట మార్కెట్ చైర్ పర్సన్‌ను లాక్కెళ్లిన మహిళా రైతులు

12

గిట్టుబాటు ధర దక్కలేదంటూ ఆగ్రహం

మార్కెట్ కార్యాలయ ఫర్నిచర్ ధ్వంసం

చౌరస్తాలో ధర్నా.. పోలీసులతో ఘర్షణ



## తిరుమలలో ఏనుగుల కలకలం

12

పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపం వద్ద ఇనుప కంచె, చెట్లు ధ్వంసం

## నైరుతి ఆశాజనకం!

గత ఏడాది కంటే మెరుగ్గా వర్షాలు

జూన్ నాటికి ఎల్‌నినో బలహీనం

ఆగస్టు నుంచి లానినా పరిస్థితులు

వాతావరణ నిపుణుల విశ్లేషణలు

13



# పెళ్లికి బాజా మోగింది..



మాఘం రావడంతో శుభకార్యాల సందడి షురూ

రేపటి నుంచి మంచి ముహూర్తాలు ప్రారంభం

ఎల్లుండి వసంత పంచమి.. వేలాది కల్యాణాలు

ఏప్రిల్ 26 వరకూ దాదాపు 30 శుభ ఘడియలు

ఫంక్షన్ హాళ్లు దొరక్క చాలామందికి ఇబ్బందులు

డెకొరేటర్లు, ఫొటోగ్రాఫర్లు, బ్యూటీషియన్లు, ఆర్కెస్ట్రా, షామియానాల వారికి భారీ డిమాండ్





(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)

పుష్యమాసం వెళ్లిపోయింది! 'మాఘ మాసం ఎప్పుడొస్తుందో..' అంటూ పాటలు పాడుకున్న జంటల కలలు నెరవేరే సమయం వచ్చేసింది! మాఘంలో మంగళవారం నుంచి మంచి ముహూర్తాలు ఉండడంతో.. రాష్ట్రవ్యాప్తంగా శుభకార్యాల సందడి షురూ అయింది. పెళ్లిళ్లు, ఉపనయనాలు, అక్షరాభ్యాసాలు.. ఒక్కటనేమిటి ఇంచుమించుగా అందరిళ్లల్లో ఏదో ఒక వేడుక. బంధువులు, స్నేహితులను పిలిచి ఎవరి స్థాయికి తగినట్లుగా వారు ఆ శుభకార్యాలను జరిపించేందుకు ఆరాటపడుతున్నారు. మరీ ముఖ్యంగా మాఘ మాసం అంటే పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆ సందడే ఎక్కువగా కనిపిస్తోంది. పంచాంగం ప్రకారం ఈ నెల 13 నుంచి ఏప్రిల్ 26 దాకా.. దాదాపు 30 మంచి ముహూర్తాలున్నాయి. ఇవి కాక.. వధూవరుల జన్మనక్షత్రాల ఆధారంగా నిర్ణయించే ముహూర్తాలు అదనం. సాధారణంగా ఏటా వసంత (మాఘ శుద్ధ) పంచమినాడు కొన్ని వేల పెళ్లిళ్లు జరగడం కద్దు. మాఘమాసం రాగానే వచ్చే మంచి ముహూర్తాల్లో బలమైనది కావడం, సరస్వతీ దేవి పుట్టినరోజు కావడంతో.. చాలా మంది ఈ ముహూర్తానికి పెళ్లిళ్లు నిశ్చయం చేస్తారు. వసంత పంచమినే శ్రీ పంచమిగా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏడాది ఆ పర్వదినం ఫిబ్రవరి 14న రావడం.. అదే రోజు వాలెంటైన్స్ డే (ప్రేమికుల దినం) కూడా కావడంతో చాలా జంటలు తమ తల్లిదండ్రులను ఒప్పించి మరీ

మిగతా 14వ పేజీలో...



# అయోధ్యలో యూపీ అసెంబ్లీ

**సీఎం యోగి పూజలు..పాల్గొన్న 325 మందికి పైగా శాసన సభ్యులు**

అయోధ్య/లఖ్‌నవూ, ఫిబ్రవరి 11: అయోధ్యలోని రామమందిరాన్ని ఆదివారం 325 మందికి పైగా ఉత్తరప్రదేశ్ శాసనసభ్యులు సందర్శించి పూజలు నిర్వహించారు. వీరిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. అయితే ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ నుంచి ఎవరూ పాల్గొనలేదు. లఖ్‌నవూ నుంచి 10 బస్సుల్లో రాష్ట్ర ఉభయ సభల సభ్యులు అయోధ్యకు చేరుకున్నారు. పుణె నుంచి వచ్చిన రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా రామ మందిరానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందిరం అంతా 'జై శ్రీరామ్' నినాదాలతో మార్మోగింది. ప్రభుత్వంలోని తన సహచరులు, శాసనసభ్యులతో కలిసి ప్రభు శ్రీ రామ్‌లల్లా మందిరంలో పూజలు నిర్వహించినట్టు 'ఎక్స్'లో ఆదిత్యనాథ్ పోస్ట్ చేశారు. 14 నిమిషాల నిడివి కలిగిన వీడియోను ఆయన పంచుకున్నారు. డిప్యూటీ సీఎంలు, స్పీకర్, శాసనసభ్యులతో కలిసి మందిరం మెట్ల వద్ద సీఎం ఫొటోలు దిగారు.

## అయోధ్యలో ఆధ్యాత్మిక బ్యాంక్.. అంతా 'సీతారామ' నామస్మరణే

బ్యాంక్ అంటే నగదు లావాదేవీలు, డిపాజిట్లు, రుణాలు వంటి వ్యవహారాలు ఉంటాయి. అయోధ్యలోని ఓ బ్యాంక్ మాత్రం చాలా ప్రత్యేకం. అక్కడ డబ్బు అన్నమాట ఉండదు. అంతా ఆధ్యాత్మికం. 'సీతారామ' నామస్మరణే. ఆ బ్యాంక్ పేరు 'ఇంటర్నేషనల్ శ్రీ సీతారామ్ బ్యాంక్'. ఇందులో ఖాతా తెరవాలంటే 'సీతారామ్' అన్న పదాన్ని కనీసం 5లక్షలసార్లు రాయాలి. అప్పుడే పాస్‌బుక్ ఇస్తారు. ఈ బ్యాంక్‌లో 'సీతారామ్' అని రాసిన బుక్‌లెట్లనే డిపాజిట్ చేయించుకుంటారు. బ్యాంక్‌లో 35 వేలమందికి పైగా ఖాతాదారులున్నారు. వీరిలో భారత్‌తోపాటు ఇంగ్లండ్, అమెరికా, కెనడా, నేపాల్, ఫిజి, యూఏఈ ఇతర దేశాల వారున్నారు. ఈ ఆధ్యాత్మిక బ్యాంక్‌ను 1970 నవంబరులో శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ చీఫ్ మహంత్ నృత్యగోపాల్ దాస్ ఏర్పాటు చేశారు. దేశవిదేశాల్లో కలిపి 136 బ్రాంచ్‌లున్నాయి. ఇప్పటి వరకూ రామభక్తుల నుంచి 20వేల కోట్ల 'సీతారామ్' బుక్‌లెట్లను డిపాజిట్ చేయించుకున్నారు.

## అబుధాబి బాప్స్ మందిర ప్రారంభానికి సన్నాహాలు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో హిందువులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అబుధాబిలోని బాప్స్ మందిర ప్రారంభానికి సన్నాహాలు వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక ఆలయం భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా బుధవారం ప్రారంభంకానుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఆదివారం నుంచి జరగాల్సిన పల్లకి యాత్ర సేవలను వాయిదా వేశారు. ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న యూఏఈ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పల్లకి యాత్రను వాయిదా వేస్తున్నామని బాప్స్ మందిర ప్రముఖుడు బ్రహ్మవిహారి స్వామి వెల్లడించారు. యాత్ర ను ఎప్పుడు నిర్వహించేది బుధవారం తర్వాత ప్రకటిస్తామన్నారు. ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమై మోదీ చేతుల మీదుగా బుధవారం ముగియాలి. ఈ మందిరంలో స్వామి నారాయణ, రాధాకృష్ణ, పద్మావతి శ్రీనివాస, పూరి జగన్నాథ, అయ్యప్ప, శివపరివార్, సీతారామచంద్ర స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. మందిరంలో వెంకటేశ్వరస్వామి కొలువుదీరనున్నారు. దుబాయిలో నివసించే తిరుపతికి చెందిన కటారు వెంకటసుదర్శన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# నేడు బిహార్ సీఎం నితీశ్ బలపరీక్ష

పట్నా/శంషాబాద్/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బిహార్ సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో బల పరీక్షను ఎదుర్కొనబోతోంది. విశ్వాస పరీక్షకు అనుకూలంగా ఓటు వేయాల్సిందిగా జేడీయూతోపాటు ఎన్‌డీఏ సర్కారుకు మద్దతిస్తున్న, మాజీ సీఎం జీతన్ రాం మాంఝీకి చెందిన హెచ్‌ఏఎం తమ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేశాయి. మొత్తం 243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీలో ప్రస్తుతం నితీశ్‌కు చెందిన జేడీయూకు 45 మంది సభ్యులు ఉండగా, బీజేపీకి 78 మంది, మాంఝీ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మొత్తంగా మ్యాజిక్ ఫిగర్ (122)ను దాటి ఎన్‌డీఏకు బలం (127) ఉంది. మరోవైపు మహా గట్‌బంధన్‌లోని ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలకు కలిపి 114 మంది ఎమ్మెల్యేలే ఉండగా.. వారెవరూ గీత దాటకుండా ఆయా పార్టీలు క్యాంపు రాజకీయాలు కొనసాగిస్తున్నాయి. ఆర్జేడీ సభ్యులంతా ఆ పార్టీ నేత తేజస్వి యాదవ్ నివాసంలో ఉన్నారు. కాగా, వారం రోజులుగా తెలంగాణలో శిబిరంలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం రాత్రి బిహార్‌కు చేరుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కాగజ్‌ఘాట్‌లో సిరి నేచర్ వ్యాలీలో ఉన్న ఎమ్మెల్యేలు పోలీసు బందోబస్తు మధ్య ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే వారి ప్రత్యేక విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో కొన్ని గంటలు ఎయిర్‌పోర్టులోనే ఉన్నారు. చివరికి రాత్రి 7:30 గంటల ప్రాంతంలో విమానం ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయింది. ఇదిలా ఉండగా.. ఆర్జేడీకి చెందిన అసెంబ్లీ స్పీకర్‌పై ఎన్‌డీఏ పక్షాలు అవిశ్వాసాన్ని ప్రతిపాదించాయి.



ఇబ్రహీంపట్నం నుంచి బయల్దేరే ముందు బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

# సొంతంగా 370 దాటేస్తాం!

**మాకు 400 ఎంపీ సీట్లు వస్తాయని విపక్షాలే అంటున్నాయి: మోదీ**

- కాంగ్రెస్ అధికారంలో ఉంటే దోపిడీ
- బయట ఉంటే కులమతాల చిచ్చు
- ఝాబువా సభలో ప్రధాని

ఝాబువా, ఫిబ్రవరి 11: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లకు పైగా గెలుస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తంచేశారు. పార్లమెంటులో విపక్ష నేతలు సైతం ఎన్డీయేకి ఈ దఫా 400 స్థానాలకు మించి వస్తాయని చెబుతున్నారని గుర్తుచేశారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఝాబువాలో గిరిజనులతో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో గత ఎన్నికల్లో బీజేపీకి వేసిన ఓట్ల కంటే అదనంగా 370 ఓట్లు వేయించాలని.. అప్పుడు తేలిగ్గా 370 స్థానాలు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ గిరిజనుల వ్యతిరేకి అని మండిపడ్డారు. గ్రామాలు, రైతులు, పేదలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఆ పార్టీకి గుర్తుకొస్తారని అన్నారు. 'అధికారంలో ఉంటే దోపిడీ చేయడం.. బయట ఉంటే కులం, మతం, భాష పేరిట విభజన చిచ్చు పెట్టడం దాని నైజం. తాను చేసిన పాపాల ఊబిలో తానే కూరుకుపోతోంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి' అని దుయ్యబట్టారు. ఝాబువాకు తాను ఎన్నికల ప్రచారం కోసం రాలేదని.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అద్భుత విజయం అందించినందుకు 'సేవకుడి'గా కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చానని అన్నారు. 2047కల్లా దేశంలో..ప్రధానంగా గిరిజనుల్లో తలసేమియా వ్యాధి నిర్మూలన/నివారణకు చేపట్టిన జాతీయ మిషన్ గురించి చెబుతూ.. దీనిని ఎన్నికల కోసం ప్రారంభించలేదని.. గిరిజనుల ఆరోగ్యం కోసమే చేపట్టామని వివరించారు. 2014కి ముందువరకు కాంగ్రెస్ ఏలుబడిలో గిరిజనులకు దేశవ్యాప్తంగా వంద గురుకుల పాఠశాలలు మాత్రమే ఉండేవని.. గత పదేళ్లలో నాలుగు రెట్లకు పెంచామని చెప్పారు. కనీస మద్దతు ధర కల్పించే అటవీ ఉత్పత్తులను ఈ పదేళ్లలో పది నుంచి 90కి పెంచామని.. వన్ ధన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని.. 'జన్-మన్ యోజన' అమలు చేస్తున్నామని తెలిపారు. 'భూహక్కుల పరిరక్షణకు 1.75 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు 'స్వామిత్వ పత్రాలు' అందించాం. గిరిజనులకు భూహక్కులను తిరిగిచ్చాం' అని వివరించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం రెట్టింపు వేగంతో పనిచేస్తోందన్నారు. ఆదివారం ప్రారంభించిన రూ.7,550 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ప్రధాని ప్రస్తావించారు. 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీలు'గా తయారుచేయడం తన గ్యారెంటీగా పేర్కొన్నారు. మహిళా రైతులకు డ్రోన్లు సమకూరుస్తామని.. వారంతా 'నమో డ్రోన్ దీదీలు'గా వ్యవసాయ విప్లవం తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.



ఝాబువా సభలో ప్రధాని మోదీ

## బీజేపీ-ఆరెస్సెస్‌తో విద్వేష వ్యాప్తి

**జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ గాంధీ**

రాజ్‌గఢ్, ఫిబ్రవరి 11: బీజేపీ, ఆరెస్సెస్ విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని, అయితే ప్రేమ అనేది ఈ దేశ డీఎన్ఏలోనే ఉందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. రెండు రోజుల విరామం తర్వాత భారత్ జోడో న్యాయ్ యాత్ర ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం పునఃప్రారంభమైంది. రాయ్‌గఢ్‌లోని కెవ్డా బాడీ చౌక్‌లో నిర్వహించిన సభలో రాహుల్ ప్రసంగించారు. భావితరాల కోసం ద్వేషం, హింస లేని హిందుస్థాన్ కావాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని చెప్పారు. "ప్రస్తుతం దేశం ప్రతి మూలలోనూ విద్వేషం, హింస వ్యాపిస్తున్నాయి. భాష ఆధారంగా, ప్రాంతం ఆధారంగా ఇతరులంటే ఇష్టం లేదని కొందరు చెబుతున్నారు. ఇలాంటి ఆలోచనలు దేశాన్ని బలహీనపరుస్తాయి. బీజేపీ, ఆరెస్సెస్ విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నా కూడా దేశంలో వివిధ మతాలకు చెందిన, విభిన్న ఆలోచనలు కలిగిన ప్రజలు ప్రేమతో ప్రశాంతంగా కలిసిమెలిసి జీవిస్తున్నారు" అని రాహుల్ పేర్కొన్నారు. గతేడాది మే నెల నుంచి గృహదహనాలు, హత్యాకాండలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను ప్రధాని మోదీ ఒక్కసారి కూడా సందర్శించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మణిపూర్ కాలి బూడిదైనా అక్కడ ప్రభుత్వ ఉనికే లేదన్నారు. సాయుధ దళాల్లో సైనికులను స్వల్ప కాలానికి నియమించే అగ్నివీర్ ప్రక్రియను రాహుల్ తప్పుబట్టారు. మిలటరీలోకి ఎంపికైనా రిక్రూట్ చేసుకోని 1.50 లక్షల మంది యువతకు నష్టపరిహారం చెల్లించడమో లేదా వారిని విధుల్లోకి తీసుకోవడమో జరిగే వరకూ కాంగ్రెస్ పోరాడుతుందని చెప్పారు. వీరందరికీ న్యాయం జరిగేలా తమ పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

**లోకం తీరు**




## 20 మంది మహిళలపై సామూహిక అత్యాచారాలు

- అంగన్‌వాడీల్లో ఉద్యోగాలంటూ మునిసిపల్ చైర్మన్, కమిషనర్ కీచక పర్వం

జైపూర్, ఫిబ్రవరి 11: ఉన్నత స్థాయిలో ఉండి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అంగన్‌వాడీల్లో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి దాదాపు 20 మంది మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడిన మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్, మాజీ మునిసిపల్ కమిషనర్లపై కేసు నమోదైంది. రాజస్థాన్‌లోని సిరోహిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైకోర్టు ఆదేశాలతో సిరోహి మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్ మహేంద్ర మేవాడా, అప్పటి మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న మహేంద్ర చౌదరిపై కేసులు నమోదు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ చాలామంది మహిళలకు ఇద్దరు నిందితులు ఆశ జూపారు. ఈ క్రమంలోనే నమ్మి వచ్చిన 20 మందికి కొన్నాళ్ల పాటు ఓ చోట భోజన వసతితో పాటు ఆశ్రయం కల్పించారు. వీలు చిక్కినప్పుడల్లా ఆహారంలో మత్తు మందు పెట్టి ఒక్కొక్కరిపై సామూహిక అత్యాచారాలకు పాల్పడుతూ వీడియోలు కూడా తీశారు. అనంతరం ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బాధితులను బెదిరిస్తూ లైంగికంగా వాడుకోవడంతో పాటు రూ.లక్షలకు లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై పాలీ జిల్లాకు చెందిన ఓ మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. డీఎస్పీ పరాస్ చౌదరి కేసు నమోదు చేయకుండా తప్పుడు ఆరోపణలంటూ కొట్టిపారేశారు. దీంతో ఆ మహిళ సహా 8 మంది బాధితులు రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కేసుకు సంబంధించి విచారణలు కొనసాగుతున్నాయి.

## రాజ్యసభకు ప్రముఖ జర్నలిస్టు సాగరికాఘోష్!

- అభ్యర్థిగా ఆమె పేరు ప్రకటించిన తృణమూల్ కాంగ్రెస్



కోల్‌కతా, ఫిబ్రవరి 11: ప్రముఖ జర్నలిస్టు సాగరికా ఘోష్‌ను తమ పార్టీ తరఫున రాజ్యసభకు పోటీపడే అభ్యర్థుల్లో ఒకరిగా తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించింది. పశ్చిమ బెంగాల్ నుంచి ఐదు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 27వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో అధికారపక్షంగా ఉన్న తృణమూల్‌కు అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా.. నలుగురు అభ్యర్థులను గెలిపించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సాగరిక ఘోష్‌తోపాటు సుస్మితదేవ్, నదీముల్‌హఖ్, మమతబాలా ఠాకూర్‌ల పేర్లను ఆదివారం ప్రకటించింది. సాగరిక తప్ప మిగిలిన ముగ్గురు తృణమూల్ నేతలు. సాగరిక కూడా త్వరలో తృణమూల్‌లో చేరే అవకాశం ఉంది. ప్రఖ్యాత జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ ఆమె భర్త.

## బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనున్న 14 మంది అభ్యర్థుల జాబితాను ఆదివారం బీజేపీ ప్రకటించింది. ఈ నెల 27న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏడు రాష్ట్రాల అభ్యర్థుల వివరాలను వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌లో ఏడు స్థానాలకు, బిహార్‌లో రెండింటికి, ఛత్తీస్‌గఢ్, హరియాణా, కర్ణాటక, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కో స్థానానికి అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. సీనియర్ నాయకుడు, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీకి ఈ జాబితాలో చోటు దక్కలేదు. పదవీ కాలం ముగియనున్నప్పటికీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ (కర్ణాటక), బీజేపీ మీడియా హెడ్ అనిల్ బలూనీ (ఉత్తరాఖండ్)లకు మరోసారి అవకాశం ఇవ్వలేదు. వారు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఆర్‌పీఎన్ సింగ్‌కు టిక్కెట్ ఇవ్వడం గమనార్హం. ఈ సందర్భంగా సుశీల్ కుమార్ మోదీ ట్వీట్ చేస్తూ.. 33 ఏళ్లుగా నిరంతరాయంగా ఏదో ఒక సభలో ఉన్నానని, ఇందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఇంతకుముందు మాదిరిగానే పార్టీ కోసం పనిచేస్తానన్నారు.

## జిల్లా స్థాయి కోర్టులను 'కింది కోర్టులు' అనొద్దు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కేసులను విచారిస్తున్న జిల్లా స్థాయి న్యాయస్థానాలను 'కింది కోర్టులు' అని వ్యవహరించకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది. వాటిని 'ట్రయల్ కోర్టులు'గా పరిగణించాలని పేర్కొంది. ఈ విధానానికి ముగింపు పలికేలా తగిన మార్పులు చేయాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని సూచిస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. వాటికి సంబంధించిన దస్త్రాలను లోయర్ కోర్టు రికార్డ్ (ఎల్‌సీఆర్) అని వ్యవహరించకూడదని, ట్రయల్ కోర్టు రికార్డ్ (టీసీఆర్) అని పేర్కొనాలని సూచించింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై వచ్చిన అప్పీలును విచారించిన సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది.

## 'మాతృభాష'లో సీఏపీఎఫ్ పరీక్ష.. ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కేంద్ర సాయుధ పోలీసు బలగాల(సీఏపీఎఫ్) కానిస్టేబుల్ నియామక పరీక్షను తొలిసారి హిందీ, ఇంగ్లిషుతో పాటు 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర హోం శాఖ ఆదివారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 128 నగరాల్లో ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. అందులో 48 లక్షల అభ్యర్థులు పాల్గొననున్నారు. హిందీ, ఇంగ్లీషుతో పాటు తెలుగు, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, మలయాళం, కన్నడ, తమిళ్, ఒడియా, ఉర్దూ, పంజాబీ, మణిపురి, కొంకణి భాషల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిర్వహించే కానిస్టేబుల్ జీడీ పరీక్షను కూడా ప్రాంతీయ భాషల్లో నిర్వహించేందుకు కమిషన్, కేంద్ర హోంశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

## పంజాబ్‌లో బీజేపీ అకాలీదళ్ చర్చలు విఫలం!

చండీగఢ్, ఫిబ్రవరి 11: పంజాబ్‌లో బీజేపీ, శిరోమణి అకాలీదళ్ పార్టీల మధ్య లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుకు చర్చలు విఫలమైనట్లు సమాచారం. బీజేపీ రాష్ట్ర నాయకత్వం దీనికి వ్యతిరేకంగా ఉండడం... దీనికి తోడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొని జైలు పాలైనవారిని విడుదల చేయాలని శిరోమణి అకాలీదళ్ బీజేపీపై ఒత్తిడి చేస్తుండడంతో కమలం పార్టీ ఆలోచన మారింది. శిరోమణి అకాలీదళ్ అగ్రనేత ప్రకాశ్ బాదల్ రైతు చట్టాలకు నిరసనగా 2020లోనే కమలం పార్టీతో తెగతెంపులు చేసుకున్నారు. మరోవైపు పంజాబ్‌లో అన్ని సీట్లకు ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు ఆప్ ప్రకటించినందున తాము కూడా ఒంటరిగానే బరిలో దిగాలని బీజేపీ అగ్రనాయకత్వం యోచిస్తున్నట్లు చెబుతున్నారు.

# ఐరాస ఏజెన్సీ కిందే హమాస్ టన్నెల్!

- ఆధారాలతో ఇజ్రాయెల్ ఆరోపణలు
- రఫాలో 110 మంది శరణార్థుల మృతి

గాజా, ఫిబ్రవరి 11: హమాస్ ఉగ్రవాదులకు ఐక్య రాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రిఫ్యూజీ(యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) సిబ్బంది సహకారంపై ఇజ్రాయెల్ మరోమారు ఆరోపణలు చేసింది. గాజాలోని యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ హెడ్‌క్వార్టర్స్ కిందే హమాస్ భారీ టన్నెల్ ఉందని ఆధారాలతో సహా వెల్లడించింది. భూగర్భంలో 18 మీటర్ల లోతులో ఉన్న ఆ సొరంగం 700 మీటర్ల పొడవుతో కొనసాగుతోందని, ఆ టన్నెల్‌కు యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ కార్యాలయం నుంచే విద్యుత్తు సరఫరా జరిగిందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వివరించింది. ఈ ఆరోపణలను యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ ఖండించింది. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడులు జరగ్గా.. హమాస్‌పై ప్రతిదాడులు మొదలైనట్లు గుర్తుచేసింది. ఆ తర్వాత ఐదు రోజులకు- అంటే.. అక్టోబరు 12న ఇజ్రాయెల్ ఆదేశాలతో తాము ఆ కార్యాలయాన్ని విడిచిపెట్టినట్లు వివరించింది. ఈ ఆరోపణలపై ఐరాస దర్యాప్తు ప్రారంభించింది. ఇజ్రాయెల్‌పై దాడిలోనూ హమాస్ తరఫున యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ సిబ్బంది పాల్గొన్నట్లు ఇజ్రాయెల్ ఆరోపణలు చేయగా.. పలువురిని తొలగించిన విషయం తెలిసిందే. కాగా.. రఫా శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 110 మంది మృతిచెందినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రారంభమైన తర్వాత.. సుమారు 13 లక్షల మంది పౌరులు రఫాలోనే తలదాచుకుంటున్నారని తెలిపింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి జరిపిన దాడుల్లో 110 మంది మరణించారని, వారిలో 12 మంది చిన్నారులున్నారని పేర్కొంది. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఖాన్‌యూనిస్ నగరాన్నే లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. హమాస్ అగ్రనేతలు సిన్వర్ వంటివారు అక్కడే తలదాచుకుంటున్నట్లు ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇప్పుడు ఖాన్‌యూనిస్‌లో భవనాలన్నీ నేలమట్టమై ఉన్నాయని, భూగర్భంలో సొరంగాలను గుర్తించి, నాశనం చేయాలనే ఉద్దేశంతో ఇజ్రాయెల్ తవ్వకాలు చేపడుతోందని సీఎన్ఎన్ న్యూస్‌చానల్ వెల్లడించింది.



రఫాలో ఇజ్రాయెల్ దాడి దృశ్యం

# రేపు ఢిల్లీలో మళ్లీ రైతుల నిరసన

**అష్టదిగ్బంధనం చేసిన భద్రతాదళాలు.. పంజాబ్, హరియాణా సరిహద్దులు మూత**

- నేటి సాయంత్రం చండీగఢ్‌లో రైతులతో కేంద్రం చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయోత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌పై మరోసారి ఫిబ్రవరి 13న వేలాది మంది రైతులు ఢిల్లీని చుట్టుముట్టనున్నారు.పంజాబ్, హరియాణా, రాజస్థాన్, యూపీ, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి రైతులు ఢిల్లీలో ప్రవేశించనున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ సంఘ్‌తో పాటు 200 రైతు సంఘాల తరఫున కనీసం 20 వేలమందికి పైగా రైతులు 2,500 ట్రాక్టర్లలో ఢిల్లీలో భారీ మార్చ్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రైతుసంఘాలు అనేక రాష్ట్రాల్లో 40కి పైగా రిహార్సల్స్ జరిపారని, 100 సమావేశాలు జరిపారని సమాచారం అందడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసాల ఎదురుగా కూడా వారు నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సమాచారం అందడంతో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా పొలిమేరలను ఇప్పటికే అష్టదిగ్బంధనం చేశారు. సరిహద్దుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే రైతులను తరలించడం కోసం హరియాణా సర్కారు రెండు పెద్ద స్టేడియాలను తాత్కాలిక జైళ్లుగా మార్చింది. ఏడు జిల్లాల్లో మొబైల్, ఇంటర్నెట్ సర్వీసుల్ని నిలిపివేశారు. కాగా, సోమవారం సాయంత్రం రైతుల డిమాండ్లపై చండీగఢ్‌లో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, గోయల్, నిత్యానంద్‌రాయ్ చర్చలు జరపనున్నారని పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ జనరల్ సెక్రటరీ తెలిపారు. మరోవైపు, రైతుల నిరసనలకు, మంగళవారం నిర్వహించతలపెట్టిన భారీ మార్చ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మద్దతు ప్రకటించారు.




పంజాబ్, హరియాణా సరిహద్దులో బారికేడ్లు

### పంజాబ్-భారత్ మధ్య సరిహద్దులా: మాన్

రైతులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలని, పంజాబ్‌కు భారత్‌కు మధ్య సరిహద్దులు సృష్టించవద్దని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ హితవు పలికారు. జాతీయ రహదారులు, ఇతర రోడ్లపై హరియాణా ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో మాన్ స్పందించారు. 'హరియాణాలో ఏం జరుగుతుంది? పంజాబ్ సరిహద్దు వెంబడి వాళ్లు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్నట్లు ఫెన్సింగ్‌లను పంజాబ్ సరిహద్దులో ఏర్పాటు చేస్తున్నారా?' అని మాన్ నిలదీశారు.

## అంతరిక్షంలో భారత్ స్పేస్ సెంటర్

**'చంద్రయాన్' ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరముత్తువేల్**

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ కీర్తిప్రతిష్ఠలు ప్రపంచవ్యాప్తంగా చాటేలా అంతరిక్షంలో భారత్ స్పేస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వీరముత్తువేల్ తెలిపారు. నీలగిరి జిల్లా ఊటీలో ఓ ప్రైవేటు కళాశాలలో 'అంతరిక్షంలో భారత్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వీరముత్తువేల్ చంద్రయాన్ ప్రాజెక్ట్ గురించి ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం 'ఇస్రో' ఆధ్వర్యంలో రిమోట్ సెన్సింగ్, సమాచార సాంకేతిక, వాతావరణం, జీపీఆర్ఎస్, సముద్ర గర్భంల గురించి పరిశోధనలు జరుపుతున్నట్టు తెలిపారు. అంతేకాకుండా అంగారక, సూర్య గ్రహాలపై పరిశోధన నిమిత్తం ఉపగ్రహాలను ప్రయోగించామని, ప్రస్తుతం అవి విజయవంతంగా పనిచేస్తున్నాయన్నారు. 2040లోపు చంద్రునిపైకి మానవుడిని పంపే ప్రక్రియ పూర్తిచేస్తామని, చంద్రయాన్ ఉపగ్రహం ల్యాండర్, రోవర్‌లతో రూపొందించామని, దీని ఆయుష్షుకాలం ముగిసిందని, ఏ లక్ష్యంతో దీన్ని ప్రయోగించామో ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ఇస్రో తరఫున అంతరిక్షంలో భారత్ స్పేస్ సెంటర్‌ను ఏర్పాటుచేసే చర్యలు కూడా ముమ్మరం చేసినట్టు వీరముత్తువేల్ పేర్కొన్నారు.

# పాక్‌లో కుర్చీలాట!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నిస్తున్నాయి. పీఎంఎల్-ఎన్ 75 సీట్లు సాధించి దిగువసభలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. పీపీపీ 54 సీట్లు, ఇతర చిన్న పార్టీలన్నీ కలిపి 34 సీట్లు గెలుపొందాయి. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ దిగువ సభలో 265 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ఒక నియోజకవర్గం ఫలితాన్ని పాకిస్థాన్ ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. మిగిలిన 264 స్థానాల ఫలితాలను ప్రకటించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 133 మంది ఎంపీల మద్దతు అవసరం. వాస్తవానికి పాక్ దిగువసభలో మొత్తం 336 స్థానాలు ఉండగా, 70 స్థానాలకు మహిళలను, మతపరమైన మైనారిటీలను నామినేట్ చేస్తారు. ఈ నామినేటెడ్ స్థానాలను పార్టీలు తమ ఎంపీల సంఖ్యాబలం ఆధారంగా గెల్చుకుంటాయి కాబట్టి, అత్యధికసంఖ్యలో ఎంపీలు ఉన్న పార్టీకే అత్యధిక నామినేటెడ్ ఎంపీ పదవులు కూడా దక్కుతాయి. కాబట్టి, ప్రభుత్వ ఏర్పాటుకు.. ప్రత్యక్ష ఎన్నికలు జరిగే 265 స్థానాల ఫలితాలే కీలకం. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజా తీర్పును గౌరవించాలని, తమ పార్టీనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని పీటీఐ డిమాండ్ చేస్తోంది. అయితే, అది సాధ్యమయ్యేలా లేదు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ ఫిర్యాదులు రావడంతో పీటీఐ ఎన్నికల గుర్తు 'క్రికెట్ బ్యాట్'ను ఆ పార్టీ అభ్యర్థులు వినియోగించుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఆ పార్టీ మద్దతుదారులంతా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. ఇప్పుడు వారంతా తిరిగి పీటీఐలో చేరాలంటే, పార్టీ అంతర్గత ఎన్నికలు నిర్వహించుకొని, తిరిగి ఎన్నికల గుర్తును పొందాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, పీపీపీ, ఇతర చిన్నపార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పీఎంఎల్-ఎన్ నేత నవాజ్ షరీఫ్ ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పీఎంఎల్-ఎన్, పీపీపీ మధ్య చర్చలు జరిగాయి. అయితే, తనకు ప్రధాని పదవి ఇవ్వాలని పీపీపీ చైర్మన్, 35 ఏళ్ల బిలావల్ భుట్టో డిమాండ్ చేశారని, దీనికి పీఎంఎల్-ఎన్ అంగీకరించలేదని అంతకుముందు వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, పీటీఐ మద్దతుతో ఎన్నికల్లో గెలిచిన ఓ ఇండిపెండెంట్ పీఎంఎల్-ఎన్‌లో చేరారు. దీంతో ఇతర స్వతంత్ర అభ్యర్థులు కూడా ఇదే బాట పడతారన్న విశ్లేషణలు వెలువడ్డాయి. పీఎంఎల్-ఎన్, పీపీపీ పొత్తు ప్రయత్నాలను పీటీఐ తీవ్రంగా తప్పుబట్టింది. దేశంలో నెలకొన్న ఆర్థిక, పాలనాపరమైన సంక్షోభానికి ఈ పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేసిన గత సంకీర్ణ ప్రభుత్వమే కారణమని, వీళ్లంతా క్రిమినల్స్ అని మండిపడింది. అత్యధిక సీట్లు గెల్చుకున్న తమకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కు ఉందని పేర్కొంది.



ఎన్నికల ఫలితాలకు వ్యతిరేకంగా ఇమ్రాన్‌ఖాన్ మద్దతుదారుల నిరసనలు

## 59వేల మంది భారతీయులకు అమెరికా పౌరసత్వం

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: అమెరికాలో గత ఏడాది 8.7 లక్షల మంది విదేశీయులకు ఆ దేశ పౌరసత్వం లభించగా అందులో భారతీయులు 6.7శాతం మంది ఉన్నారు. మొత్తం 59,100 మంది భారతీయులకు బైడెన్ ప్రభుత్వం అమెరికా పౌరసత్వాన్ని ఇచ్చింది. అమెరికా పౌరసత్వం పొందిన వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. 1.10 లక్షల మంది (12.7%)తో మెక్సికన్లు మొదటి స్థానాన్ని పొందారు. 2022తో పోల్చితే ఈ సంఖ్య కొంత తక్కువగానే ఉంది. ఆ ఏడాది మొత్తం 6.69 లక్షల మంది విదేశీయులకు అమెరికా పౌరసత్వం లభించగా అందులో భారతీయుల వాటా 6.8 శాతం.

## ఉయ్యాలకి బదులు అవెన్‌లో పాపను పడుకోబెట్టిన తల్లి

కాన్సాస్, ఫిబ్రవరి 11: అమెరికాలో తల్లి నిర్లక్ష్యం వల్ల ఓ పసిపాప మరణించింది. పిల్లలను నిద్ర పుచ్చడానికి ఉయ్యాలలో వేస్తాం. కాని మరియా థామస్ అనే మహిళ పాపను అవెన్‌లో పెట్టింది. దీంతో ఆ పసికందు చనిపోయింది. ఈ హృదయవిదారక ఘటన కాన్సాస్ సిటీలోని మిస్సోరీలో జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం ఓ పసికందుకు ఊపిరాడటం లేదని పోలీసులకు సమాచారం అందింది. పాప శరీరంపై కాలిన గాయాలు ఉన్నాయని, అప్పటికే పాప మరణించిందని అక్కడికి వెళ్లిన పోలీసులు ధ్రువీకరించారు. దీంతో శనివారం తల్లి మరియాపై కేసు నమోదు చేశారు. "పాపను నిద్ర పుచ్చడానికి ఉయ్యాలలో వేయడానికి బదులు పొరపాటున అవెన్‌లో పెట్టింది" అని ప్రత్యక్ష సాక్షి చెప్పినట్లు తెలిపారు.

# నేడో, రేపో రెవెన్యూశాఖలో మరిన్ని బదిలీలు

- మల్టీజోన్- 1, 2లో 129 మంది తహసీల్దార్ల బదిలీ
- డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్ల బదిలీల్లో మార్పులు చేర్పులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో మరిన్ని బదిలీలకు రంగం సిద్ధమైంది. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్ల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు నేడో, రేపో వెలువడనున్నాయి. వీరితో పాటు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్‌లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరగనున్నాయి. శనివారం ఐదు జిల్లాలకు అదనపు (రెవెన్యూ) కలెక్టర్లను నియమిస్తూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీచేశారు. వీరితో పాటు 37 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. అదే విధంగా మల్టీజోన్- 1 పరిధిలో 81 మంది మల్టీజోన్- 2 పరిధిలో 48 మంది తహసీల్దారులను బదిలీ చేశారు. అయితే వీరిలో కొందరి పోస్టుల్లో మార్పులు చేర్పులు చేసి మరోసారి ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవలే హైదరాబాద్ సౌత్ జోన్ జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ అయిన విషయం తెలిసిందే. దీని భర్తీతో పాటు శేరిలింగంపల్లి తహసీల్దార్, రాజేంద్రనగర్ డివిజన్ ఆర్డీఓ పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు సమాచారం.

## పోలీసుల అదుపులో పౌరహక్కుల సంఘం నేత రాజేశం

- నాటకీయ పరిణామాల మధ్య ఛతీస్‌గఢ్‌కు తరలింపు

జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోశాధికారి పోగుల రాజేశంను ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సంఘం నేతలు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... జగిత్యాల జిల్లాలోని సారంగపూర్ మండలం రేచపల్లి గ్రామంలోని పోగుల రాజేశం ఇంటికి రెండు నంబరు ప్లేట్లులేని వాహనాల్లో సుమారు ఎనిమది మంది వ్యక్తులు వచ్చారు. దంతేవాడ జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లో గల ఓ కేసులో విచారణ కోసం తీసుకువెళ్తున్నామని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఎందుకని ప్రశ్నించినప్పటికీ రాజేశంను, ఆయన భార్య మల్లీశ్వరిని బలవంతంగా వాహనంలోకి ఎక్కించారు. రేచపల్లి శివారులోకి వెళ్లిన అనంతరం మల్లీశ్వరీని వాహనం నుంచి దింపేసి వెళ్లిపోయారు. గ్రామస్థులు ఈ విషయంపై సారంగపూర్ ఎస్ఐ తిరుపతికి సమాచారం అందించగా, రాజేశంను తీసుకెళ్లింది దంతేవాడ జిల్లా గీదం పోలీసులేనని ఆయన స్పష్టం చేశారు.

# వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

## అక్కడికి వెళుతూ...

1
ఎన్నో దుఃఖాలు ఈది, భయాలు దాటి
ఏళ్ళకి ఏళ్ళు నడిచి
ఈ ప్రశాంతమైన ఉదయానికి చేరుకున్నావు
ఈ క్షణం స్వచ్ఛ స్ఫటికంలా
నిలిచిపోతే బావుండును అనిపిస్తుందా
ఇక మెల్లగా మంచులా చెదురుతుంది ప్రశాంతత



2
ఈ బస్సు పైన ఆకాశం
అలసట లేక హాయిగా ఎగురుతూవుంది
కొండలు ఎప్పటిలా దయలోకి ముడుచుకొని
బంగారు ఎండ కాగుతున్నాయి
వాటి ముందు కదిలిన కలలన్నిటిలానే
నువ్వూ మాయమౌతావు



3
నీ జ్ఞాపకాలు
ఈ గాలిలోకి ఇంకా ఆవిరికాకుండా
మిగిలిన అనుభవాల మేఘమాలలు
వాటిని వదిలేస్తే చాలు
జీవితంలో మునిగిపోతావు
కానీ, జీవితమంటే ప్రేమా, కాదా
ఇప్పటికీ తేల్చుకోలేదు కదా



4
తెలీనిభాషలో మాటలు నీ ప్రక్కన
పిట్టల కూతల్లానే కేవలం శబ్దాలు
అర్థం తెలీని మాటలు
అర్థాల నుండి విముక్తినిస్తాయి కాసేపు
అర్థం లేకపోవటంలోకి ఎగరలేక కదా
ఇదంతా ఇంత బరువు



5
ఆ కొండని చూస్తే దేవుడిని చూసినట్టు
తిరిగితే తండ్రి చుట్టూ ఆడుకొంటున్నట్టు
సృజించుకొన్న బంధమో, ఉద్వేగమో కావచ్చు
కొండంత అద్దంలో నువ్వే కనబడటమూ కావచ్చు
ఏ కారణమూ లేదనుకున్నా
దయలోకి కరిగిపోవటం కంటే ఏదీ అనుభవం



6
కారణాల్ని కూడా దాటాలి
ఈ బస్సు చెట్లనీ, కొండల్నీ దాటుతూ
కనబడని మలుపులోకి పదేపదే మాయమైనట్టు
కనబడని ఆనందం లోకి
తిరిగి రాకుండా తప్పిపోవాలి



(అరుణాచలం దారిలో)

బివివి ప్రసాద్
90320 75415

### 'వినిర్మాణం' ఆవిష్కరణ

సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'వినిర్మాణం', 'తాత్త్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' పుస్తకాల ఆవిష్కరణ ఫిబ్రవరి 18న హైద రాబాద్ బుక్‌ఫేర్, ఎన్టీఆర్ స్టేడియం, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభా ధ్యక్షత: సంగిశెట్టి శ్రీనివాస్, ముఖ్య అతిథి & అంకిత స్వీకర్త: ఎన్. గోపి, వినిర్మాణం ఆవిష్కర్త: కె. శ్రీనివాస్, వక్త: బాణాల భుజంగ రెడ్డి; 'తాత్త్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' గ్రంథ ఆవిష్కర్త: గుడిపాటి, వక్త: ఎన్. వేణుగోపాల్.

**కవిలె తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరల్ సెంటర్**

## 'జయజయహే' ఎందుకు?

"జయజయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలూ ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం" ...ఈ పల్లవిలో, తరువాత వచ్చే అనేక చరణాలలో, ప్రతిచరణం చివరా పునరావృత్తమయ్యే జై తెలంగాణ నినాదోచ్చాటనలో ఏ విశేషాలున్నాయని ఉద్యమగీతంగా, సంకల్పగీతంగా, ప్రార్థనాగీతంగా తెలంగాణ సమాజం స్వీకరించింది? రాష్ట్ర అవతరణ తరువాత తొమ్మిదిన్నరేండ్ల పాటు పాలించిన ప్రభుత్వం, ఈ పాటకు అధికార ప్రతిపత్తి ఇవ్వడానికి నిరాకరించినప్పటికీ, పాఠశాలల్లో సభల్లో స్వచ్ఛంద ఆలాపనలు ఎందుకు జరుగుతూ వచ్చాయి?

విశేషాలు అనేకం. ఆ గీతం కలిగించే ఉద్వేగం, ప్రేరణ, ఉత్సాహం, దీక్షాభావం సామాన్యమైనవి కావు. వందల వేలాది మందిని ఒకే గొంతుగా మార్చగలిగే మహిమ ఏదో దానికి ఉన్నది. అట్లాగని అద్భుతమైన కవిత్వమేదో అందులో ఉన్నదని చెప్పలేము. చెప్పకూడదు కూడా. దీని కంటె గొప్ప కవిత్వం ఉన్న పాటలు అందెశ్రీ అనేకం రాశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గొప్ప భావుకతను, వ్యక్తీకరణను కలిగిన పాటలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. కానీ, 'గీతం' (anthem)గా ఈ ఒక్క పాటనే జనం ఎంచుకున్నారు.

ఈ పాటలో కవిత్వం ముఖ్యం కాదు అంటే, దానికి మరేదో ఘనత ఉన్నదని, తనకు మాత్రమే చెందిన ఒక ప్రత్యేకత ఉన్నదని అర్థం. ఈ పాట జాతీయ గీతాల కోవలోనిది. ప్రజల సమూహ సంస్కృతిలో భాగంగా, ఉద్యమాలలో భాగంగా వెలువడే పాటల్లో కొన్ని జాతీయగీతాల రూపు తీసుకుంటాయి. వాటిలో కొన్ని ప్రభుత్వాల గుర్తింపు కూడా పొందుతాయి, అనేకం ప్రజల నాలుకల మీద మాత్రమే వి ఎగులుతాయి. అనధికార జాతీయగీతాలు ప్రపంచమంతా ఉనికిలో ఉన్నాయి.



జాతీయ, ప్రాంతీయ, సామాజిక అస్తిత్వాలకు కొన్ని చిహ్నాలు ఉంటాయి. ఒక జెండా, ఒక ముద్ర, ఒక గీతం. సామూహిక సాంస్కృతిక స్ఫురణలతో ఆ చిహ్నాలు రూపొందుతాయి. ఆయా సమూహాలను ఏకం చేసే గుణం వాటికి ఉంటుంది. ఒకరికొకరు అపరిచితులైనవారు కూడా, ఒకే పాటకు గొంతు కలుపుతారు. సహోదరులుగా మారిపోతారు. ఉద్యమ సందర్భంలో సభల్లో ఊరేగింపుల్లో ఆందోళనల్లో ఇటువంటి గీతాలు ఇంధనంలాగా పనిచేస్తాయి.

ఈ గీతాలకు ఉండవలసిన ప్రధాన లక్షణం, ఎవరైనా పాడగలిగేట్టు ఉండడం. అందుకోసం పాట నడక ఒక మోస్తరు వేగంతో, బాణీ మాధుర్యం అనుభూతమయ్యేట్టుగా ఉండాలి. సులువుగా గుర్తుంచుకునేట్టుగా, పదేపదే ఆలపించాలనిపించేట్టు ఉండాలి. చిన్నచిన్న మాత్రల సంపుటులతో పాదాలు ఉండాలి. మార్చింగ్ బాణీ కానీ, ఆరాధనాత్మక భావం కలిగే బాణీ కానీ అయితే మంచిది. బృందాలుగా పాడడానికి, పాటలో కొన్ని చరణాలు లేదా పునరావృత్త భాగాలు శ్రోతలు గొంతు కలపడానికి అనువుగా ఉండాలి. ఎంత నెమ్మది నడక ఉన్నా, మధ్యలో బాణీ ఎంతో కొంత ఉచ్చస్థాయికి వెళ్లి, దిగాలి. 'జనగణమన'లో ఆ నడక చూడవచ్చు. ప్రపంచంలో ఉన్న జాతీయగీతాలను పరిశీలించి, విమర్శకులు ఇటువంటి కొన్ని సాధారణ సూత్రాలను గుర్తించారు.

మద్రాసు నుంచి విడిపోవడానికి బ్రిటిష్ ఆంధ్రులు చేసిన ఉద్యమంలో అనేక తెలుగు జాతీయగీతాలు వెలువడ్డాయి. తొలిరోజుల్లో వచ్చిన 'ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకము' దగ్గర నుంచి వేములపల్లి శ్రీకృష్ణ 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!' దాకా ఉద్యమ సందర్భాలలో ఆలపించిన గీతాలు అనేకం. వాటిలో కూడా ఘనచరిత్రను గర్వభావాన్ని కలిగించే అంశాలు, సమష్టి తత్వాన్ని ప్రేరేపించే అంశాలు ఉన్నప్పటికీ, ఆరాధనా భావంతో చేయవలసిన సామూహిక ఆలాపనకు పూర్తిగా అనువుగా లేకపోయాయి. చివరకు శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' తెలుగు అభిమానుల ప్రార్థనాగీతంగా స్థిరపడింది. 'వందేమాతరం' గీతం లాగే, 'సారే జహాసే అచ్ఛా' లాగే, 'మా తెలుగు తల్లికి' కూడా అల్లనల్లన నడకతో, మధురమైన బాణీలో సాగుతుంది. బృంద ఆలాపనకు అనువుగా ఉంటుంది.

అందెశ్రీ 'జయజయహే' పాటకు గుర్తింపు ఇవ్వడానికి కె. చంద్రశేఖరరావు విముఖులని, ఆయనకు అభ్యుదయకవి రావెళ్ల వెంకట రామారావు 1950లలో రాసిన సుప్రసిద్ధ గీతం 'నా తల్లి తెలంగాణ' వైపు మొగ్గు ఉండిందని చెప్పుకుంటారు.

"కదనాన క్రతువుల కుత్తుకల నవలీల
నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి
ధీరులకు మొగసాలరా!
తెలగాణ వీరులకు కాణాచిరా!"

- అంటూ మొదలయ్యే రావెళ్ల గీతం తెలంగాణపై చారిత్రక గర్వ భావాన్ని, ఉద్వేగాన్ని కలిగించేదే. అయితే, ఆ పాట బాణీ, గాయకుడు పాడితే, శ్రోతలు ఆనందించేట్టు ఉంటుంది తప్ప, సామూహిక గానానికి అనువుగా ఉండదు, ప్రతి చరణమూ ఒకే నడక కలిగిన భిన్నమైన పాదాలతో ఉంటుంది తప్ప, పునరావృత్తమయ్యే పాదాలు లేవు. భాష కూడా కొంత పాతదనంతో ఉంటుంది. అన్నిటికీ మించి, తెలంగాణ ప్రత్యేక అస్తిత్వం రాజకీయ ఉద్యమానికి సంబంధించిన వ్యక్తీకరణ ఆ పాటలో లేదు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ పాటను కూడా విరివిగా పాడుకున్నారు. కానీ, అందెశ్రీ పాటకు లభించిన స్వీకరణ వేరు.

పాట మౌలికంగా మౌఖిక కళారూపం కాబట్టి, దానికి లిఖిత రచనకు ఉన్న స్థిరత్వం సహజంగా సంక్రమించదు. పాట రూపొందడమే క్రమానుగతంగా రూపొందుతుంది. పాడిన ప్రతిసారీ కవి గాయకుడైనా, కేవల గాయకుడైనా ఎంతో కొంత భిన్నంగా పాడతారు. 'జయజయహే' గీతం కూడా కొంత కాలవ్యవధిలో క్రమంగా అవతరిస్తూ వచ్చింది. అందెశ్రీ స్వయంగా మెరుగుపరుస్తూ పోయారు. ఉద్యమకాలపు సహచరులు అనేకమందితో సంప్రదిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే క్రమంలో కేసీఆర్ కూడా ఈ పాట రూపొందుతున్న ప్రక్రియలో అందెశ్రీతో రెండడుగులు నడిచారు. ఆ నాడు, ఈ పాటను మెచ్చిన నాయకుడు, తరువాత ఎందుకు భిన్నవైఖరి తీసుకున్నారో తెలియదు.

'జనగణమన' గీతంలో భారతదేశ నైసర్గిక విశేషాలను, వివిధ ప్రాంతాలను ప్రస్తావిస్తే, 'వందేమాతరం'లో భారతమాత చక్కటి మాటను, తియ్యటి పలుకును, స్వచ్ఛరూపాన్ని కీర్తించారు. అందెశ్రీ గీతంలో తెలంగాణ చరిత్రను, ముఖ్యంగా చారిత్రక చిహ్నాలుగా ఉండిన వ్యక్తులను, కవులను, వీరులను పేర్కొంటూ, ప్రాకృతిక వనరులను, అవి ప్రజలకు చెందాలనే ఆకాంక్షను కీర్తిస్తారు. ప్రతి చరణం ముగిసిన వెంటనే -

'జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ' అన్న ఉచ్చాటన మొత్తం పాటను, శ్రోతల భావోద్వేగాలను విద్యుదీకరిస్తుంది. పంపన, బద్దెన, హాలుడు, పాలకుర్కి, పోతన, రామదాసు, మల్లినాథ సూరి, ద్విగుడు మొదలైన తెలుగు, సంస్కృత కవి పండితుల ప్రస్తావనలతో కొన్ని చరణాల పాటు తెలంగాణ ఘనతను వర్ణించిన కవి, తరువాత రాణులు, రాజులు, వీరులు, తిరుగుబాటుదారులు, శిల్ప వాస్తు ప్రతీకలను పూసగుచ్చుతారు. తెలంగాణ కళాజీవనాన్ని చెబుతూ, 'అనునిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం' అన్నప్పుడు, ఒక్కసారిగా శ్రోతల మనసుల్లో 'తెలంగాణ తల్లి' ఆవిష్కృతమవుతుంది. ఆ తరువాత, తెలంగాణకు ఏ శ్రేయస్సు కావాలో, భవితవ్యం ఎట్లా ఉండాలో కవి చెప్పుకునే సంకల్పం, రాష్ట్ర అవతరణ అనంతర పునర్నిర్మాణ ఆశయాలను సూచిస్తుంది. 'బడుల గుడులతో జనవిజ్ఞానం విరియాలని ఆకాంక్షిస్తూ "తడబడకుండా జగాన తల ఎత్తుకొని బ్రతుక ఒక జాతిగ నీ సంతతి ఓ యమ్మా వెలగాలి" అన్న ఆశ్వాసనను ఈ గీతం పలుకుతుంది. సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ ప్రజలల కలలు పండాలని కవి ఇచ్చిన ముక్తాయింపు, ఉద్యమ ఆశయాలను ఆర్ద్రంగా చెబుతుంది.

> **గీతాలాపన జరుగుతున్నప్పుడు, అది భాగస్వామ్య శ్రోతలలో కలిగించిన, కలిగిస్తున్న సామూహిక స్పందనే 'జయజయహే'ను తెలంగాణ రాష్ట్రగీతంగా అవతరింపజేసింది. ఒకప్పుడు ఉద్యమవాతావరణం, గీతం నుంచి ఒక స్వప్నావేశాన్ని, పట్టుదలను గ్రహిస్తే, ఇప్పుడు, ప్రత్యేక రాష్ట్రం అనే వాస్తవం, అదే గీతం నుంచి అస్తిత్వ గర్వాన్ని సంతృప్తి పరుచుకుంటుంది. ఆశించినవి నెరవేరాయా, నిరాశలోనూ జాతిగీతం ఉద్దీపన ఇస్తుందా అన్న సందేహాలు మిగిలే ఉంటాయి. కానీ, ఆకాశాలను అందుకునే ప్రయత్నాలు ఎప్పుడూ ఆగిపోవు.**

ఉగ్రూతలూగుతున్న ఉద్యమసమాజంలోకి పాట వెళ్లినప్పుడు, అది ఇక ప్రజల సొత్తు మాత్రమే. మెరుగులు దిద్దుతూ, సవరిస్తూ కవి నుంచి అనేక వెర్షన్లు వచ్చినా, జనం ఏదో ఒకదాన్ని స్థిరపరుస్తారు. సుదీర్ఘం అనుకుంటే క్లుప్తం చేసుకుంటారు. 'వందేమాతరం' వంటి అనేక జాతీయగీతాలు పాడడానికి వీలుగా క్లుప్తరూపాన్ని, సరళరూపాన్ని తీసుకున్నాయి. తన పాట మీద తనకు అధికారం ఉందా లేదా అన్న చర్చ కంటె, ఆ పాట గమనం మీద కవికి ఇక నియంత్రణ ఉండదన్న గ్రహింపు ముఖ్యం.

గీతాలాపన జరుగుతున్నప్పుడు, అది భాగస్వామ్య శ్రోతలలో కలిగించిన, కలిగిస్తున్న సామూహిక స్పందనే 'జయజయహే'ను తెలంగాణ రాష్ట్రగీతంగా అవతరింపజేసింది. ఒకప్పుడు ఉద్యమవాతావరణం, గీతంనుంచి ఒక స్వప్నావేశాన్ని, పట్టుదలను గ్రహిస్తే, ఇప్పుడు, ప్రత్యేక రాష్ట్రం అనే వాస్తవం, అదే గీతం నుంచి అస్తిత్వ గర్వాన్ని సంతృప్తి పరుచుకుంటుంది. ఆశించినవి నెరవేరాయా, నిరాశలోనూ జాతిగీతం ఉద్దీపన ఇస్తుందా అన్న సందేహాలు మిగిలే ఉంటాయి. కానీ, ఆకాశాలను అందుకునే ప్రయత్నాలు ఎప్పుడూ ఆగిపోవు. తపనలున్న పాటలెపుడూ చల్లారిపోవు.

కె. శ్రీనివాస్

## సాహిత్య వికాసానికి సరికొత్త అడుగు

ఆధునిక సమాజం పొందుతున్న జ్ఞానాన్ని స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు: విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు. విజ్ఞాన శాస్త్రాలలో ప్రకృతి శాస్త్రాలు, జీవశాస్త్రాలు ఉంటాయి. రాజనీతి శాస్త్రం, చరిత్ర, అర్థశాస్త్రం మొదలైన అధ్యయనాలను కలిపి సామాజిక శాస్త్రాలు అంటారు. సాహిత్య సంబంధమైన విషయాలన్నీ మానవీయ శాస్త్రంలోకి వస్తాయి. ఆధునిక కాలం పూర్వార్ధంలో విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి ప్రపంచ గమనాన్ని మార్చింది. విజ్ఞాన శాస్త్రాలకు సమాంతరంగా ఎదిగిన సామాజిక శాస్త్రాలు విజ్ఞాన శాస్త్రాల ఆలంబనతో కుదురుకొని వికసించాయి.

ఆధునిక విశ్వవిద్యాలయాలు ఉనికిలోకి వచ్చాక శాస్త్రాలన్నీ అధ్యయనాంశాలుగా రూపొందాయి. అకడమిక్ పద్ధతులలో, ప్రమాణాలతో సిలబస్‌ను రూపొందించటం, పరిశోధనలు జరిపించటం విశ్వవిద్యాలయాల స్థాయిలో ప్రారంభమయ్యింది. పరిశోధనల ఫలితాలు ఎక్కువ మేరకు పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చేవిగా మారాక, వాటి మీద పెట్టుబడుల శాతం కూడా పెరిగింది. విజ్ఞాన శాస్త్రాల మీద కేటాయించిన బడ్జెట్‌తో పోల్చితే సామాజిక, మానవీయ శాస్త్రాల పరిశోధనకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. మానవీయ శాస్త్రాల మీద జరిగే పరిశోధనలు వ్యక్తుల ఆసక్తుల మీద ఆధారపడి జరిగాయే కానీ వ్యవస్థాగతంగా కాదనే విషయం జరిగిన పరిణామాలను బట్టి తెలుస్తుంది. విజ్ఞాన శాస్త్రాలకు ఉన్న ప్రాధాన్యత సామాజిక శాస్త్రాలకు ఉండదు. ఈ రెండింటి పట్ల ఉన్న మోజు మానవీయ శాస్త్రాల విషయంలో ఉండదు.

విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు ఆయా సందర్భాల్లో సమకాలీన పరిస్థితులకు అనువుగా రూపొందుతూ తమ ఉనికిని కాపాడుకుంటున్నాయి. కానీ మానవీయ శాస్త్రాలకు అనేక పరిమితులు ఏర్పడి, ఆటుపోట్లకు గురయ్యాయి. పరిశ్రమలు అనుసంధానంలో ఉంటూ విజ్ఞాన శాస్త్రాలు కొంత మేరకు నిధులను సమకూర్చుకుంటున్నాయి. దాని కోసం జాతీయంగా సమ్మేళనాలు కూడా జరుపుకుంటున్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ లాంటి సందర్భాలు వాటి గమనం, గమ్యం గురించి చర్చించుకోవడానికి దోహదపడుతున్నాయి. సైన్సెస్‌లో ఇప్పటివరకు జరిగిన పరిశోధనలు, చేయవలసిన పరిశోధనాత్మక కృషి మీద చర్చోపచర్చలు చేసి అంతిమ ఫలితాలను రాబట్టడానికి 1914లో మొదలైన సైన్స్ కాంగ్రెస్ వేదికగా ఉంటుంది. ఈ కోవలోనే సామాజిక శాస్త్రాలలో 1935 నుంచి ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ కూడా చాలా ప్రాచుర్యం పొందింది. చరిత్రలో జరిగిన, జరగవలసిన పరిశోధనల మీద విస్తృత చర్చలు, ప్రతిపాదనలు, నిర్ధారణలు ఈ సమావేశంలో జరుగుతాయి. అదేవిధంగా సోషియాలాజికల్ సొసైటీ, ఎకనామిక్స్ కాంగ్రెస్, కామర్స్ ఫోరం లాంటి సంస్థలు ఏర్పడి పనిచేస్తున్నాయి.

అయితే మానవీయ శాస్త్రాలలోని సబ్జెక్టులకు ఇలాంటి వేదికల ఏర్పాటు, నిర్వహణ చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతీయ భాషలు కావటం వలన కూడా వీటి విస్తృతికి పరిమితులు ఏర్పడ్డాయి. తెలుగు లాంటి భాషా సాహిత్యాల పట్ల స్థానిక ప్రభుత్వాల వైఖరి కూడా ఉదాసీనంగానే ఉంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యం సమాజ ప్రతిబింబంగా చలనంలో ఉంది. పురాణ, ఇతిహాసాల దశను దాటి కావ్య లక్షణాలను సంతరించుకొని చిక్కటి తెలుగు కవితను చిలకరించింది. మధ్యయుగాలలో సామాజిక అసమానతల మీద, అంధ విశ్వాసాల మీద కవిత్వమై తన అసమ్మతిని, తిరుగుబాటును ప్రకటించింది. ఆధునిక సందర్భంలో మనిషి కేంద్రంగా సాహిత్య సృజన జరుగుతుంది. రాజకీయార్థిక మార్పులకు తక్షణ స్పందనగా చైతన్య దీప్తిని వెలిగిస్తోంది.



గ్లోబలైజేషన్ కాలంలో కుదుపుకు గురైన సాహిత్యం తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పెనుగులాడుతుంది, చదువుల క్రమం మారిపోయింది. ఫలితంగా తెలుగు భాష విస్మరణకు గురవుతున్నది. మాతృభాషలో పొందే జ్ఞానం మరే ఇతర భాషలలో పొందలేమనే సత్యాన్ని అందరూ విస్మరించారు. వర్తమాన అవసరాలలో ఆంగ్లం అనివార్యం. ఒక భాషగా అందరికి ఆంగ్లం వచ్చి ఉండాలి. కానీ తల్లిభాష పట్ల నిరాదరణ జ్ఞాన సముపార్జనలో అనేక పరిమితులను విధిస్తుంది. ఇప్పుడిప్పుడే విద్యలోకి ప్రవేశిస్తున్న ఉత్పత్తి వర్గాల పిల్లలకు ఏ భాషలోనూ ప్రావీణ్యం ఉండటం లేదు. ఫలితంగా శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాలు కొరవడుతున్నాయి. బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాలకు కావలసిన సామర్థ్యాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. మరోవైపు తెలుగు అధ్యయనాంశంగా డిగ్రీ పొందిన వారికి ఉపాధి అవకాశాలు శూన్యమయ్యాయి. ప్రాథమిక పాఠశాలలో భాషా నైపుణ్యాలు అందకపోవటం వలన ఉన్నత విద్యలోకి ప్రవేశించిన తర్వాత విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఉన్నత పాఠశాల విద్య వరకే తెలుగు అధ్యయనాంశంగా ఉంది. ఇంటర్, డిగ్రీలలో ద్వితీయ భాష సంస్కృతానికి ప్రాధాన్యత పెరిగింది. ఈ స్థాయిలో తెలుగు బోధించే వాళ్లకు ఉపాధి లేదు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు మాతృభాషను శాస్త్రీయ పద్ధతులలో బోధించే మెకానిజం లేకపోవటం వలన భాషానైపుణ్యాలు క్షీణస్థాయిలో ఉంటున్నాయి.

ఈ యాభై ఏళ్లలో సాహిత్య రచనలోకి కొత్త కలాలు ప్రవేశంతో సాహిత్య వస్తువులో, శిల్పంలో మార్పు వచ్చింది. వ్యక్తీకరణ నైపుణ్యాలు కూడా కొత్తగా ఉంటున్నాయి. సృజనాత్మక సాహిత్యం మట్టి మనుషుల గాలి తగిలి పులకిస్తుంది. మునుపటి సాహిత్య ప్రమాణాలన్ని పూర్వ పక్షం అవుతున్నాయి. కొత్త ప్రమేయాలు సరికొత్తగా ఆవిష్కరించబడుతున్నాయి. కానీ వారి నైపుణ్యాలను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి సరైన వేదికలు ఉండటం లేదు. తమ వ్యక్తీకరణలో ఉండే లోపాలను సరిదిద్దే శిక్షణ కొరవడుతున్నది. ఫలితంగా సాహిత్య సృజనలోకి అసాహిత్యం ప్రవేశిస్తుంది.


> **తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు విశాల ప్రాతిపదిక, దార్శనిక భావన మూలధాతువుగా ఉంటుంది. మేధో మధనం ద్వారా సాహిత్య ప్రక్రియా వైవిధ్యాన్ని, సృజనాత్మక వికాసాన్ని, మూల్యాంకన పరికరాలను పదును పెట్టుకోవడమే లక్ష్యంగా ఈ కాంగ్రెస్ కొనసాగుతుంది. ఇక నుంచి హిస్టరీ కాంగ్రెస్, విజ్ఞాన శాస్త్రాలకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వలె తెలుగు సాహిత్యానికి లిటరరీ కాంగ్రెస్ చరిత్రలో నమోదవుతుంది.**

కన్నడ, తమిళ భాషలను రక్షించుకోవడానికి నిర్మాణాత్మకమైన సంస్థలు ఏర్పడి పనిచేస్తున్నాయి. భాష పట్ల పట్టింపు ఉంటుంది. కానీ తెలుగు భాష గురించి ఆలోచించే మనుషులే కరువైపోతున్న సందర్భం రానున్నది. దేశవ్యాపితంగా తెలుగు మాట్లాడే ప్రజలు పదిహేను కోట్లకు పైగా ఉంటారు. అనేక సంస్థలు తెలుగు సాహిత్య రంగంలో పనిచేస్తున్నాయి. అకాడమీలు కూడా ఉన్నాయి. పాతికకు పైగా వివిధ విశ్వవిద్యాలయాలలో తెలుగు శాఖలు సాహిత్యాన్ని బోధిస్తున్నాయి. భాషా పరిరక్షణ కోసం కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు శ్రమిస్తున్నారు. కానీ ఇన్ని పాయలుగా ఉన్న వ్యక్తులకు, సంస్థలకు ఉమ్మడి వేదిక లేదు. ఎవరికి వారుగా విసిరివేసినట్లుగా ఉన్నారు. ఈ అవరోధాలను, పరిమితులను అధిగమించడానికి పూనిక ఉండాలి. దేశ వ్యాపితంగా తెలుగు భాషా సాహిత్యాలలో ఆలోచనాపరులు, సృజనాత్మక రచయితలు, పరిశోధకులు, బోధనా వృత్తిలో ఉన్నవాళ్లు కలిసి అభిప్రాయాలను పంచుకొని అందరికి ఆమోదయోగ్యమైన విషయాల మీద ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. ఈ నేపథ్యం నుంచి వచ్చిన కొన్ని ఆలోచనల ఫలితంగానే మొదటిసారి తెలుగు లిటరరీ కాంగ్రెస్ జరుగబోతోంది.

దేశవ్యాపితంగా సాహిత్య రంగంలో నిమగ్నమై ఉన్న మూడు వందల మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటారు. వందమందికి పైగా ఈ సమావేశంలో సాహిత్య రంగంలో లోతుగా పనిచేస్తున్న పరిశోధకులు, అధ్యాపకులు, విమర్శకులు పాల్గొని పత్రసమర్పణ చేస్తారు. మరో యాభై మంది సృజనకారులు ఈ కాంగ్రెస్‌లో సామూహిక కవితా పఠనం, గానం చేస్తారు. ఇన్నిరకాల సాహిత్య వ్యాఖ్యాతలందరూ ఈ వేదిక మీది నుంచి సారవంతమైన ఆలోచనలు పంచుకుంటారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యాన్ని మదింపు చేయడానికి నిపుణులైన సాహితీ వేత్తలు మూడు రోజులలో వివిధ అంశాల మీద ప్రసంగిస్తారు. తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు విశాల ప్రాతిపదిక, దార్శనిక భావన మూలధాతువుగా ఉంటుంది. మేధో మధనం ద్వారా సాహిత్య ప్రక్రియా వైవిధ్యాన్ని, సృజనాత్మక వికాసాన్ని, మూల్యాంకన పరికరాలను పదును పెట్టుకోవడమే లక్ష్యంగా ఈ కాంగ్రెస్ కొనసాగుతుంది. ఇక నుంచి హిస్టరీ కాంగ్రెస్, విజ్ఞాన శాస్త్రాలకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వలె తెలుగు సాహిత్యానికి లిటరరీ కాంగ్రెస్ చరిత్రలో నమోదవుతుంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ వందేళ్ల చరిత్రను నమోదు చేసుకున్నాయి. తెలుగు నేల పునరుజ్జీవనంలో వీటి కృషి విస్మరించలేనిది. ఆర్థిక, రాజకీయ, సామాజిక సంవాదంలో ఇవి పాలుపంచుకున్నాయి. సామాజిక, సాహిత్య చరిత్ర పురోగవించడానికి ఓయూ, తెలుగుశాఖ తమ జ్ఞానసంపదను జోడించాయి. తెలుగు సాహిత్య బోధన, పరిశోధన, విశ్లేషణ రంగాలలో నూతన ఒరవడిని, కొత్త ప్రమేయాలను సృష్టించిన ఘనత ఓయూ తెలుగుశాఖకు దక్కింది. ఆ ఒరవడిని కొనసాగిస్తూ 15, 16, 17 ఫిబ్రవరి 2024న మూడు రోజుల పాటు జరిగే తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు వేదిక కాబోతుంది. లిటరరీ కాంగ్రెస్ ఆలోచనకు, ప్రణాళికకు, ఆచరణకు తెలుగుశాఖ మూలధాతువు. నిర్దిష్టంగా ఈ మూడు రోజులలో కవిత్వతత్వం, కథా సందర్భం, కవితా వసంతం, నవలా సమయం, విమర్శా దర్శనం, సాహిత్య శిల్పం, కవితాపొద్దు, పరిశోధనా విపంచి, సాహిత్య గమ్యం, గమనం, సాహిత్య మూల్యాంకనం పేర్లతో పది విభాగాలుగా లిటరరీ కాంగ్రెస్ కొనసాగుతుంది. తెలుగుభాష భవిష్యత్ మీద నిర్దుష్ట కార్యక్రమ రూపకల్పన ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.

చింతకింది కాశీం
97014 44450




ఊపిరి బిగపట్టిన
కొండల అంచున
విస్తరించి వికసించిన
ఈ దక్కన్ మహానగరం మీదుగా
దిగంతాల దాకా సాగిన నా దృష్టి,
ఆనాడు రక్తమోడిన
తెలంగాణ రైతాంగ శ్రామిక శక్తి-
నిర్మించిన ఇదే నేలలోని
ప్యాలెస్‌లు, హవేలీలు, దేవిడీలు
దర్బార్‌ల విందు విలాసాల కేళిలో
చెమటమూలాలన్నీ
జిగేలుమంటున్నాయి ఇప్పుడు!

ఒకనాడు దీనంగా
దిక్కులేని కొండలపై నిలుచుని
'ఆసఫ్ జాహీ' శిఖర స్థాయి రాచరికాన్ని
అబ్బురంగా చూసిన ఆ క్షణాలన్నీ
ఇప్పుడు నా పాదాల వెంట...

ఈ మొగులు మేడ (ఆకాశహర్మ్యం)లో
అతిఖరీదైన హోటల్ ఆతిథ్య-
విభ్రాంత సంధ్యల ఫ్యూడల్ అవశేషాల
అత్తర్ పరిమళాల మధ్య,
ప్రపంచంలో అతిపెద్ద--
పొడుగాటి డైనింగ్ టేబుల్ చుట్టూ
ఆశీనులై విందు ఆరగించిన
నూటొక్క (101) దేశవిదేశీ అతిథుల్లో
రాచరిక మర్యాదల డాంబికాల్లో
నా చోటు ఎక్కడో వెతుకుతున్నాను.
(ఆ నేను హిందూ - ముస్లిం ఎవరైనా కావచ్చు)
ఇప్పుడిక 'చెరువులో నిండిన చేపల్లా'
(కులీకుతుబ్‌షా)
నిజాం నాటి హవేలీలు కూలిన చోటే,
విద్యుత్ ప్రవాహాల వాహనాల
నిత్యజనజీవన సందడిలో నడయాడుతున్న
ఈ కొత్త నగరాన్ని చూస్తున్నాను!

నిఖిలేశ్వర్
91778 81201

### కవితా పురస్కారం

తెలుగు సాహితీవనం కవితా పురస్కారం కోసం ఏదైనా సామాజిక అంశం పైన 25 పంక్తులకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. వర్డ్‌లో యూనికోడ్‌లో టైప్ చేసి కవితలను, కవితలపై పేరు రాయకుండా, హామీ పత్రం జత చేసి, మార్చి 5లోగా sahitivanam82@gmail.comకు ఈమెయిల్ చేయాలి. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.1,116 చొప్పున నగదు బహుమతితో పురస్కార ప్రదానం ఉంటుంది. మరిన్ని వివరాల కొరకు ఫోన్: 9490805404.

**తెలుగు సాహితీవనం**

### ఆత్మీయ సత్కారం

స్వాతి పత్రికల అధినేత వేమూరి బలరామ్ 77వ జన్మదినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 12న సాయంత్రం 6గంటలకు విజయవాడ బందరురోడ్‌లో గల ఠాగూర్ గ్రంథాలయంలో ఆత్మీయ సత్కార సభ జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ నిర్మిస్తున్న 'స్వాతి బలరామ్ - అతడే ఒక సైన్యం' సినిమాలోని ఒక పాట అతిథుల సమక్షంలో ఆవిష్కరించబడుతుంది.

**ప్రభాకర్ జైనీ**

### సేవ సాహితీ సదస్సులు

తెలుగు భాషా సాహితీ, సాంస్కృతిక సంస్థ 'సేవ' ఆధ్వర్యంలో 'అక్షర తోరణం' పేరిట ఫిబ్రవరి 12న అఫ్సర్ సాహితీ అవలోకనం, 13 నుండి 15 దాకా సయ్యద్ సలీం సాహితీ సమాలోచన, ఫిబ్రవరి 16 నుండి 22 వరకు వేంపల్లి గంగాధర్, వేంపల్లె షరీఫ్, జానీ తక్కెడశిల, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, పసునూరి రవీందర్, పింగళి చైతన్య, మంత్రి కృష్ణమోహన్, మానస ఎండ్లూరి, గడ్డం మోహన్‌రావు, బాలసుధాకర్ మౌళి, తగుళ్ళ గోపాల్, పల్లిపట్టు నాగరాజు, మెర్సీ మార్గరెట్ రచనలపై యువ సాహితీ సప్తాహం సదస్సులు జరుగుతాయి. ప్రతి సాయంత్రం 7 గంటలకు మీడియా ఛానల్స్, 'సేవ ఆన్ లైవ్' యూట్యూబ్ ఛానల్ ప్రత్యక్ష ప్రసారంగా ఈ సదస్సులు జరుగుతాయి. వివరాలకు 9492666660.

**కంచర్ల సుబ్బానాయుడు**

### 'వంశీ మా పసలపూడి కథల కమామిషు'

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బోధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కె. రామచంద్రారెడ్డి రచన 'వంశీ మా పసలపూడి కథల కమామిషు' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 17 సా.5.30కి రవీంద్ర భారతి మినీ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి, ఆవిష్కర్త: వంశీ, విశిష్ట అతిథి: తనికెళ్ల భరణి, పుస్తక సమీక్ష & ఆత్మీయ వాక్కు: రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, మహ్మద్ ఖదీర్ బాబు, కె.ఎన్. మల్లీశ్వరి, పచ్చమట్ల చంద్రశేఖర్, మామిడి హరికృష్ణ.

**బోధి ఫౌండేషన్**



# నిధులు తక్కువ.. నీళ్లు ఎక్కువ..

- సాగునీటిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- బడ్జెట్‌లో ప్రాజెక్టులకు రూ.28,024 కోట్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు లబ్ధి
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు ప్రాధాన్యత

వరంగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తక్కువ నిధులతో ఎక్కువ ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టుల వైపు ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. తాత్కాలి క బడ్జెట్‌లో ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు రూ.28,024కోట్లు కేటాయించారు. అయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతాంగానికి దేవాదుల, చిన్నకాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులు పూర్తి అయితే 4లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందే అవకాశం ఉంది.

### దేవాదుల.. ఇక వేగిరం..

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల వద్ద 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జె.చొక్కారావు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మూడువిడతల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని రూపకల్పన చేశారు. ప్రాజెక్టు పూర్తిచేసి 170రోజుల్లో 38.182 టీఎంసీలను లిఫ్ట్ చేయాలని, ఇందులో 2.842 టీఎంసీల నీటిని వరంగల్ నగరానికి తాగునీటికి కేటాయించాలని నిర్ణయించారు. మిగిలిన 35.34టీఎంసీల నీటిని 6.21లక్షల ఎకరాలకు సాగుకు మళ్లించటమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. అయితే మొదటి, రెండోదశ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దేవాదుల ప్రాజెక్టులో కీలకమైన మూడో దశ పనులు ముందుకు సాగటం లేదు. 2008లో మూడో దశ పనులు మొదలు పెట్టారు. 2011 డిసెంబరు 7వ తేదీ నాటికి పనులు పూర్తి కావాలి. ఈ దశలో 54.88కిలో మీటర్ల దూరం సొరంగం తవ్వాల్సి ఉంది. కానీ 2009 జూన్‌లో శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు వద్ద బుంగ పడటంతో దేవాదుల టన్నెల్‌లోకి నీళ్లు చేరి ముగ్గురు కార్మికులు జలసమాధి అయ్యారు. దీంతో రెండేళ్లకు పైగా మూడో విడత దేవాదుల పనులకు బ్రేక్ పడింది. అప్పటికే 42కిలోమీటర్ల సొరంగం తవ్వి, 53 శాతం లైనింగ్ పనులు పూర్తి చేశారు. భీంఘన్‌పూర్ నుంచి రామప్ప చెరువు మధ్యలో సొరంగం పనులు స్థానికులు అడ్డుకోటంతో 5.82కిలో మీటర్లు తగ్గించి 49.06కిలో మీటర్లకు సొరంగం పనులను కుదించారు. దీంతో ఇంకా 7కిలోమీటర్ల టన్నెల్ తవ్వి లైనింగ్ పూర్తి చేయాల్సి ఉంది. అయితే నిధులు కొరతతో దేవాదుల పనులు ముందుకు సాగటం లేదు. ఏటా బడ్జెట్‌లో అరకొరనిధులే కేటాయిస్తున్నారు. ప్రస్తుతం దేవాదుల ద్వారా వరంగల్ నగరానికి తాగునీరు అందిస్తుండటంతో పాటు సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మూడో దశ పనులు పూర్తి అయితే అదనంగా మరో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రభుత్వం దేవాదుల కోసం రూ.3,687.72కోట్ల నిధులను కేటాయించింది. టన్నెల్ పనులు పూర్తి చేయటంతో పాటు ప్రాజెక్టుకు కావాల్సిన సుమారు 3వేల ఎకరాల భూమిని జనగామ, హనుమకొండ, సిద్ధిపేట జిల్లాలో భూసేకరణ చేయాల్సి ఉంది. మొత్తానికి దేవాదులపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో త్వరలోనే దేవాదుల ఫలాలు అందుతాయనే ఆశతో ఓరుగల్లు రైతాంగం ఎదురుచూస్తుంది.

### చిన్న కాళేశ్వరంలో కదిలిక

భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభు త్వంలో కదిలిక వచ్చింది. 2008లో జలయజ్ఞం పథకం కింద అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. రెండు పంపుహౌస్‌ల ద్వారా 4.5 టీఎంసీల గోదావరి నీటిని లిఫ్ట్ చేసి కాటారం, మహదేవపూర్, పలిమెల, మహముత్తారం, మల్హర్ మండలాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం. ఇందుకోసం రూ.499కోట్ల అంచనా వ్య యంతో పనులు చేపట్టారు. బీరసాగర్, కాటారంలో రెండు చోట్ల పంపుహౌస్‌ల నిర్మాణంతో పాటు 8.5మెగా వాట్ల కెపాసిటీ గల ఏడు మోటర్లను బిగించారు. పైపులైన్, భూసేకరణతో పాటు మరికొన్ని పనుల కోసం రూ.325కోట్ల వరకు ఖర్చు చేశారు. ఆ తరువాత నిధుల కొరతతో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయక పోవటం నిరుపయోగంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో ప్రస్తుత బడ్జెట్‌లో రూ.283.37కోట్లు కేటాయించారు. దీంతో రాబోయే రెండేళ్లలో పనులు పూర్తి అయితే 45వేల ఎకరా లకు సాగునీరుతో పాటు సుమారు 100 గ్రామాల కు తాగునీటికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుం దనే ఆశతో స్థానికులు ఉన్నారు.

### కాళేశ్వరానికి నిధులు లేనట్టే..

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రస్తుత బడ్జెట్‌లో పైసా నిధులు కేటాయించలేదు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద నిర్మించిన బ్యారేజీతో 45లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గత అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో కాళేశ్వరం ఎత్తిపోతలకు బ్రేక్ పడింది. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే భారీ బడ్జెట్ అవసరం. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పులకే రూ.17,114కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. రూ.1,534కోట్లు జీతభత్యాలు, ఇతర ఖర్చులకు పోనూ, మిగిలిన రూ.9,377కోట్లతో పాత ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. దీంతో ప్రభుత్వం కాళేశ్వరం జోలికి వెళ్లకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు అందే ప్రాజెక్టులపై దృష్టిపెట్టింది.

### సీతారామకు రూ.900కోట్లు

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో గోదావరిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుతో మహబూబా బాద్ జిల్లాలోని రైతాంగానికి ప్రయోజనం చేకూరనుంది. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో 6.74 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.13,077కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే నిధుల కొరతతో ఐదేళ్లుగా ఈ ప్రాజెక్టు ముందుకు సాగటం లేదు. ప్రస్తుతం సీతారామ ప్రాజెక్టు కోసం అధికారులు రూ.2వేల కోట్ల కోసం ప్రతిపాదనలు పంపిస్తే, బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.900కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల్లో సుమారు 50వేల ఎకరాకలు సాగునీరు అందే అవకాశం ఉంది. అలాగే ములుగు జిల్లా వాజేడు మండలం మోడికుంట వాగు ప్రాజెక్టు, వెంకటాపురం మండలం పాలెం వాగు ప్రాజెక్టులకు పీఎం కృషి సించాయి యోజన పథకంలో అభివృద్ధి చేసే అవకాశం ఉంది.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# మేడారంలో మొక్కుల జోరు

- సమ్మక్క సారలమ్మల దర్శనాలకు భక్తుల బారులు
- రద్దీగా మారిన మేడారం పరిసరాలు




మేడారం, ఫిబ్రవరి 11 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహాజాతర ఈనెల 21 నుంచి ప్రారంభం కానుండగా వనదేవతలకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నలమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. 10 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవతల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) చెల్లించుకున్నారు.

### గద్దెలను తాకి పులకించి

మహా జాతరకు ముందుగా సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి మేడారం తరలి వచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను తాకి తరించి పోతున్నారు. మహా జాతరలో అవకాశం రాకపోవచ్చని భావిస్తూ ముందస్తుగా కుటుంబ సభ్యులతో తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్నారు.

### రద్దీని నియంత్రించని పోలీసులు

మహా జాతరకు ముందుగా వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలివచ్చిన భక్తజనాన్ని గద్దెల వద్ద పోలీసులు నియంత్రించలేక పోయారు. దేవాదాయ, పోలీసు శాఖల అధికారులు తమ కుటుంబ సభ్యులు, శాఖల అధికారులు, బంధువులు, మిత్రులకు ప్రత్యేక దర్శనాలు కల్పించే పనిలో పడ్డారు. సామాన్య భక్తులకు మాత్రం దర్శనాల్లో ఇబ్బందులు తప్పలేదు. వీవీఐపీ, వీఐపీల దర్శనాల కారణంగా దగ్గరకు వెళ్లలేని భక్తులు దూరం నుంచే బెల్లం, కానుకలు, ముడుపులు విసిరారు. భక్తులందరినీ సమ దృష్టిలో చూడాలని, సామాన్యులకు దర్శన భాగ్యం కల్పించాలని కోరారు.



## భారీగా ఎంపీడీవోల బదిలీలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చర్చ

6

## మల్లన్న నామస్మరణతో మారుమోగిన పుణ్యక్షేత్రం

- 4వ వారంతపు జాతరకు వేలాదిగా వచ్చిన భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 11: ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరల్లో 4వ ఆదివారం జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. ఆదివారం ఉదయం స్వామి వారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి, రుద్రాభిషేకాలు జరిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనంవండి అమ్మవార్లకు స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చమని మల్లికార్జునస్వామిని భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముతైదు సామగ్రిని ముట్టచెప్పారు. మరి కొందరు భక్తులు రథసేవ మొక్కుల్లో భాగంగా రథంను ఆలయం చుట్టు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# చిన్నారులను మింగిన చెరువులు

- వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి
- తాడిచర్లలో మేకలను మేపడానికి వెళ్లి ఇద్దరు అన్నదమ్ములు..
- అమ్మాపురంలో ఈతకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు..
- భూపాలపల్లి, మానుకోట జిల్లాల్లో విషాదం


తాడిచర్లలో చిన్నారుల మృతదేహాలు (ఇన్‌సెట్‌లో ఫైల్)


ఈతకు వెళ్లి..

అమ్మాపురం గ్రామ చెరువులో పడి మృతి చెందిన చిన్నారులు

మల్హర్/తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 11: చెరువులో పడి నలుగురు చిన్నారులు మృతి చెందారు. మేకలను మేపేందుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు చెరువులో దిగగా నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ప్రమాదం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామంలో జరిగింది. అలాగే ఈత కొట్టేందుకు చెరువుకు సరదాగా వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురంలో ఆదివారం జరిగింది. చిన్నారులమృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

### మేకలను మేపేందుకు..

భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన బొంతల అనూష - రాజు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమారులు అరుణ్‌కుమార్ (12), కార్తీక్ (9) తోపాటు ఓ కూతురు ఉంది. అరుణ్ కుమార్ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సమీపంలోని సన్నూర్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉన్న అతడు.. మూడు నెలల కిందట ఇంటికి వచ్చేశాడు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేకపోవడంతో అతడిని స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదిరోజుల కిందట చేర్పించారు. రెండో కుమారుడు కార్తీక్ స్థానికంగా నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవలే రాజు కొన్ని మేకలను కొన్నాడు. వాటి ని అతడి భార్య అనూష మేపుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాజు వ్యక్తిగత పని నిమిత్తం కాళేశ్వరం వెళ్లాడు. రోజూలాగే అనూ ష మేకలు మేపుకుంటూ ఇద్దరు కొడుకులను కూడా తోడుగా తీసుకెళ్లింది. మధ్యాహ్న సమయంలో అనూష పిల్లలు ఇద్దరికి మేకలను అప్పగించి భోజనం చేయడానికి ఇంటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మేకలు ఇంటికి చేరాయి. ఇద్దరు పిల్లలు మాత్రం తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి.. చుట్టుపక్కల వెతికింది.

చెరువు వద్దకు వెళ్లి చూడగా ఇద్దరి చెప్పులు కనిపించాయి. దీంతో ఏడుస్తూ గ్రామంలోకి వచ్చి కొంతమందిని వెంట తీసుకొని వెళ్లింది. చెరువులో గాలించగా ఇద్దరి కొడుకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలాన్ని కాటారం సీఐ నాగేశ్వర్‌రావు పరిశీలించారు. ఇద్దరు పిల్లలు చెరువులో వద్దకు ఎందుకు వెళ్లారు.. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు.

### ఈతకు వెళ్లి..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన గంధం స్వామి - రూప దంపతుల పెద్దకుమారుడు గంధం యాకూబ్ (14) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా తల్లి రూప, తమ్ముడు శ్రావణ్‌కుమార్ తో కలిసి ఉంటున్నాడు. అలాగే ఇదే గ్రామానికి చెందిన కిన్నెర మహేష్-సావిత్రి దంపతుల కుమారుడు జంపా (12) స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లి దండ్రులు ఇద్దరు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా, నాన్నమ్మ గజ్జెలమ్మతో ఉంటున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో వీరిద్దరు మరో నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న పెద్దచెరువు వద్దకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. చెరువు ఒడ్డున ఈతకొడుతూ ఒక్కసారిగా లోతులోకి వెళ్లారు. దీంతో ఇద్దరు చిన్నారులు నీటిలో మునిగి అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై కూచిపుడి జగదీశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృదేహాలను తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంధం రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# చోరీ కోసం వచ్చి చీర్స్!

- బాలసముద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం
- మందుతాగి అక్కడే పడుకున్న నలుగురు దొంగలు
- ఉదయం పరార్.. గమనించిన స్థానికులు
- పోలీసులకు ఫిర్యాదు.. ఆధారాలు సేకరిస్తున్న సిబ్బంది

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కరడుగట్టిన దొంగలు. దొంగతనం కోసం ఇంట్లో చొరబడిన వారికి విదేశీ మద్యం కనిపించడంతో నోరూరింది. దొరికిన మద్యం తాగి కాసేపు అక్కడే కునుకుతీసి తెల్లవారి లేచి వెళ్లిపోయారు. ఈ వింతైన దొంగతనం బాలసముద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. సుబేదారి పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని బాలసముద్రంలో కనపర్తి సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. హనుమకొండ చౌరస్తాలో వన్‌గ్రామ్ గోల్డ్‌షాపు వ్యాపారం చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. ఈ నెల 7న బాలసముద్రంలోని ఇంటికి తాళం వేసి అమెరికాకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ ఉండడం లేదు. తాళం వేసి ఉంది. ఇంటికి సీసీ కెమెరాలు కూడా అమర్చుకున్నాడు. ఈ క్రమంలో తాళం వేసిన ఇంటిని దొంగలు టార్గెట్ చేశారు. శనివారం రాత్రి సుమారు 1 గంటలకు సత్యనారాయణ ఇంటికి నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు చేరుకున్నారు. అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తర్వాత ప్రధాన ద్వారం తలుపుల బెడెం ఇనుప రాడ్డులో పగులగొట్టి లోనికి ప్రవేశించారు. పూజ గదికి వెళ్లి అక్కడి కొంత బంగారం, వెండి విగ్రహాలు, బీరువాలో ఉన్న సుమారు రూ.30 వేలను తీసుకున్నాడు.

ఇంకా ఇంట్లో వెతుకుతున్న క్రమంలో వారికి విదేశీ మద్యం బాటిళ్లు కనిపించాయి. ఫ్రీజర్‌లో ఉన్న డ్రైఫ్రూట్స్ తీసుకుని నలుగురు కలిసి ఒక చోట సిట్టింగ్ చేశారు. రెండు బాటిళ్లు తాగిన తర్వాత అక్కడే పడుకున్నారు. తెల్లవారి సుమారు 4గంటల సమయానికి మెళకువ రావడంలో చోరీ చేసిన వస్తువులతో బయటకు వచ్చారు. చుట్టుపక్కల వారు గుర్తించి గట్టిగా అరిచారు. ఇది గమనించిన దొంగల ముఠా కాళ్లకు పని చెప్పారు. ఈ క్రమంలో వారి చెప్పులు, బూట్లు, టవళ్లు అక్కడే వదిలివెళ్లారు. చుట్టుపక్కల వారు విషయాన్ని అమెరికాలో ఉన్న యజమానికి ఫోన్ చేసి చెప్పడంతో నగరంలో ఉంటున్న బంధువులకు ఫోన్‌లో చెప్పాడు. సత్యనారాయణ సోదరుడు కిషన్‌రావు ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులతో పాటు క్లూస్ టీం, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆనవాళ్లను సేకరించారు.


పూజగదిలో చోరీ చేసిన వస్తువులు


దొంగలు తాగి పడేసిన కాళీ మద్యం బాటిళ్లు

బాధితుల ఫిర్యాదు తర్వాత రూ.30వేల నగదు కొంత బంగారం, వెండి విగ్రహాలు దొంగలు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. మద్యం తాగి చోరీకి పాల్పడిన దొంగల నిర్వాకానికి అందరూ నివ్వెరపోయారు.

## కేయూ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్?

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: కేయూ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఇక్కడికి బదిలీ అయిన శ్రీధర్ రాకను మంత్రి ద్వారా అడ్డుకున్నట్లు సమాచారం. కాగా, కొన్ని రోజుల కిందట వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు జరగగా.. కేయూలో పని చేసిన అబ్బయ్య పరకాలకు బదిలీ అయ్యారు. ఇక్కడికి ఖమ్మంలో పని చేస్తున్న సీహెచ్. శ్రీధర్‌ను నియమించారు. అయితే శ్రీధర్ రాకపై సందిగ్ధత ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలంపాటు ఎస్ఐ, సీఐగా పని చేసిన శ్రీధర్ అక్కడి బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. అక్కడ చాలామంది కాంగ్రెస్ కార్యకర్తలను వేధించడంతోపాటు కొందరిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేసినట్టు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ కమిషనరేట్‌లోని కీలకమైన కేయూ పీఎస్‌లో పోస్టింగ్ పొందడాన్ని అక్కడి నేతలు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. ఎలాగైనా శ్రీధర్ పోస్టింగ్‌ను రద్దు చేయాలని విదేశాల్లో ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రిపై ఒత్తిడి చేసినట్టు సమాచారం. దీంతో సీపీకి విషయం తెలుపగా ఆయన నిఘావర్గాల ద్వారా శ్రీధర్ సర్వీస్ గురించి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఓ ఉన్నత స్థాయి అధికారి శ్రీధర్‌కు ఫోన్ చేసి కేయూ పీఎస్‌లో జాయిన్ కావొద్దని సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో శ్రీధర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. అయితే కేయూకు పీఆర్, ఎస్‌బీలో ఉన్న ఓ అధికారుల్లో ఎవరికైనా విధులు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

## భారీగా ఎంపీడీవోల బదిలీలు

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది ఎంపీడీవోలు పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. మరో రెండు మాసాల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఒకే స్థానంలో మూడేళ్ల సర్వీసు పూర్తి అయిన ఎంపీడీవోలను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 395 మంది ఎంపీడీవోలు బదిలీ కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది బదిలీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 5 ఎంపీడీవోలు, జనగామ జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా నుంచి 8 ఎంపీడీవోలు, మహబూబాబాద్ జిల్లా నుంచి 16 ఎంపీడీవోలు, ములుగు జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, వరంగల్ నుంచి 10 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. సోమవారం రిలీవ్ కానున్న ఎంపీడీవోలు మంగళవారం వారికి కేటాయించిన జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

- **హనుమకొండ జిల్లా ఎంపీడీవోలు :** జవహర్‌రెడ్డి ములుగు జిల్లాకు, టి.సునిత కరీంనగర్, జి.వెంకటరమణ వరంగల్, ఎల్.భాస్కర్ జయశంకర్ భూపాలపల్లి, ఆర్.రామకృష్ణ ములుగు బదిలీ అయ్యారు.
- **జనగామ జిల్లా ఎంపీడీవోలు:** మహ్మద్ హసీం సూర్యాపేట, బి.సురేందర్ ఖమ్మం, వి.అశోక్‌కుమార్ ఖమ్మం, శ్రీధర్‌స్వామి ఖమ్మం, పి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, వి.రాజా త్రివిక్రం సిద్దిపేట బదిలీ అయ్యారు.
- **భూపాలపల్లి జిల్లా ఎంపీడీవోలు:** కె.అనిల్‌కుమార్ హనుమకొండ, ఎల్.అరుంధతి వరంగల్, పి.ఆంజనేయులు వరంగల్, జి.సురేందర్ ఖమ్మం, ఎం.శంకర్ వరంగల్, జి.నరసింగహమూర్తి వరంగల్, ఎ.రవీంద్రనాథ్ ఆదిలాబాద్, వి.క్రిష్ణవేణి వరంగల్ బదిలీ అయ్యారు.
- **మహబూబాబాద్ జిల్లా ఎంపీడీవోలు:** జి.రవిందర్‌రావు భద్రాద్రి కొత్తగూడెం, ఎం.సత్యనారాయణరెడ్డి సూర్యాపేట, జి.రవిందర్ ఖమ్మం, వి.అపర్ణ రంగారెడ్డి, పి.వెంకటేశ్వర్లు హనుమకొండ, బి.వి.చలపతిరావు భద్రాద్రి కొత్తగూడెం, ఎస్.కుమార్ ఖమ్మం, బి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, బి.భారతి భద్రాద్రి కొత్తగూడెం, కె.ధన్‌సింగ్ భద్రాద్రి కొత్తగూడెం, బి.గోవిందరావు వరంగల్, కె.శ్యాంసుందర్ జయశంకర్ భూపాలపల్లి, కె.వెంకటేశ్వర్లు జయశంకర్ భూపాలపల్లి, పి.సరస్వతి ఖమ్మం, ఎ.రోజారాణి ఖమ్మం, కె.శేషాద్రి ఖమ్మం బదిలీ అయ్యారు.
- **ములుగు జిల్లా ఎంపీడీవోలు:** అబ్బూరి ఫణిచంద్ర వరంగల్, సీహెచ్.శ్రీనివాస్, వరంగల్, జె.ప్రవీణ్‌కుమార్ హనుమకొండ, ఎం.సత్యాంజనేయ ప్రసాద్ యాదాద్రి భువనగిరి, ఎండి.ఇక్బాల్ హుస్సేన్ జయశంకర్ భూపాలపల్లి, అద్దూరిబాబు జయశంకర్ భూపాలపల్లి బదిలీ అయ్యారు.
- **వరంగల్ జిల్లా ఎంపీడీవోలు:** సీహెచ్.సంతోష్‌కుమార్ సూర్యాపేట, టి.రాజ్యలక్ష్మీ ములుగు, ఎ.క్రిష్ణమూర్తి మెదక్, జి.క్రిష్ణ ప్రసాద్ ములుగు, ఎస్.విజయ్‌కుమార్ హనుమకొండ, ఎస్.వీరేషం హనుమకొండ, జి.రాజేంద్రప్రసాద్ ములుగు, పి.సుమనవాణి ములుగు, ఎం.వెంకటేశ్వర్‌రావు జయశంకర్ భూపాలపల్లి, జి.అనిత ములుగుకు బదిలీ అయ్యారు.

## వైద్యులపై చర్యలు తీసుకోండి..

### హసన్‌పర్తి పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: గాల్‌బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని తన భార్యను ఆస్పత్రిలో చేరిస్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణం పోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓబాధితుడు హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి తెలిపిన ఫిర్యాదు మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వరంగ ల్ జిల్లా కరీమాబాద్ తోటకు చెందిన ఎమ్డీ అన్వర్ తన భార్య నస్రీన్‌కు గాల్ బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని చికిత్స కోసం ఆరెపల్లిలోని రిలీఫ్ ఆస్పత్రిలో ఈ నెల 5న చేర్పించారు. 9వ తేదీన అక్కడి డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత కొంత సమయానికి నస్రీన్‌కు మూత్రం ఆగిపోయింది. ఉదయం నుంచి సా యంత్రం వరకు చికిత్స చేసినట్టు చేసి చివరికి పరిస్థితి విషమించిందని, మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని వేరే ఆస్పత్రికి తీసుకుపోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. అక్కడికి వెళ్లి చికిత్స చేస్తుండగా శనివారం సా యంత్రం నస్రీన్ మృతి చెందింది. తనభార్య మరణానికి రిలీఫ్ ఆస్పత్రి సిబ్బందే కారణమని, అక్కడి డాక్టర్లతోపాటు నిర్వాహకులను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

## 'మల్లికాంబ'లో అన్నదానం



అన్నదానం చేస్తున్న రామమ్ చిట్‌ఫండ్స్ ప్రతినిధులు

సుబేదారి, ఫిబ్రవరి 11: రామమ్ చిట్‌ఫండ్స్ 16వ వార్షికోత్సవం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉన్న మానసిక వికలాంగులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామమ్ చిట్‌ఫండ్స్ చైర్మన్ బన్న సుధాకర్, ఎండీ శ్రీరామోజు గిరిబాబు, చిట్‌ఫండ్స్ సిబ్బంది, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ‘ఆరోగ్య’ జాతర!

- మేడారంలో పకడ్బందీగా వైద్య సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- 50 పడకలతో తాత్కాలిక వైద్యశాల
- జాతర పరిసరాలు, దారుల్లో 72 మెడికల్ క్యాంపులు
- 150 మంది డాక్టర్లు, 530 మంది పారామెడికల్ సిబ్బంది నియామకం



మేడారంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రధాన వైద్యశాల

ములుగు, ఫిబ్రవరి 10: మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. ఈసారి ప్రభుత్వం రూ. కోటి నిధులను కేటాయించగా ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. జాతర పరిసరాల్లో తాత్కాలిక పెద్దాస్పత్రి, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఓపీ సేవలు కొనసాగుతుండగా, ఈనెల 20నుంచి జాతర ముగిసేంత వరకు ఇన్‌పేషెంట్ సేవలను అందించనున్నారు. ఎప్పటిలాగే మేడారం జాతరలో 50 పడకలతో తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో తొమ్మిది మంది వైద్యనిపుణులు పనిచేయనున్నారు. షిఫ్టునకు 10మంది చొప్పున స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలతో ఇక్కడ ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ 24 గంటల సేవలను అందించనున్నారు. మేడారం ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో ఆరు బెడ్లతో మెడికల్ క్యాంపును ఏర్పాటుచేసి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. అదేవిధంగా జాతర పరిసరాల్లో 30మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. చింతల్, నార్లాపూర్, కొత్తూరు, కాల్వపల్లి క్రాస్‌రోడ్డు, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు-రెడ్డిగూడెం రోడ్ డ్యామ్, జంపనవాగు, ఊరట్టం కాజ్‌వే, రెడ్డిగూడెం, కొంగల మడుగు, ఆర్‌టీసీ బస్టాండు, ఇంగ్లీషు మీడియం స్కూల్, మేడారం చెరువు, పోలీసు క్యాంపు, చిలుకలగుట్ట, వీవీఐపీ పార్కింగ్ ప్లేస్, పడిగాపూర్, హరిత హోటల్, కొత్తూరు సబ్‌స్టేషన్, వెంగ్లాపూర్, మేడారం-తాడ్వాయి రోడ్డు, గద్దెల ప్రధాన ద్వారం, బయ్యక్కపేట రోడ్డు, కన్నెపల్లి జంక్షన్ రోడ్డు, ఊరట్టం రోడ్డు మామిడి తోట, మేడారం గ్రామపంచాయతీ సమీపంలోని రెండో గేటు వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు.

అదేవిధంగా మేడారం వచ్చే ప్రధాన దారుల్లో కూడా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. గూడెప్పాడ్, కటాక్షపూర్, మల్లంపల్లి, గట్టమ్మ దేవాలయం, జంగాలపల్లి క్రాస్‌రోడ్డు, చల్వాయి క్రాస్‌రోడ్డు, లక్నవరం, పస్రా, కాల్వపల్లి, రేగులగూడెం, పెగడపల్లి, బోర్లగూడెం, కాటారం, తాడ్వాయి, బీరెల్లి, కొత్తూరు, కాటాపూర్, ఆకులవారి ఘనపూర్, ముల్లకట్ట బ్రిడ్జి, జగన్నాధపురం, చీకుపల్లి, టేకులగూడెం, వెంకటాపురం,



భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మంగపేట, మల్లూరు, రాజుపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్, బయ్యక్కపేట, దూదేకులపల్లి, రాంపూర్, మేడారం క్రాస్‌రోడ్డు, రామప్ప, గుర్రంపేట, గణపురం క్రాస్‌రోడ్డు వద్ద మొత్తం 42 క్యాంపులు ఏర్పాటవుతున్నాయి. భక్తులు చిన్న అనారోగ్యానికి గురైనా ఈ శిబిరాలను సంప్రదిస్తే అక్కడ 24గంటలు అందుబాటులో ఉండే డాక్టర్లు, సిబ్బంది వైద్యసేవలను అందించనున్నారు. ఇద్దరు డాకర్లు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సహాయక సిబ్బంది కలిపి మొత్తం 10మంది విధుల్లో ఉంటారు.

## 680 మంది డాక్టర్లు, సిబ్బంది

వైద్య, ఆరోగ్య శాఖ పెద్ద సంఖ్యలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని జాతర విధులకు నియమించనుంది. 150 మంది వైద్యులు, 530 మంది పారామెడికల్ సిబ్బందితో భక్తులకు సేవలు అందించనుంది. ములుగు, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ జిల్లాల నుంచి 150 మంది డాక్టరను పిలిపిస్తున్నారు. అదే విధంగా ఎంజీఎం, సీకేఎం, రీజనల్ ఐహాస్పిటల్, జీఎంహెచ్ నుంచి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. 60మంది నాలుగో తరగతి ఉద్యోగులు సహాయకులుగా సేవలందించనున్నారు. ఐఎంఏ సహకారంతో ఓ గుండెవైద్య నిపుణుడిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ ఈసీజీ టెక్నీషియన్‌ను కూడా నియమించనున్నారు.



మేడారం తాత్కాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

## 40 బైక్ అంబులెన్స్‌లు

మహాజాతర సమయంలో మేడారం పరిసరాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దారులన్నీ ఇసుకేస్తే రాలనంత తయారవుతాయి. ఈ సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. అత్యవసర సేవల కోసం బైక్ అంబులెన్స్‌లను వినియోగించనున్నారు. ఇందుకు 40బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 108 అంబులెన్స్‌లు 16ను కూడా సిద్ధం చేస్తున్నారు. ములుగు, ఏటూరునాగారం, తాడ్వాయి, పస్రా ఆస్పత్రుల వద్ద అత్యవసర సేవల కోసం నాలుగు అంబులెన్స్‌లు, ఆరు ఆర్‌బీఎస్‌కే, మూడు ఎంసీహెచ్ వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నారు. అదేవిధంగా 120 మంది 108సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నారు.

## ఏడుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లు

అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు జరిపేందుకు ఆరుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లను(రెఫరల్ హాస్పిటల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, భూపాలపల్లి, పరకాల సీహెచ్‌సీలు, తాడ్వాయిలోని పీహెచ్‌సీలో 10పడకలు, పస్రాలో ఐదు పడకలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

## కొనసాగుతున్న వైద్యసేవలు

జనవరి 14 నుంచి మేడారంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 3,850 మందికి ఓపీ సేవలు అందించారు. 50వేల మాస్కులు, రూ.7లక్షల 50వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈనెల 13 నుంచి 24 గంటల వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర జరిగే 21 నుంచి 24వ తేదీ వరకు ప్రతి రోజూ తొమ్మిది మంది వైద్య నిపుణులు 24 గంటలూ విధుల్లో ఉంటారు. తాడ్వాయిలో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.42లక్షలతో సెంట్రల్ డ్రగ్ స్టోరేజ్ సెంటర్ నుంచి మందులు తెప్పిస్తున్నారు. ఈసారి కోటి 60లక్షల మంది భక్తులు జాతరకు వస్తారని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. 2022 జాతరలో మొత్తం 2 లక్షల 9వేల మంది ఓపీ, 5,222మందికి ఐపీ సేవలు అందించింది.

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

### డాక్టర్ అల్లెం అప్పయ్య, ములుగు జిల్లా డీఎంహెచ్‌వో



మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. తాత్కాలిక ప్రధాన ఆస్పత్రిలో ఈనెల 13నుంచి జాతర ముగిసేంత వరకు 24గంటల వైద్యసేవలు అందిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో జాతరలోని ప్రధాన ఆస్పత్రికి రాలేని పరిస్థితిలో ఇప్పుడు వాడుతున్న మందులను వెంట తెచ్చుకోవడం మంచిది. సురక్షితమైన ఆహారం, తాగునీటిని తీసుకోవాలి. ముఖానికి తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. ఏదైనా అనారోగ్యం సోకితే సమీపంలోని వైద్య శిబిరానికి వెళ్లి ఉచితంగా సేవలు పొందాలి.



ములుగులో ఇసుక లారీలను దారి మళ్లిస్తున్న పోలీసులు

# ఇసుక లారీలపై నియంత్రణేదీ?!

### నిలుపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోని యంత్రాంగం

ములుగు, ఫిబ్రవరి11: మేడారం భక్తులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. జాతీయ రహదారి పనులకు తోడు ఇసుక లారీల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలతోపాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని ఇసుక క్వారీల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు వరంగల్, హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. జాతరకు సమయం దగ్గరపడుతుండగా పెద్ద సంఖ్యలో భక్తులు వాహనాలలో తలివస్తున్నారు. ఆర్టీసీ కూడా స్పెషల్ సర్వీసులను నడిపిస్తోంది. ఈనేపథ్యంలో లారీల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇదే సమయంలో ములుగు-గూడెప్పాడు మధ్య 163జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా జరుగుతున్నాయి. గట్టమ్మ దేవాలయం-మల్లంపల్లి మధ్య రహదారి కంకర పోసి చదును చేస్తున్నారు. కల్వర్టు పనులూ కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో భారీగా వచ్చే వాహనాలు దారి ఇరుగ్గా ఉండటంతో ముందుకు కదలలేక పోతున్నాయి. ఆదివారం భూపాల్‌నగర్ స్టేజీ వద్ద ఓ లారీ రోడ్డుపైనే దిగబడటంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో మేడారం భక్తులు, సాధారణ ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తక్షణమే స్పందించిన పోలీసులు ఇసుక లారీలను ములుగులో దారి మళ్లించారు. బస్సులు, ఇతర వాహనాలను ముందుకు అనుమతించారు. గట్టమ్మ దేవాలయం మూలమలుపు వద్ద కల్వర్టు పనులు జరుగుతుండటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇసుక లారీలను నిలిపివేతపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఇటీవల మంత్రి సీతక్క అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అయితే ఆదిశగా చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. జాతీయ రహదారి పనుల జాప్యంపై కూడా మంత్రి అసహనం వ్యక్తంచేశారు. అయితే పనులు జరుగుతున్న ప్రదేశాలు, ఇరుకైన కల్వర్టుల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటే కొంతవరకు సమస్య పరిష్కారమయ్యేది. కానీ, వాహనాలు నిలిచిపోయేదాకా ఎవ్వరూ స్పందించకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ఇసుకలారీలపై ఆంక్షలు విధించాలని, జాతీయ రహదారి విస్తరణ జరిగే ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సకల సౌకర్యాలతో మహాజాతర



వనదేవతలకు మొక్కుతున్న మంత్రి సీతక్క, ఎస్పీ, పీవో

### పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 11: మహా జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహాజాతరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జాతరకువచ్చే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్య కల్పిస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై మేడారానికి రానున్నారని, అందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశామని అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు ఉన్నారు.

### ఉత్సవ కమిటీని ప్రతిపాదించిన మంత్రి

మేడారం మహాజాతర నిర్వహణకు ఉత్సవ కమిటీపై మంత్రి సీతక్క దేవాదాయశాఖ కమిషనర్‌కు 15మందితో ప్రతిపాదనలు పంపారు. చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్‌తోపాటు 14 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. మిలుకూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచ హైమావతి, చామర్తి కిశోర్, కోరం అబ్బయ్య, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా సిద్దబోయిన జగ్గారావు పేర్లను పేర్కొన్నారు.







బెల్లంతో వెళుతున్న భక్తురాలు

# మేడారంలో మొక్కుల సందడి

### వనదేవతల దర్శనానికి తాకిడి





యాటను మొక్కుతున్న దృశ్యం



వనదేవతల దర్శనానికి బెల్లంతో వెళుతున్న మహిళా భక్తులు



జంపన్నవాగు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న దృశ్యం


రక్తదాన ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న నిట్ డైరెక్టర్

## నిట్‌లో రక్తదాన శిబిరం

కాజీపేట, ఫిబ్రవరి 11: నిట్‌లో ఎన్‌సీసీ క్లబ్, పేట్రియాటిక్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమే అన్నారు. రక్తదానం చేయడానికి యువత ఉత్సాహం చూపాలన్నారు. అనంతరం 400 మంది విద్యార్థులు రక్తాదానం చేశారు. ఆ తర్వాత రక్తదాతలకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిట్ స్టూడెంట్స్, ప్రొఫెసర్ ప్రకాశ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సినీ నటుడు సుమన్‌కు సన్మానం


సుమన్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 11: హనుమకొండ నగరానికి విచ్చేసిన సినీ నటుడు సుమన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సన్మానించి పూలమొక్క అందజేశారు. ఆదివారం ఓ ప్రయివేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన సినీ నటుడు సుమన్‌కు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త ఈవీ శ్రీనివాసరావు, న్యాయవాది యర్రంశెట్టి రాఘవరావు, శ్యామల గణేష్, మహేందర్‌గౌడ్, ధనుంజయ గౌడ్, గుండం శ్రీనివాస్, ప్రమోద్, ప్రణీత్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేటలో మేడారం ప్రత్యేక బస్టాండ్


పూజలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కాజీపేట, ఫిబ్రవరి 11 : ఈ నెల 21 నుంచి 24 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు కాజీపేట మీదుగా ప్రతీ ఏడాదిలాగే ఈ సారికూడా కాజీపేట రైల్వే స్టేడియం నుంచి ప్రత్యేక బస్సులు నడపడానికి ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం కాజీపేట రైల్వే స్టేడియంలో వరంగల్- 2 డిపో మేనేజర్ జి. సురేశ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాజీపేట మీదుగా మేడారం వెళ్లడానికి ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా నాలుగు క్యూలైన్‌లు, నాలుగు టికెట్ కౌంటర్‌లు, మరుగుదొడ్లు, డ్రింకింగ్ వాటర్ లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏ తేదీల నుంచి బస్సులు నడుస్తాయో త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భాస్కర్, ప్యాసింజర్ గైడ్ రవీందర్ పాల్గొన్నారు.

## మహ్మద్ అన్వర్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న అన్వర్

సుబేదారి, ఫిబ్రవరి 10: హనుమకొండకు చెందిన ప్రముఖ సామాజిక వేత్త, అయాన్ ఫౌండేషన్ చైర్మన్ మహ్మద్ అన్వర్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ యూఎస్‌వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో ఐఏఎస్‌లు డాక్టర్ ఏసీ మోహన్‌దాస్, సంపత్‌కుమార్‌ల చేతుల మీదుగా మహ్మద్ అన్వర్ డాక్టరేట్‌ను అందుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధరంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినవారిని గుర్తించి వారికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. అందులో భాగంగా హనుమకొండకు చెందిన అన్వర్ ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తూ పేదవారికి ఇనిస్టిట్యూట్‌లో ఉచితంగా కోచింగ్ ఇప్పించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దినందుకు గాను అన్వర్‌కు ఈ డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ తనకు డాక్టరేట్ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

# ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

**ఆటో డ్రైవర్ల ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ అంకూషా వలి**


సమావేశంలో మాట్లాడుతున్న అంకూషా వలి, చిర్ర రమేష్ గౌడ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 11: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంలో ఉపాధి కోల్పోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల వరంగల్ ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ ఎం.డి. అంకూషావలి, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఆదివారం వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటో డ్రైవర్ల జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15వేల చొప్పున జీవన భృతి కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఉపాధి కోల్పోయి రాష్ట్రంలో ఇప్పటివరకు 22 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఆయా కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ రన్ చట్టాన్ని రద్దుచేయాలని దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో డ్రైవర్ల జేఏసీ వైస్ చైర్మన్ పసుల యాదగిరి, కన్వీనర్ దేవర మల్లేష్, జిల్లా నాయకులు మామిడాల వెంకన్న, బండి లింగయ్య, ఓరుగంటి సదానందం, పైండ్ల రవీందర్, ధారావత్ సమ్మయ్య నాయక్, కందికొండ పరుశు రాములు, బూజుగుండ్ల రాజు, సుమన్‌తో పాటు సీఐటీయూ జిల్లా నాయకులు జి. ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 8 లోక్‌సభ సీట్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉల్లెంగుల యాదగిరి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 11: రాబోయే లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీసీలకు 8 లోక్‌సభ సీట్లు కేటాయించాలని ఏఐసీసీ నేషనల్ జాయింట్ కో ఆర్డినేటర్, ఓబీసీ నేత ఉల్లెంగుల యాదగిరి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గేను కోరారు. హనుమకొండ సాయినగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు రజకులకు ఎంపీ సీట్లు కేటాయించలేదని అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడిన రజకులకు కరీంనగర్, ఖమ్మం ఎంపీ సీట్లు కేటాయించి సముచితస్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రఫీయొద్దీన్, ఎలుక సుగుణ, భూక్య సుజాత, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు భరోసా ఇవ్వని బడ్జెట్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 11: బడ్జెట్ గిరిజనులకు భరోసా ఇవ్వలేదని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్ అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో శ్రావన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఎల్‌హెచ్‌పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ గిరిజనులను నిరాశపర్చిందన్నారు. గిరిజన జనాభా దామాషా ప్రకారం 10 శాతం నిధులు కేటాయించి ఉండాల్సి ఉండగా కేవలం రూ. 13013 కోట్లు కేటాయించిందని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి గిరిజన సంక్షేమంపైసమీక్ష చేసి ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈనెల 15న నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతీ తండాలో ఘనంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో రామేల్ నాయక్, రాజు నాయక్, బోడ కిషన్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీని కలిసిన యువ ఐఏఎస్ శ్రీసాయి అశ్రిత్


సీపీ అంబర్ కిశోర్ ఝాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీసాయి అశ్రిత్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 11: ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న ఐఏఎస్ శాఖమూరి శ్రీ సాయి అశ్రిత్ ఆదివారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన శ్రీసాయి అశ్రిత్ 2023 బ్యాచ్‌లో 40వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపిక అయ్యారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న ఆయనకు యూపీ కేడర్ కేటాయించారు. శిక్షణలో భాగంగా భారత్‌యాత్రలో పాల్గొని సెలవుపై హనుమకొండకు వచ్చిన సందర్భంగా సీపీని కలిశారు. ఈ సందర్భంగా శ్రీసాయి అశ్రిత్‌ను సీపీ అంబర్ కిశోర్‌ఝా అభినందించారు.

## మడికొండ సీఐగా ప్రతాప్ బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతాప్

మడికొండ, ఫిబ్రవరి 11: మడికొండ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా డి.ప్రతాప్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు స్థానిక ఎస్ఐలు రాజబాబు, దివ్య, పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన గుజ్జేటి వేణు బదిలీపై టాస్క్‌ఫోర్స్ విభాగానికి వెళ్లారు. నూతన ఎస్‌హెచ్‌వో ప్రతాప్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## వరంగల్ ఎంపీ కాంగ్రెస్ టికెట్ మాదిగలకు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ మాదిగ

సుబేదారి, ఫిబ్రవరి 11: రాబోయే లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ కాంగ్రెస్ టికెట్ మాదిగలకు కేటాయించాలని మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ కాంగ్రెస్ హైకమాండ్‌ను కోరారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్ మాదిగ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయంగా మాదిగలకు ప్రాధాన్యత కల్పించలేదని, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మాదిగలకు సముచిత స్థానం కల్పించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అత్యధికంగా మాదిగ జనాభా ఉన్న వరంగల్ ఎంపీ టికెట్‌ను మాదిగలకు కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని నాగర్ కర్నూల్, పెద్దపల్లి ఎంపీ టికెట్‌లను కూడా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు టికెట్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో మాదిగ హక్కుల దండోరా వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ మాదిగ, నాయకులు గనిపాయ దయాకర్ మాదిగ, గనిపాక అరుణ్ మాదిగ, మరుపట్ల క్రాంతి మాదిగ, మాచర్ల నిఖిల్ మాదిగ, కోడూరు కార్తీక్ మాదిగ, గనిపాక విశాల్ మాదిగ, గనిపాక ప్రణయ్ మాదిగ, గనిపాక సాత్విక్ మాదిగ పాల్గొన్నారు.

## త్వరలో వైద్య, ఆరోగ్యశాఖలో బదిలీలు?

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులను బదిలీ చేసింది. ఇక పారా మెడికల్ ఉద్యోగుల వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లను రద్దుపరిచింది. ఇక జిల్లా స్థాయిలో దీర్ఘకాలికంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇద్దరు కూడా దీర్ఘకాలికంగా వర్క్ ఆర్డర్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ కూడా దీర్ఘకాలికంగా ఈ పోస్టులో కొనసాగుతున్నారు.

ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పోస్టుల్లో కొనసాగుతున్నారు. వీరిలో ఎంత మంది బదిలీ వేటు పడనుందోనని అధికారుల్లో ఆందోళన మొదలైంది. అదే విధంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ లలో కొందరు దీర్ఘకాలికంగా వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తిష్టవేశారు. కొందరికి స్థానచలనం చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

## 16న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

ఐనవోలు, ఫిబ్రవరి 11: ఈ నెల 16న జరుపతలపెట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల మండల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దర్శనాల సంపత్ అధ్యక్షతన ఆదివారం స్థానికంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరుగు సమ్మె గ్రామీణ బంద్‌లో కార్మిక, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య, రైతు సంఘం మండల గౌరవ సలహాదారులు గుండెకారి మహేందర్, మండల అధ్యక్షుడు మడిగె నాగరాజు, కె. శంకర్ రెడ్డి, కేవీపీఎస్ మండల కార్యదర్శి గబ్బెట రామ్‌కుమార్, నాయకులు బొమ్మకంటి యాకయ్య, గోపాల్‌రావు, ఆనందం, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌వీఎస్‌లో ఘనంగా ముగిసిన స్ప్రింగ్ ఫైర్ వేడుకలు

**ప్రత్యేక ఆకర్షణగా ఫేస్ పెయింటింగ్, రచ్చ రవి కామెడీ**



ఫ్యాషన్‌షోలో పాల్గొన్న యువతులు

భీమారం, ఫిబ్రవరి 11: భీమారంలో ఎస్‌వీఎస్ విద్యాసంస్థలో నిర్వహిస్తున్న స్ప్రింగ్‌ఫైర్-24 వేడుకల సదస్సు ఆదివారం ముగిసింది. ఈ వేడుకల్లో భాగంగా టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పాలిసెట్, ఈఏపీ సెట్‌లలో టెస్ట్ నిర్వహించారు. అనంతరం స్ప్రింగ్ ఫైర్ వేడుకల్లో భాగంగా రంగోలి, ఫేస్ పెయింటింగ్, సాండ్ ఆర్ట్, ట్రెజర్‌హంట్, టెక్నికల్ క్విజ్, ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌వీఎస్ పూర్వ విద్యార్థి, జబర్దస్త్ ఫేమ్ రచ్చ రవి, మిమిక్రీ ఆర్టిస్ట్ కిరణ్ హాజరై విద్యార్థులను వారి కామెడీ, మిమిక్రీతో అలరించారు.

ఈ సందర్భంగా ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో, మానసిక ఉల్లాసం, నూతనోత్తేజం కలుగుతుందని తెలిపారు. రెండు రోజుల కార్యక్రమంలో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలను, నగదు బహుమతులను అందజేశారు. చివరగా పూర్వ విద్యార్థి రచ్చ రవికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవంతం చేసిన ఎస్‌వీఎస్ ప్రిన్సిపాల్, డైరెక్టర్, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. చివరగా నిర్వహించిన విద్యార్థుల ఫ్యాషన్ షో అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణ, సెక్రటరీ డాక్టర్ హర్షిణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు చరిత్రను చెరిపేసే కుట్ర

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా కాకతీయులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని రికార్డుల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓరుగల్లు చరిత్రను చెరిపేసే కుట్రలో భాగంగానే రాజముద్రలో కాకతీయ తోరణ తొలగింపు అని పేర్కొన్నారు. చరిత్రను తుడిచివేసే కుట్రను మేధావులు, విద్యావేత్తలు, ప్రజలు, యువత తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాకతీయులపై నోరు పారేసుకుంటే కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ప్రజలే పాతరేస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా వేణు బాధ్యతలు


బాధ్యతలు చేపట్టిన సీఐ వేణు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: ఇటీవల జరిగిన బదిలీలలో మడికొండలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జి.వేణు వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. ఆదివారం వరంగల్ టాస్క్‌ఫోర్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా వేణు బాధ్యతలు చేపట్టారు. 2004 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన వేణు.. భూపాలపల్లి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్‌లలో పని చేసి 2013లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. పీటీసీ, మిల్స్‌కాలనీ, భూపాలపల్లి, మడికొండలో పనిచేసి ప్రస్తుతం వరంగల్ టాస్క్‌ఫోర్స్‌లో విధుల్లో చేరాడు. వేణు అక్కడి ఏసీపీ మధుసూధన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తర్వాత ఇన్‌స్పెక్టర్ వేణును టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫిట్స్ వ్యాధిపై వర్క్‌షాప్

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 11: ఐఎంఏ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఫిట్స్ వ్యాధిపై ఆదివారం ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో ఫిజిషియన్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ గౌతమ్, డాక్టర్ నరేశ్, డాక్టర్ అరవింద్‌లు యువ వైద్యులకు ఫిట్స్ వ్యాధి నిర్ధారణ, ట్రీట్‌మెంట్‌పై నూతన ఆవిష్కరణలు, విధి విధానాలను వివరించారు. అధునాతనమైన వైద్య చికిత్సలో మెళకువలను వివరించారు. అనంతరం మెడికల్ కౌన్సిల్ నూతనంగా ఐఎంఏ వరంగల్ శాఖ నుంచి ఎన్నికైన సభ్యులు డాక్టర్ నరేశ్ కుమార్, డాక్టర్ అజిత్ మహ్మద్, డాక్టర్ వెంకట్‌లను ఘనంగాఆ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ అప్పల సుధాకర్, ఏఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అశోక్‌రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంధ్యారాణి, ఐఎంఏ వరంగల్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మహ్మద్ అన్వర్, డాక్టర్ బింగి శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## మురళీదర్శన్‌కు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 11: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ నుంచి ప్రొఫెసర్ మురళీదర్శన్‌కు టికెట్ ఇవ్వాలని కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, గణితశాస్త్ర ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. ఆదివారం కేయూలో జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పదోన్నతుల్లో సంక్షోభాన్ని నివారించాలి

**టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి**

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 11: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఉన్న సంక్షోభాన్ని నివారించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన చావ రవి మాట్లాడుతూ.. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు కరువు భత్యాలు మంజూరు చేసి, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయల నియామకం కోసం మెగా డీఎస్‌సీ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలిపారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది నియమించి, మండలకేంద్రాల్లోని ప్రస్తుతం ఉన్న ఉన్నత పాఠశాలలనే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎం.సదాశివరెడ్డి, తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్, బద్దం వెంకట్‌రెడ్డి, మర్ని అన్నాదేవి, రవూఫ్, పాక శ్రీనివాస్, కె.రమేశ్, ఎస్.శ్రీనివాస్, మల్లేశ్, రవీందర్, లింగమూర్తి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని కలిసిన ఆర్ఎంపీ అసోసియేషన్ బాధ్యులు

ఐనవోలు, ఫిబ్రవరి 11: ఐనవోలు ఎస్సై బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్‌ను ఆర్ఎంపీ, పీఎంపీ మండల అసోసియేషన్ బాధ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ చిర్ర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అంబరగొండ రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు బాసాని సాంబయ్య సలహాదారుడు తుమ్మ యాకాంతం, ప్రచార కార్యదర్శి కంజర్ల నాగరాజు, కమిటీ సభ్యులు కె. శ్రావణ్, ఎస్.రవికుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఎస్సైని శాలువతో సన్మానిస్తున్న సంఘం బాధ్యులు



## మార్చి 1 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంహెచ్‌ఆర్, ఎంటీఎం, సైకాలజీలతో పాటు ఇతర రెగ్యులర్ పీజీ కోర్సుల పరీక్షలు మార్చి 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1, 4, 6, 11, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

## బంగారు ఆభరణాల దొంగ పట్టివేత


గీసుగొండ, ఫిబ్రవరి 11: మండలంలోని గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బంగారు ఆభరణాల దొంగను పట్టుకున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ భాగంగా కారును ఆపి పరిశీలిస్తుండగా డ్రైవింగ్ చేస్తున్న తూర్పాటి ప్రసాద్‌పై అనుమానం వచ్చి విచారించినట్లు సీఐ తెలిపారు. విచారణలో ప్రసాద్ గత సంవత్సరం కీర్తినగర్ జయశంకర్‌కాలనీలో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలను ఎత్తికెళ్లినట్లు చెప్పారన్నారు. బంగారం అమ్మగా వచ్చిన డబ్బుతో కారు కొని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలపడంతో కారును సీజ్ చేసినట్లు సీఐ వివరించారు.





హైదరాబాద్ నడిబొడ్డున జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్.. అందులో ఒక రాజకుమారి. ఆమె పేరు **ఇందిరాదేవి ధనరాజ్ గిరి**. ఆమె పూర్వీకులు మహారాష్ట్రను పాలించేవారు. వారికి హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో ప్యాలెస్‌లు ఉండేవి. ఇందిరాదేవి నాన్న రాజా ధన్‌రాజ్ గిరి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన హైదరాబాద్‌కు చెందిన హిందీ, ఉర్దూ, ఆంగ్ల సాహితీ ప్రపంచంతో మమేకమయ్యారు. ఆ బాటలోనే నడిచిన ఇందిరాదేవి... ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మను వివాహం చేసుకొన్నారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో హిందీ అకాడమీకి ఛైర్‌పర్సన్‌గా కూడా వ్యవహరించారు. గత వైభవపు చిహ్నాలకు, అనేక చారిత్రక ఘటనలకు ప్రత్యక్ష సాక్షి అయిన 94 ఏళ్ల ఇందిరాదేవి 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సీవీఎల్ఎన్ ప్రసాద్



# "రాజకుమారినే కానీ.. మామూలు మహిళనే...

## శేషేంద్ర జీవితంపై సినిమా!

**శేషేంద్ర** అంటే దర్శకుడు కె. విశ్వనాథ్‌కు విపరీతమైన ప్రేమ ఉండేది. శేషేంద్ర జీవితంపై ఒక సినిమా తీయాలనేది ఆయన కోరిక. ఒక సారి మేము గుప్తా ఫౌండేషన్ అవార్డు తీసుకోవటానికి ఊరు వెళ్లాం. సభకు వెళ్లేముందు శేషేంద్ర కారిడార్‌లోకి వెళ్లాడు. అక్కడ ఒక వ్యక్తి వచ్చి శేషేంద్ర కాళ్లకు దండం పెడుతున్నాడు. ఎవరా అని చూస్తే- కె. విశ్వనాథ్. ఒక గొప్ప వ్యక్తి మరొక గొప్ప వ్యక్తి కాళ్లకు దండం పెట్టిన సందర్భం అది. కె. విశ్వనాథ్ తరచు ఇంటికి వస్తూ ఉండేవారు.

**చరిత్రలో అనేక సంఘటనలకు మీరు ప్రత్యక్ష సాక్షి. ప్రస్తుతం మీ దినచర్య ఏమిటి?**

అవును. ఎన్నో చూశా. చరిత్రలో నిలిచిపోయిన అనేక మందిని దగ్గరగా చూశా. నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణన్, నిజాం, సాలార్‌జంగ్, మౌంట్ బాటెన్, పిఠాపురం మహారాణి, విశ్వనాథ, శ్రీశ్రీ, బెజవాడ గోపాలరెడ్డి, సి. నారాయణరెడ్డి, ముఖ్దుం, అడిగ, సర్దార్ జఫ్రీ, ఖైఫీ ఆజ్మీ- ఇలా



చెప్పుకుంటూ పోతే ఎంతో మంది. ఇప్పుడు ఆ జ్ఞాపకాల నీడలో నిలబడి ఉన్నా. ఇక దినచర్య అంటారా.. ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత- ముందు సూర్యభగవానుడిని, ఆ తర్వాత కులదేవతను ప్రార్థిస్తా. నా చిన్నప్పటి నుంచి ఇదే అలవాటు నేర్చారు. ఆ తర్వాతే మిగిలిన పనులన్నీ. మధ్యాహ్నం భోజనం చేసే లోపులో కనీసం ఒక గంట చదువుతా! ఇది చిన్నప్పటి అలవాటు. ఇప్పటికీ కొనసాగుతోంది. ఇంతకు ముందు ఏడాదికి కనీసం ఒక సారి ప్రయాణం చేసేదాన్ని. మాకు ముంబాయి, పూణే, ఊటీలలో ఇళ్లు ఉన్నాయి. అక్కడికి వెళ్లేదాన్ని. ఇక విదేశాలలో బ్యాంకాక్ అంటే ఇష్టం. ఎందుకంటే వీసా అవసరం లేదు. అంతే కాకుండా మూడున్నర గంటల ప్రయాణమే!

**మీ చిన్నతనమంతా జ్ఞానభాగ్‌లోనే గడించి కదా.. ఇక్కడ మీకు ఇష్టమైన ప్రదేశాలేమిటి?**

మాది పేష్వాల వంశం. షోలాపూర్ సమీప ప్రాంతాలను మా పూర్వీకులు పాలించేవారు. మాకు ముంబాయి, పూణే, హైదరాబాద్, ఊటీ- ఇలా అనేక ప్రాంతాల్లో ప్యాలెస్‌లు ఉండేవి. నేను పుట్టింది.. కొద్ది కాలం పెరిగింది ముంబాయిలో. తాతగారు చనిపోయిన తర్వాత మేము హైదరాబాద్‌కు వచ్చేసాం. మేము జ్ఞాన్ బాగ్ ప్యాలెస్‌లో.. చిన్నాన్నగారి కుటుంబం కోఠిలోని ప్యాలెస్ (ప్రస్తుతం ఈఎన్‌టీ ఆసుపత్రి)లో స్థిరపడ్డాం. నా చిన్నతనమంతా జ్ఞాన్‌బాగ్‌లోనే గడిచింది. ఒకటా.. రెండా.. చెప్పుకుంటూ పోతే ఎన్నో జ్ఞాపకాలు. ఒకో ప్రదేశంతో ఒకో జ్ఞాపకం ముడిపడి ఉంది. ఇంటి వెనక చిన్న జూ ఉండేది. అందులో పులులు, చిరుతలు, గుర్రాలు ఉండేవి. వెనక ఒక హెర్క్యులెస్ విగ్రహం ఉంది. దాని చుట్టూ పరిగెడుతూ ఆడుకొనేదాన్ని. ముంబాయి నుంచి వచ్చేసిన తర్వాత హైస్కూలు దాకా మెహబూబియా గర్ల్స్ స్కూల్‌లో చదివా. ఆ తర్వాత కాలేజీకి పంపలేదు. ఆ రోజుల్లో అమ్మాయిలను కాలేజీలకు ఎక్కువగా పంపేవారు కాదు. మా ఇంట్లో ఒక యూరోపియన్ నానీ ఉండేది. ఉదయాన్నే లేచి ఇంట్లో ఉన్న ఫ్లవర్‌వాజ్‌లలో పూలు పెడుతూ ఉండేది. అమ్మ నన్ను ఆవిడ వెనకే పంపేది. నేను కూడా పూలు ఎలా పెట్టాలో నేర్చుకొనేదాన్ని. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నాకు ఆ రోజుల్లోనే మంచి లైబ్రరీ ఉండేది. మంచి సాహిత్యాన్ని చదువుతూ ఉండేదాన్ని. బహుశా అలాంటి లైఫ్‌ను ఈ తరం వాళ్లు ఊహించలేరు కూడా. ఒక ఫెయిరీటైల్ లైఫ్. నా జీవితమంతా అలాగే సాగింది.

**ఈ రాజకుమారి జీవితంలో అన్నీ సంతోషాలేనా? దుఃఖాలేమి లేవా?**

ప్రతి వ్యక్తి జీవితంలోను ఉంటాయి. నా జీవితంలోనూ ఉన్నాయి. నేను రాజకుమారి కావచ్చు. కానీ నేను ఒక సాధారణ మహిళనే. ఒక అమ్మగా.. భార్యగా.. సోదరిగా.. స్నేహితురాలిగా- ఇలా అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవన్నీ నాలోను ఉన్నాయి. నాకు 14 ఏళ్లు ఉన్నప్పుడు అమ్మ చనిపోయింది. దానితో చెల్లిని.. తమ్ముడిని నేనే పెంచాను. నాన్న(మహరాజా ధన్‌రాజ్‌గిరీ)కి అనేక వ్యాపకాలు ఉండేది. ఆయన కదిలే ఒక బ్రైన్‌లాంటివారు.

### రాధాకృష్ణన్‌తో...

సర్వేపల్లి రాధాకృష్ణన్ మా ఇంటికి చాలా సార్లు వస్తూ ఉండేవారు. ఒక సారి ఒక పని కోసం ఆయకు విరాళం అవసరం వచ్చింది. ఆయన హైదరాబాద్‌కు వచ్చి నేరుగా నిజాం దగ్గరకు వెళ్లారు. అక్కడ నుంచి ఆయన నేరుగా నాన్నదగ్గరకు వచ్చారు. నాన్నకు ఆయనను కలవటం ఇష్టం లేదు. కానీ ఆయన వస్తే కాదనలేకపోయారు. నేను వారిద్దరూ ఏం మాట్లాడుకుంటారా? అని బాల్కనీ నుంచి చూస్తున్నా. రాధాకృష్ణన్ వచ్చి నాన్న ఎదురుగా కూర్చున్నారు. ఏమి మాట్లాడకుండా- భగవద్గీతను గట్టిగా చదవటం మొదలుపెట్టారు. కొద్ది సేపు పోయిన తర్వాత నాన్న తన సెక్రటరీని పిలిచి - "లక్ష రూపాయల చెక్కు తీసుకురా!" అన్నారు. ఆ చెక్కును రాధాకృష్ణన్‌కు ఇచ్చారు.

ఎప్పుడూ ఆగేవారు కాదు. ఇంటికి ప్రతి రోజు కనీసం 40 మంది అతిథులు వచ్చేవారు. వారందరినీ చూసుకోవాల్సి వచ్చేది. కొందరు వచ్చి- "హుజూర్ డబ్బులు నీళ్లల్లా ఖర్చు చేస్తున్నారు" అంటూ ఉండేవారు. అందరిని సంతృప్తిపరచటంలో ఆయనకు ఆనందం కలిగేది. ఆ కోణం నుంచి చూస్తే ఆయన సంతోషంగానే బతికారు. ఇక్కడ ఇంకో మాట చెప్పాలి. రాజకుటుంబాలంటే- అపరిమితమైన డబ్బులు ఉంటాయనుకుంటారు. కానీ అది నిజం కాదు. నాకు చిన్నప్పుడు నెలకు రూ. 10లు పాకెట్ మనీ ఇచ్చేవారు. నా ఖర్చులన్నీ దానిలోనే! ఏడాదికి రెండు, మూడు సార్లు బట్టలు కుట్టించేవారు. నేను యుక్తవయస్సుకు వచ్చిన తర్వాత పాకెట్ మనీ రూ. 300లకి పెరిగింది. అమ్మ చనిపోయిన తర్వాత రూ.1500కి పెరిగింది. దీనితోనే నా ఖర్చులు పెట్టుకొనేదాన్ని. ఒక్క మాటలో చెప్పాలంటే- మా నాన్నకు డబ్బులు ఉన్నాయి కానీ మాకు లేవు.

**గుంటూరు శేషేంద్రశర్మగారిని పెళ్లి చేసుకున్న తర్వాత మీ జీవితంలో వచ్చిన మార్పులేమిటి?**

శేషేంద్రను పెళ్లి చేసుకోవటం నాన్నగారికి ఇష్టం లేదు. రాజకుటుంబాలలోని వారిని పెళ్లి చేసుకోవటం నాకు ఇష్టం లేదు. నాన్న మాట వింటే- ఆయనలాంటి మరో వ్యక్తినే చేసుకోవాల్సి వచ్చేది. ఇంటికి వచ్చిన అతిధులను చూసుకుంటూ.. రాజవిధులు నిర్వర్తిస్తూ ఇంకో రాజకుమారిలా మిగిలిపోయేదాన్ని. అలా ఉండటం నాకు ఇష్టం లేదు. నాకు నచ్చిన రీతిలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనేది నా ఉద్దేశం. అందుకే నేను, శేషేంద్ర ఎవరికీ చెప్పకుండా హలిబీడ్ వెళ్లిపోయాం. అప్పుడు నా దగ్గర 14 వేలు మాత్రమే ఉన్నాయి. ఏం జరుగుతుందో తెలియదు. హలిబీడ్‌లో ఒక గుడిలో పెళ్లి చేసుకున్నాం. ఒకరే అతిధిగా వచ్చారు. గుడిలో జరుగుతున్న హడావిడిని చూసి - చుట్టుపక్కల గ్రామస్థులు ఏం జరుగుతోందని అడిగారట. గుడిలో వారు- మహరాణి పెళ్లి చేసుకుంటోంది అని చెప్పారట. దాంతో ఆ రాత్రికి చుట్టుపక్కల ఊళ్లలో ఉన్న అనేక మంది లాంతర్లు పట్టుకొని వచ్చారు. చిమ్మ చీకటి.. మినుక్కుమినుక్కు మంటూ నక్షత్రాల్లా వందల లాంతర్లు.. ఆ రోజును ఇప్పటికీ నా కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది.

**ప్రస్తుత సాహిత్యంపై మీ అభిప్రాయమేమిటి?**

సాహిత్యం ఒక జీవధార. ప్రవాహ వేగం తగ్గవచ్చు. కానీ ఎప్పటికీ చావదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎక్కువ మంది సాహిత్య రంగంలోకి రావాలనుకోవటం లేదు. ప్రోత్సాహం లేకపోవటమే దీనికి కారణం. సాహిత్యం గురించి తెలిసిన రాజకీయ నాయకులు లేకపోవటం కూడా దీనికి ఒక కారణం. ఉదాహరణకు కర్ణాటకకు ముఖ్యమంత్రిగా చేసిన రామకృష్ణ హెగ్డే మంచి సాహిత్యకారుడు. రాజకీయాల్లోకి రాకముందు సాహిత్యంలో చాలా కృషి చేశాడు. గతంలో అలాంటి వారు ఉండేవారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో అసలైన సాహిత్యం ప్రాంతీయ భాషల్లోనే ఉంది. మన భారతీయ భాషల నుంచి ఇంగ్లీషులో అనువాదం చేస్తే అసలు అర్థం రాదు. కానీ ఒక భారతీయ భాష నుంచి వేరే భాషకు అనువాదం చేస్తే అర్థం చెడిపోదు.

**శేషేంద్రగారితో సాహితీజీవితం ఎలా గడిచింది?**

అనేక జ్ఞాపకాలు. అన్నింటినీ ఒక చోట ఎలా పెట్టగలను? మా నాన్నగారు సాహిత్యాభిమాని. ఉర్దు, పర్షియన్, మరాఠీ ఇలా అనేక భాషలకు చెందిన కవులు, కళాకారులు మా ఇంటికి వస్తూ ఉండేవారు. కానీ తెలుగువారు ఉండేవారు కాదు. శేషేంద్ర వల్ల ఆ లోటు తీరింది. ఇక శేషేంద్రకు ఎటువంటి గర్వం లేని వ్యక్తి. చాలా సున్నితమైన కవి. ఎటువంటి ఆడంబరాలు కోరుకొనేవాడు కాదు. జీవితమంతా రాస్తూనే ఉన్నాడు. ఎవరైనా 50 పుస్తకాలు రాయాలంటే ఎంత కష్టమో ఊహించుకోండి. ఆయన అనేక అవమానాలకు కూడా గురయ్యాడు. వాటి నుంచి గొప్ప కవిత్వం కూడా పుట్టింది. 'నా దేశం.. నా ప్రజలు' అలా వచ్చిందే! ఆ రోజుల్లో శేషేంద్ర ఆఫీసుకు మెర్సిడిస్‌లో వెళ్లేవాడు. ఆఫీసులో ఉన్నవారు అసూయ పడతారని- మెర్సిడిస్‌లో వెళ్లవద్దని చెప్పేదాన్ని. కానీ తను వినేవాడు కాదు. మెర్సిడిస్ చాలా మందిలో కడుపుమంట రగిల్చింది. శేషేంద్ర పుస్తకాలు కొన్ని ఉర్దులోకి అనువాదమయ్యాయి. వాటిని తీసుకువెళ్లి అక్కడున్న స్పెషల్ ఆఫీసర్‌కు చూపించాడు. ఆయన కోపంతో రగిలిపోయి- వాటిని శేషేంద్ర మొహం మీద విసిరి కొట్టాడు. దాంతో శేషేంద్రకు విపరీతమైన కోపం వచ్చింది. అవమానంగా భావించాడు. ఇంటికి వచ్చేశాడు. ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక- తన బాధ చల్లార్చటానికి ఊటీకి వెళ్దామన్నా. వారం రోజులు సెలవు పెట్టించా. ముందు బెంగుళూరు వెళ్లాం. అక్కడా తను రాస్తూనే ఉన్నాడు. అక్కడి నుంచి ఊటీ వెళ్లాం. ఒక రోజు ఉదయాన్నే దూరంగా ఉన్న కొండ మీదకు వెళ్లాడు. కిందకు రమ్మంటే రాలేదు. సాయంత్రం తిరిగి వచ్చాడు. ఆ రాత్రి కోపంతో కాగితాల మీద ఇంగ్లీషులో రాసి విసిరేశాడు. వాటిని నేను చదివాను. "నీ జీవితంలో అద్భుతమైన కవితను రాశావు" అన్నా. తను వినిపించుకోలేదు. ఆ ర్వాత వాటిని ముందు హిందీలోకి అనువాదం చేయించా. అక్కడ తనకు విపరీతమైన పేరు వచ్చింది. ఆ తర్వాతే అవి తెలుగులోకి వచ్చాయి. ప్రతి కవి జీవితంలోను ఇలాంటి అనుభవాలన్నో ఉంటాయి.



**శేషేంద్రగారి సాహితీ సౌరభాలను భవిష్యత్ తరాలకు ఎలా అందించాలనుకుంటున్నారు?**

శేషేంద్ర ఒకప్పుడు పోస్ట్‌కార్డుల మీద ఉత్తరాలు రాసేవారు. ఆయనకు కూడా కార్డులే వచ్చేవి. ఒక స్టేషన్ మాస్టర్, ఒక రిక్షా కార్మికుడు, ఒక సాధరణ టీచర్- ఇలాంటి వారందరికీ ఉత్తరాలు రాస్తూ ఉండేవారు. వారే నా సాహిత్యానికి పాఠకులు అనేవారు. అలా శేషేంద్ర రాసిన 10 వేల ఉత్తరాలతో ఒక గ్యాలరీ ప్రారంభించాం. దీనిలో 4 వేలు పోస్ట్‌కార్డులే ఉన్నాయి. నా భర్తకు నేను ఇచ్చే గొప్ప నివాళి ఇదే! అంతే కాదు. అది నా బాధ్యత కూడా. నేను వెళ్లిపోయిన తర్వాత వీటిని ఎవరు భద్రపరుస్తారు? నేను కట్టిన కోటను నేనే కూలగొట్టగలనా? చాలా మంది గ్యాలరీ ఎక్కడ ఉంది అని అడుగుతున్నారు. నాచారంలో గ్యాలరీ కోసం ప్రత్యేకంగా ఒక ఫ్లాట్ తీసుకున్నాం. దీనిలో శేషేంద్ర సాహిత్యాన్ని భద్రపరుస్తున్నా. నా ఉద్దేశంలో ఆ గ్యాలరీ జ్ఞాన్‌భాగ్ కన్నా పెద్దది. అంతే కాదు. జ్ఞాన్‌బాగ్‌లో ఒక గెస్ట్‌హౌస్‌ను నిర్మిస్తున్నా. రచయితలు వచ్చి పది రోజులో.. పదిహేను రోజులో నివసించాలి. తమకు నచ్చింది రాయాలి. ఆ రచనలు పుస్తక రూపంలో రావాలి. అంతే కాకుండా కనీసం ఏడాదికొకసారి సాహితీ సమావేశాలు జరపాలనుకుంటున్నా.

**శేషేంద్ర గారి రచనల కాపీరైట్‌పై వివాదం నెలకొని ఉంది కదా..**

దాని గురించి మాట్లాడటం నాకు ఇష్టం లేదు. శేషేంద్ర పుస్తకాలన్నీ నేనే ప్రచురించాను. కాపీరైట్ కూడా ఆయన నాకే రాసిచ్చారు. కానీ మా లాయర్ సరిగ్గా రిప్రజెంట్ చేయకపోవటం వల్ల ఆ కేసు వీగిపోయింది. శేషేంద్ర, నేను కలిసి 36 ఏళ్లు బతికాం. తను వెళ్లిపోయిన తర్వాత ఇలాంటి సంఘటనలు జరగటం చాలా దుఃఖం కలిగిస్తోంది. కొందరు ఈ కేసును పోరాడమని నాకు సలహా ఇస్తున్నారు. నేను దేని కోసం పోరాడాలి? పోరాడే ఉద్దేశం లేదు. కానీ వారి దగ్గర వీరి దగ్గర డబ్బులు తీసుకొని శేషేంద్ర పుస్తకాలు వేయటమే నాకు అవమానంగా అనిపిస్తోంది.

**మీరు మంచి రచయిత్రి, పెయింటర్ కూడా కదా.. కానీ ఆ వ్యాసాంగం ఎందుకు కొనసాగించలేదు?**

మంచి రచయితనో కాదో నాకు తెలియదు. 9 ఏళ్ల వయస్సులో నా తొలి కవిత స్కూల్ మ్యాగజైన్‌లో ప్రచురించారు. ఆ తర్వాత విపరీతంగా పుస్తకాలు చదివేదాన్ని. ఆ తర్వాత నా జీవితమంతా సాహితీకారుల సాంగత్యంలోనే గడిచింది. నేను రాసిన ఇంగ్లీషు కవితలను ముఖ్దుం ఉర్దులోకి ట్రాన్స్‌లేట్ చేశారు. కానీ నేను ఎప్పుడూ కవియిత్రిగా స్థిరపడాలనుకోలేదు. ఎందుకంటే- ఒక ఇంట్లో ఇద్దరు కవులు ఉండకూడదు. అనేక అపార్థాలు వచ్చే అవకాశముంది. ఆ తర్వాత అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హిందీ అకాడమీ ఛైర్‌పర్సన్‌గా పనిచేశా. అంతే కాదు. ఒక ఉర్దు పత్రికకు పన్నెండున్నరేళ్లు ఒక కాలమ్ రాశా. వాటిలో 750 పేజీల పుస్తకం వేశారు. ఇక పెయింటింగ్ వేయటం ఎప్పుడో మానేసా. ముంబాయిలో నా తొలి పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఎంఎఫ్ హుస్సేన్‌తో కలిసి నిర్వహించా.

**శ్రీశ్రీ** మాకు మంచి స్నేహితుడు. తనను కలవక ముందే ఆయన సాహిత్యం చదివాను. చాలా నచ్చి ఉర్దు కవులకు పరిచయం చేశాను. వారు కూడా శ్రీశ్రీ గురించి బాగా రాయటం మొదలుపెట్టారు. వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జ్ఞాన్‌భాగ్‌లో తెలుగు కవుల సమావేశం జరుగుతోంది. సమావేశం జరుగుతున్నప్పుడే- శ్రీశ్రీని అరెస్ట్ చేశారు. నాకు ఎవరో చెబితే వెంగళరావుకు ఫోన్ చేశా. "సమావేశం జరుగుతున్నప్పుడు అరెస్ట్ చేయటం సరికాదు. వాళ్లందరు ధర్నా చేస్తే బావుండదు. వదిలేయండి. రేపు సాయంత్రం ఆయన ముగింపు సమావేశంలో మాట్లాడాలి" అన్నా. వెంగళరావు- "రేపు సాయంత్రం - నాలుగు గంటలకు వదిలేస్తాం" అన్నాడు. అలాగే పోలీసులు శ్రీశ్రీని వదిలేశారు. శ్రీశ్రీ, వరవరరావు కలిసి జ్ఞాన్‌భాగ్‌కు వచ్చారు. వచ్చిన వెంటనే శ్రీశ్రీ నేరుగా బార్ కౌంటర్ దగ్గరకు వెళ్లాడు. అక్కడున్నవారు వచ్చి- "ఆయన ఇప్పుడు మాట్లాడాలి. తాగనివ్వకండి" అని చెప్పారు. కానీ నేను పెద్దగా పట్టించుకోలేదు. ఆ సాయంత్రం శ్రీశ్రీ మంచి ప్రసంగం చేశాడు.

### విశ్వనాధ చెమక్కు

**ఒక** రోజు నేను, విశ్వనాధ (సత్యన్నారాయణ) ఒక సమావేశానికి వెళ్లాం. అక్కడ వేదికపై కవులు - ఆధునిక కవిత్వం చదువుతున్నారు. విశ్వనాధ నన్ను- వాళ్లు ఏం చేస్తున్నారు? అని అడిగారు. "ఆధునిక కవిత్వం చదువుతున్నారు.. ఇప్పుడు అందరూ ఇష్టపడుతున్నారు" అన్నా. అప్పుడు విశ్వనాధ- " అందరూ మనని వచ్చి గడ్డి తినమంటారు. తింటామా?" అని చెమక్కు విసిరారు.

### ఉదయం అయితే రావద్దన్నా!

**శేషేంద్ర,** ఎన్టీఆర్ గుంటూరు ఏసీ కాలేజీలో కలిసి చదువుకున్నారు. మంచి మిత్రులు. ఒక సారి ఎన్టీఆర్ సెక్రటరీ ఫోన్ చేసి- "ఉదయాన్నే ఆరుగంటలకు రావాలనుకుంటున్నారు" అని నాకు చెప్పాడు. "మరీ అంత ఉదయం అయితే కష్టమవుతుంది. 11 గంటలకు రాగలరా?" అని అడిగాను. "సార్‌కి వేరే అపాయింట్‌మెంట్ ఉంది" అన్నాడు. ఇలా నాలుగైదు సార్లు జరిగింది. చండశాసనుడు సినిమా షూటింగ్ జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్‌లోనే జరిగింది. సినిమా పూర్తయిన తర్వాత ప్రివ్యూకి పిలిచారు. నేను, శేషేంద్ర వెళ్లాం. మగవాళ్లు వేరుగా.. ఆడవాళ్లు వేరుగా కూర్చున్నారు. నాకు ఆశ్చర్యమనిపించింది. ఇక ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక రోజు మా ఇంటికి వస్తానని కబురు పంపారు. నాకు ఏం చేయాలో తెలియలేదు. శేషేంద్ర వచ్చి- "ఆయన ముఖ్యమంత్రి. ఉదయాన్నే వస్తానంటే రావద్దని ఎలా చెప్పగలవు.. పైగా మీ ఆస్తులన్నీ ఇక్కడే ఉన్నాయి.. ఆ విషయాన్ని గుర్తుంచుకో!" అన్నాడు.

### చాలా కష్టం..

**ఒక** కవికి ప్రభుత్వం తరపున అవార్డు రావటం చాలా కష్టం. రకరకాల సమీకరణాలు పనిచేస్తూ ఉంటాయి. శేషేంద్రకు గొప్ప ప్రజాదరణ ఉండేది. కానీ ఆయనకు చివరి వరకు అవార్డులు రాలేదు. సాహిత్య అకాడమీవారు ఆయనకు అవార్డు ప్రకటించినప్పుడు- తను చాలా హర్ట్ అయ్యాడు. "వాళ్లకి ఫోన్ చేసి అవార్డు వద్దు అని చెప్పు" అన్నాడు. నేను ఊరుకున్నా. ఈ లోపులో బీబీసీ ఛానెల్ శేషేంద్రతో ఇంటర్వ్యూ చేసింది. దాంట్లో అవార్డు వచ్చినందుకు ఆనందంగా ఉందన్నాడు. ఆ మర్నాడు ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఒక సందేశాన్ని కూడా పంపారు. ఒక సారి ఆనందంగా ఉందన్నతర్వాత అవార్డు తీసుకోక తప్పదు కదా!

### నిజాంతో...

**నిజాం..** ఆయన కుటుంబ సభ్యులు మాకు చిన్నప్పటి నుంచి బాగా తెలుసు. నాకు నా మొదటి గుర్రాన్ని బహుకరించింది సలార్‌జంగ్! నాకు 14 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు- నన్ను నిజాంకు పరిచయం చేశారు. ఆయన గొంతుకు చాలా పెద్దగా ఉండేది. ఆ తర్వాత అనేక సందర్భాలలో ఆయనను కలిసాను. నిజాం వారసులు కూడా నాకు మంచి స్నేహితులు. ప్రిన్సెస్ ఇస్రాతో నాకు చిన్నప్పటి నుంచి స్నేహం ఉంది. వాళ్లు మా ఇంటికి వచ్చి పోతూ ఉంటారు.

**తాజాగా** ఇందిరాదేవిపై ఒక పుస్తకం విడుదలయింది. ఈ పుస్తక వివరాలు
రాజకుమారి ఇందిరాదేవి
**రచయిత:** మహేష్ విశ్వనాధ
**ప్రతులకు:** 7997994678





## నామ్‌తో సునా హోగా

రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ కాంబినేషన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న 'మిస్టర్ బచ్చన్' చిత్రం షెడ్యూల్ పూర్తయింది. రవితేజతో పాటు ముఖ్య తారాగణం పాల్గొన్న కీలకమైన సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించారు. ఈ సెట్‌లోనే 'మిస్టర్ బచ్చన్' టీమ్ రవితేజ ఇటీవల నటించిన 'ఈగల్' సక్సెస్‌ను సెలబ్రేట్ చేసింది. రవితేజ పూర్తిగా డిఫరెంట్ లుక్‌లో కనిపించే 'మిస్టర్ బచ్చన్' సినిమాకు 'నామ్‌తో సునా హోగా' అన్నది ట్యాగ్‌లైన్. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిబొట్ల సహ నిర్మాత. మిక్కీ జే మేయర్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రానికి ఆయనంక బోస్ సినిమాటోగ్రాఫర్., సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ సిరీస్.

## హీరోయిన్ గుర్రపు స్వారీ

నవ్య | చిత్రజ్యోతి



నిఖిల్ తన 20వ చిత్రం 'స్వయంభూ'లో లెజెండరీ యోధుడి పాత్ర పోషిస్తున్నారు. అద్భుతమైన వార్ సీన్లు ఉండే ఈ సినిమా కోసం ఆయన మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా సంయుక్త నటిస్తున్నారు. కొన్ని యాక్షన్ దృశ్యాల్లో తను పాల్గొనడం కోసం ప్రస్తుతం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నారు సంయుక్త. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో షూటింగ్ జరుగుతోంది. నిఖిల్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొంటున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మనోజ్ పరమహంస సినిమాటోగ్రాఫర్. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు.



## యూనిక్ ఎలిమెంట్స్‌తో..

శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం బాస్కర నారాయణ'. రాశీ సింగ్ కథానాయిక. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ ముదుంబై నిర్మించారు. మార్చి ఒకటిన ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రం ట్రైలర్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేశారు. హీరో శివ కందుకూరి మాట్లాడుతూ 'పురాణాలతో ముడిపడిన ఎలిమెంట్స్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తాయి. మా దర్శకుడికి పురాణాల మీద మంచి పట్టు ఉంది. యూనిక్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ సినిమా మీద మంచి నమ్మకం ఉంది' అన్నారు. 'ప్రతి ఒక్కరి ఇంటి ముందు దిష్టి బొమ్మ ఉంటుంది. ఆ బొమ్మ గురించే ఈ కథ. సినిమాలో చాలా ట్విస్టులు ఉన్నాయి' అన్నారు దర్శకుడు పురుషోత్తం. మంచి థ్రిల్లర్ ఇదనీ, సినిమా బాగా వచ్చిందని నిర్మాతలు చెప్పారు.

## నిజంగానే అభినవ్‌లో చాలా షేడ్స్ ఉన్నాయి



అభినవ్ గోమఠం హీరోగా, వైశాలి రాజ్ హీరోయిన్‌గా నటించిన 'మస్తు షేడ్స్ ఉన్నాయిరా' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. తిరుపతిరావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంతి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల హీరో నిఖిల్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'అభినవ్‌లో నిజంగానే చాలా షేడ్స్ ఉన్నాయి. సెట్‌లో అందర్నీ నవ్విస్తుంటాడు. నాకు మంచి స్నేహితుడు. ఈ సినిమా బాగుందని కొందరు చెప్పడంతో ఈ ఫంక్షన్‌కు వచ్చాను. అభినవ్‌కు ఈ సినిమా హీరోగా మంచి బిగినింగ్ అందించాలని కోరుకుంటున్నాను' అన్నారు. 'నా లైఫ్‌లో ఇది స్పెషల్ మూమెంట్. హీరోగా నాకు చాలా ఆఫర్లు వచ్చాయి కానీ నాకు తగ్గ కథ కోసం ఎదురు చూసి ఈ సినిమా ఎంచుకున్నాను. నిఖిల్ నాకు మంచి స్నేహితుడు. ఆయన ఈ సినిమా ట్రైలర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఈ చిత్రం తప్పకుండా అందరికీ నచ్చుతుందనే అనుకుంటున్నాను' అన్నారు అభినవ్. చిన్న సినిమా అయినా కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు కనుక మా సినిమా విజయంపై నమ్మకం ఉందని దర్శకుడు తిరుపతిరావు చెప్పారు. అందరూ ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం ఇదని నిర్మాత కాసుల భవాని చెప్పారు.

## రెండున్నరేళ్ల కష్టం



సందీప్‌కిషన్ నటిస్తున్న మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరు పేరు భైరవకోన'. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి విఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. రాజేశ్ దండా నిర్మాత. అనిల్ సుంకర సమర్పకుడు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో సందీప్ మాట్లాడుతూ 'రెండున్నర ఏళ్లు ఈ సినిమా కోసం దర్శకుడు ఆనంద్ ఎంతో కష్టపడ్డారు.సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి కమర్షియల్ సినిమా ఇది. సినిమా మీద చాలా నమ్మకంగా ఉన్నాం' అన్నారు. 'చాలా మంచి సినిమా ఇది. దీంతో సందీప్ నెక్స్ట్ లెవెల్‌కు వెళతాడు. సినిమా అద్భుతంగా వచ్చింది' అన్నారు అనిల్ సుంకర. దర్శకుడు ఆనంద్ మాట్లాడుతూ 'అద్భుతమైన జర్నీ ఈ సినిమా. ఇందులో ప్రతి మూమెంట్ మాకు ఓ కొత్త అనుభవం. ఆడియన్స్ తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అన్నారు.

దిక్సూచి
వరంగల్ ● సోమవారం 12 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

# ఐరాసలో సంస్కరణలు
# అవరోధాలు-పరిష్కారాలు





త్రాసు ముల్లు ఎప్పుడూ సమతౌల్యతను సూచిస్తూ మధ్యస్థంగా ఉండి తీరాలి. అప్పుడే ఆ త్రాసు బేరీజు వేసేందుకు అనుకూలమైనదిగా పరిగణనలో ఉంటుంది. అలా కాకుండా ఎటువైపు ఒరిగినా తూనిక చేసే అర్హత కోల్పోతుంది. నిజానికి ఎంచి చూడాల్సిన ఏ క్రతువుకైనా ఉండాల్సిన ప్రాథమిక లక్షణం ఇది. స్థిరత్వం, శాంతి, సహకారం, ప్రాథమిక సూత్రాలుగా ప్రపంచానికి పెద్ద దిక్కుగా ఏర్పడిన ఐక్యరాజ్య సమితి, కొన్ని దేశాలవైపు మొగ్గిన నేపథ్యంలో దాని విశ్వసనీయతపై సర్వత్రా నిరసనలు వినిపిస్తున్నాయి. అదే సంస్కరణల అవసరాన్ని తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఐక్యరాజ్య సమితిలో అత్యంత ప్రధానమైనదిగా భావించే భద్రతా మండలి విస్తరణ, ప్రజాస్వామికీకరణపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన కోఫీ అన్నన్ సైతం 'భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడమో లేదా దాని ప్రాబల్యాన్ని కోల్పోయే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమో తేల్చుకోవాల్సిందే'అని హెచ్చరించారు. ఇటీవల భారత్ వేదికగా జరిగిన జీ-20 సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదించిన ఢిల్లీ డిక్లరేషన్‌లో సైతం 'ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు' అంశాన్ని చేర్చారు. ఇటీవల ఎలాన్ మస్క్ సైతం 'అత్యధిక జనాభాగల దేశమైన భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం అసంబద్ధం' అని, ఐక్యరాజ్య సమితి అంగాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని ట్వీట్ చేశారు. పరిమితికి మించిన అధికారాన్ని అనుభవిస్తున్న దేశాలు దానిని వదులుకోవడానికి సుముఖంగా లేకపోవడం వల్లే ఈ తంటా అని కూడా ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మరోసారి తాజాగా భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం అనే అంశం తెరపైకి వచ్చింది. దరిమిలా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, దాని ప్రాముఖ్యం, విస్తరణ, ప్రజాస్వామ్యీకరణల అవసరం, అవరోధాలు, ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

**ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి**

- ఐక్యరాజ్య సమితికి చెందిన ఆరు ముఖ్య అంగాల్లో భద్రతా మండలి ఒకటి. అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణ దాని బాధ్యత. ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో కొత్త సభ్య దేశాల ప్రవేశానికి సిఫార్సు చేయడం, ఐక్యరాజ్య సమితి చార్టర్‌కు చేసే మార్పులకు ఆమోదం తెలపడం దీని అధికారాలు. అంతేకాకుండా అంతర్జాతీయ శాంతిని కాపాడేందుకు ప్రపంచంలో ఎక్కడికైనా భద్రతా దళాలను పంపడం, మిలటరీ చర్యలు చేపట్టడం, పరిస్థితులను అనుసరించి దేశాలపై వివిధ ఆంక్షలు( శాంక్షన్స్) విధించడమనే కీలకాధికారాలు కూడా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి అంగాలన్నింటిలో ఒక్క భద్రతా మండలికి మాత్రమే- సభ్య దేశాలకు నిర్బంధంగా పాటించాల్సిన ఆజ్ఞలు జారీ చేసే అధికారం ఉంది. మిగతా అయిదు అంగాలకు కేవలం సభ్య దేశాలకు సిఫార్సులు చేసే అధికారమే ఉంది. భద్రతా మండలికి మాత్రమేగల నిర్ణయాలు అమలు చేసే శక్తి దానిని, దానిలోని శాశ్వత సభ్యులను అత్యంత శక్తిమంతంగా మార్చింది.

**భద్రతా మండలి కూర్పు**

- భద్రతా మండలిలో వీటో అధికారం ఉన్న అయిదు శాశ్వత సభ్య దేశాలు, రెండేళ్ల కాలానికి ఎన్నుకొన్న వీటో అధికారం లేని మరో పది దేశాలు కలిపి మొత్తం 15 సభ్య దేశాలు ఉంటాయి. వీటిలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఐక్యరాజ్య సమితి చార్టర్ 1946 ప్రకారం శాశ్వత సభ్య దేశాలుగా గుర్తింపు పొందాయి. తాత్కాలిక సభ్య దేశాలకు గల పది స్థానాలకుగాను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ఏటా అయిదు దేశాల చొప్పున రెండేళ్ల కాలానికి ఎన్నుకుంటుంది. రిటైర్ అవుతున్న అయిదు తాత్కాలిక సభ్య దేశాలు వెంటనే ఎన్నిక అవడానికి వీలు లేదు. ఈ పది తాత్కాలిక సభ్య దేశ స్థానాలు ప్రాంతీయ ప్రాతిపదికన పంపిణీ అవుతాయి. ఆఫ్రికా, ఆసియా దేశాలకు 5; తూర్పు యురోపియన్ దేశాలకు 1; లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలకు 2; పశ్చిమ యురోపియన్ దేశాలకు 2 స్థానాలు ఉంటాయి.
- ఈ పది తాత్కాలిక స్థానాల్లో ఎటువంటి నామినేటెడ్ స్థానాలు ఉండవు. అన్ని స్థానాలకూ రహస్య బ్యాలెట్ పద్ధతిన సాధారణ సభలో ఎన్నికలు నిర్వహిస్తారు. 2/3వ వంతు మెజారిటీని సాధించిన దేశాలకు రెండేళ్ల పాటు భద్రతా మండలి తాత్కాలిక సభ్యత్వం లభిస్తుంది. భద్రతా మండలి సభ్య దేశాల మధ్య దాని అధ్యక్ష పదవి నెలనెలా బదిలీ అవుతూ ఉంటుంది.
- శాశ్వత సభ్య దేశాలైన పీ-5 దేశాల్లో ప్రతీ ఒక్క దేశానికి వీటో అధికారం ఉంటుంది. ఈ అధికారంతో వారు భద్రతా మండలిలో ఏ తీర్మానానికి అయినా వ్యతిరేకంగా ఓటు వేసి దానిని అడ్డుకోవచ్చు. ఒక కొత్త దేశాన్ని సభ్య దేశంగా చేర్చుకోవడం లేదా ఐరాస జనరల్ సెక్రటరీగా ఎవరి ఎన్నికనైనా అడ్డుకోవడానికి సైతం చేయవచ్చు. అయిదు శాశ్వత సభ్య దేశాల్లో ఏ ఒక్కటైయినా వ్యతిరేకంగా ఓటు వేసి భద్రతా మండలి ఏ తీర్మానాన్నైనా అడ్డుకోవచ్చు. భద్రతా మండలి ఏ నిర్ణయమైనా అయిదు శాశ్వత సభ్య దేశాల సర్వామోదంతోనే జరగాలి. ఏ ఒక్కరు వ్యతిరేకించినా వీటో అధికారం ఉపయోగించినా అది చెల్లదు.
- శాశ్వత సభ్య దేశాలకు ఉన్న ఈ వీటో అధికారాన్ని వినియోగించి అసంబద్ధ నిర్ణయాలను అడ్డుకోవడానికి బదులు ఇటీవల ఆ దేశాలు తమ స్వప్రయోజనాల కోసం రాజకీయ వ్యూహాల కోసం వినియోగిస్తున్నాయి. దీనితో ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి ఏర్పాటుకు గల మూల ఉద్దేశాలకు గండి పడుతోంది. అంతేకాక భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాల దురాగతాలకు వ్యతిరేకంగా భద్రతా మండలి చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోతోంది.
- అమెరికా ఒకప్పుడు ఇరాక్‌పై దండెత్తినపుడు, రష్యా ప్రస్తుతం ఉక్రెయినపై దాడి చేస్తున్న సందర్భంలోనూ భద్రతా మండలి క్రియాశూన్యంగా మిగిలిపోతోంది. అంతేకాక శాశ్వత సభ్య దేశాల వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాటి మిత్ర దేశాలను వెనకేసుకు వచ్చే దుశ్చర్యలను నిలువరించలేని దుస్థితికి భద్రతా మండలి చేరుకుంది. ఉదాహరణకు ఇజ్రాయెల్‌కు అమెరికా కొమ్ముకాయడం; చైనా, పాకిస్థాన్‌ల ఉగ్రవాదాన్ని వెనకేసుకు రావడం వంటి ఉదంతాలను చెప్పుకోవచ్చు. అంతేకాక భద్రతా దళాల ప్రయోగం, ఉపసంహరణ, ఆంక్షల విధింపు వంటి చర్యలను ప్రపంచంలోని అశాంతిని నిర్మూలించేందుకు కాక పీ-5 దేశాలు తమ స్వప్రయోజనాలు, చమురు నిల్వలు కొల్లగొట్టేందుకు ఉపయోగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వీటో అధికారంలో సంస్కరణలకు, భద్రతా మండలిలో ప్రజాస్వామ్యీకరణకు, జనాభా ప్రాతినిధ్య సమతౌల్యతకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు పెరుగుతున్నాయి.

**జీ-4 కూటమీ**

- భారత్ సహా మరో మూడు దేశాలు(జపాన్, జర్మనీ, బ్రెజిల్) కలిసి జీ-4 కూటమిగా ఏర్పడి పరస్పర మద్దతుతో భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి చేస్తున్నాయి. వీరు తమతోపాటు ఆఫ్రికా వంటి ఇతర ప్రాంతాలకు కూడా ప్రాతినిధ్యం దక్కాలని వాదిస్తున్నాయి.
- ఈ జీ-4 దేశాల ఆర్థిక, రాజకీయ, సైనిక బలం కొన్ని దశాబ్దాలుగా విస్తరించడం; పీ-5 దేశాలతో సరితూగగల స్థాయిని సాధించడం వంటి అంశాల నేపథ్యంలో జీ-4 దేశాలు తమ ప్రాతినిధ్యానికి మరింత పట్టుపడుతున్నాయి.
- శాశ్వత సభ్య దేశ స్థానాలను అయిదు నుంచి పదకొండుకు, తాత్కాలిక సభ్య దేశాల స్థానాలను పది నుంచి పద్నాలుగుకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

**కాఫీ క్లబ్**

జీ4 ప్రయత్నాలను నిర్వీర్యం చేయడానికి ఆయా దేశాలతో ఆర్థికపరమైన పోటీ, రాజకీయపర శతృత్వం గల దేశాలు 'కాఫీ క్లబ్'గా ఏర్పడి జీ4 దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని అడ్డుకొనే ధ్యేయంతో పనిచేస్తున్నాయి. ఈ కాఫీ క్లబ్‌లో పాకిస్థాన్, దక్షిణకొరియా, ఇటలీ, అర్జెంటీనా సభ్యులుగా ఉన్నాయి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)

---

బయాలజీ

# మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ




**అన్ని జీవులలో ప్రత్యుత్పత్తి అనేది ప్రధాన ధర్మాలలో ఒకటి. ప్రత్యుత్పత్తి విధానంలో జీవులు పాత జీవుల స్థానంలో వాటిని పోలిన లేదా కొద్ది తేడాలతో ఉన్న కొత్త జీవులను ఉత్పత్తి చేస్తాయి. ఒక ప్రజాతి కొనసాగడానికి, జన్యు పదార్థాన్ని పునఃఉత్తేజనం చేయడానికి ప్రత్యుత్పత్తి విధానం అత్యవసరం. వివిధ జంతువులలో వివిధ రకాల ప్రత్యుత్పత్తి జరుగుతుంది.**

ప్రత్యుత్పత్తిలో హార్మోన్లు ముఖ్య పాత్రపోషిస్తాయి. ఉదాహరణకు పురుష, స్త్రీ బీజకోశాల హార్మోన్లు- ప్రాథమిక, ద్వితీయ లైంగిక లక్షణాలు, బీజకోశాల పరిపక్వత, లైంగిక చక్రాల లయబద్ధత, పిండం విడుదల క్షీరోత్పత్తి మొదలైన వాటిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

జీవులు రెండు రకాలుగా ప్రత్యుత్పత్తి చేసుకుంటాయి. అవి..అలైంగిక ప్రత్యుత్పత్తి, లైంగిక ప్రత్యుత్పత్తి. అలైంగిక ప్రత్యుత్పత్తి జనక జీవిలో లేదా ఒకే జీవిలోనే జరుగుతుంది. ఈ విధానంలో ప్రత్యేకంగా పురుష, స్త్రీ బీజకోశాలు ఉండవు. విచ్ఛిత్తి, కోరకీభవనం, సిద్ధబీజాలు ఏర్పడటం, ముక్కలగుట, పునరుత్పత్తి, క్లోనింగ్, అనుషేకజననము అనే పద్ధతుల ద్వారా జరుగుతుంది. అలైంగిక విధానంలో ప్రతి జీవి ప్రౌఢజీవిగానే జన్యుపరంగా తమను పోలిన జీవులను తయారు చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. లైంగిక ప్రత్యుత్పత్తిలో స్త్రీ, పురుష జీవులు ఏకస్థితిక బీజకణాలను(అండాలు, శుక్ర కణాలు) ఉత్పత్తి చేసి, ఫలదీకరణం చెంది, ద్వయస్థితిక పిల్ల జీవిని తయారు చేస్తుంది.

> **పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.**

**పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ**

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.

**ముష్కాలు:** ఒక జత అండాకార ముష్కాలు, ఉదర కుహరం బయట ముష్క గోణిలో వేలాడుతూ ఉంటాయి. ముష్కగోణులు వెనుక వేలాడుతూ ఉన్న సంచి వంటి నిర్మాణం. ఇది ముష్కాలకు రక్షణ ఇస్తూ, శుక్ర కణోత్పత్తికి కావలసిన ఉష్ణోగ్రత(శరీర ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 2.5 డిగ్రీల సెల్సియస్ తక్కువ) ఉండేటట్లు చేస్తుంది. పరిసరాల ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ముష్కగోణిలోని క్రెమాస్టర్ కండరం సంకోచం వల్ల ముష్కగోణి వెచ్చగా ఉన్న దేహానికి దగ్గరగా అవుతుంది. డార్టోస్ కండర సంకోచం వల్ల ముష్కగోణి ముకుళించుకుంటుంది. ఉష్ణోగ్రత సాధారణంగా ఉన్నప్పుడు పై రెండు కండరాలు విరామస్థితిలో ఉంటాయి. అందువల్ల ముష్కగోణి వెచ్చటి దేహానికి దూరంగా వేలాడుతూ ఉంటుంది. కొన్ని అసాధారణ సందర్భాల్లో ముష్కాలు శుక్ర కణాలను, టెస్టోస్టిరాన్ అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ ముష్కాలలో అధిక సంఖ్యలో మిలియన్ల కొద్దీ శుక్ర కణాలు ఉత్పత్తి అవుతాయి. సంపర్క సమయంలో 200-300 మిలియన్ల శుక్రకణాలను పురుషుడు స్ఖలిస్తాడు. ప్రతి ముష్కంలో చాలా లంబికలు ఉంటాయి. ప్రతి లంబికలో ఎక్కువ సంఖ్యలో మెలి తిరిగిన చిన్న చిన్న నాళికలు ఉంటాయి. వీటినే శుక్రోత్పాదక నాళికలు అంటారు. ఈ నాళికలు 80 సెం.మీ. పొడవును కలిగి శుక్రనాళికలోకి తెరచుకొని ఎపిడిడిమిస్‌ను ఏర్పరస్తుంది. ఎపిడిడిమిస్ అనేది చుట్టలు చుట్టలుగా ఉండే నాళం వంటి నిర్మాణం. ఇది శుక్ర కణాలను తాత్కాలికంగా నిల్వ చేస్తుంది, శుక్ర కణాలు పరిపక్వతకు రావడానికి కావలసిన సమయాన్ని కలుగజేస్తుంది.

**శుక్ర వాహికలు:** ఎపిడిడిమిస్ నుంచి శుక్రవాహిక బయలు దేరుతుంది. ఇది శుక్ర కణాలను ఎపిడిడిమిస్ నుంచి సంగ్రహిస్తుంది. శుక్రవాహిక శుక్రాశయం నుంచి వచ్చే వాహికతో కలిసి స్ఖలన నాళాన్ని ఏర్పరుస్తుంది. శుక్రాశయం శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. రెండు వైపుల నుంచి వచ్చే స్ఖలన నాళాలు పౌరుష గ్రంథి మధ్య భాగంలో కలిసి ప్రసేకంలోకి తెరచుకుంటాయి.

**బాహ్య జననాంగాలు:** పురుషులలో ప్రసేకం అనేది మూత్ర జననేంద్రియ వాహికలు కలిసి ఏర్పడిన అంత్యనాళం. ప్రసేకము మూత్రాశయం నుంచి ప్రారంభమై మేహనం ద్వారా వ్యాపించి యూరెత్రమీటస్ అనే రంధ్రం ద్వారా బయటకు తెరచుకుంటుంది. మూత్రం, స్ఖలించిన శుక్రం రెండూ కూడా ప్రసేకం ద్వారా ప్రయాణించి బయటకు వస్తాయి. పురుషులలో మేహనం, ముష్కగోణులు అనే బాహ్యజననాంగాలు ఉంటాయి. మేహనం అనేది మూత్రనాళంగానే కాకుండా, స్త్రీ జీవి యోనిలో శుక్రద్రవాన్ని విడుదల చేసే ప్రవేశాంగముగా పనిచేస్తుంది. మేహనంలోని పృష్ఠభాగంలో కార్పోరా కావెర్నోసా, ఉదరభాగంలో కార్పస్ స్పాంజియోజమ్ అనే స్తంభాకార కణజాలల వలన మేహనం నిటారుగా, కడ్డీలాగా మారి శుక్రమును విడుదల చేయడంలో సహాయపడుతుంది. మేహనం చివర ఉబ్బి బల్బుగా ఉన్న భాగాన్ని గ్లాన్స్ మేహనం అంటారు. గ్లాన్స్ మేహనాన్ని ఆవరించి వదులుగా ఉన్న చర్మాన్ని ప్రెప్యూస్ అంటారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

**అనుబంధ గ్రంథులు:** పురుష అనుబంధ గ్రంథులు వరుసగా...ఒక జత శుక్రాశయాలు, ఒక పౌరుషగ్రంథి, ఒక జత కౌపర్ గ్రంథులు

**శుక్రాశయాలు:** ఇవి ఒక జత మూత్రాశయం కింది భాగంలో ఉంటాయి. ఇందులో ఉండే శుక్ర కోశాలు శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. శుక్ర ద్రవం చిక్కగా జిగటగా ఉంటుంది. 65 శాతం క్షారయుతంగా ఉంటుంది. శుక్రద్రవం క్షారం కావడం వలన యోనిలో ఉండే ఆమ్లత్వాన్ని తటస్థీకరిస్తుంది. శుక్రకణాలకు పోషక పదార్థాలను అందించడంలో, శుక్ర కణాల కదలికలకు శుక్రద్రవం ఉపయోగపడుతుంది. శుక్రద్రవంలో ఫ్రక్టోజ్, ప్రోటీన్లు, సిట్రిక్ ఆమ్లం, అకర్బన పదార్థాల పాస్ఫేట్, పొటాషియం, ప్రోస్టాగ్లాండిన్స్ విటమిన్-సి వంటి పదార్థాలు ఉంటాయి.

**పౌరుష గ్రంథి:** మూత్రాశయం కింద పౌరుష గ్రంథి ఉంటుంది. ఇది ప్రసేకము మొదటి భాగాన్ని ఆవరించి దాని స్రావాలను అనేక వాహికల ద్వారా ప్రసేకంలోకి పంపుతుంది. దీని స్రావం స్వల్ప ఆమ్ల స్థితిలో ఉంటుంది. శుక్ర కణాలను ఉత్తేజపరచడంలో, పోషణ అందించడంలో సహాయపడుతుంది.

**కౌపర్ గ్రంథులు:** వీటిని బల్బోయురెత్రల్ గ్రంథులుగా కూడా పేర్కొంటారు. ఇవి ఒక జత మేహనం మొదలయ్యే చోట, పౌరుష గ్రంథికి కింద, ప్రసేకానికి ఇరువైపులా ఉంటాయి. వీటి స్రావం తేటగా, జారేట్లుగా, క్షారయుతంగా ఉండి సంపర్కంలో రాపిడిని తగ్గించి శుక్రాన్ని ప్రసేకం ప్రసేకం ద్వారా సులభంగా జారేటట్లుగా చేస్తుంది. ఇవి బఠాణి గింజ పరిమాణంలో ఉంటాయి.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

---

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

# భారత రాజ్యాంగం ముఖ్య చట్టాలు

**మంత్రిత్రయ రాయబారం- 1946**

దీనిలో పెథిక్ లారెన్స్, స్టాఫర్డ్ క్రిప్స్, ఏ.వి.అలెగ్జాండర్ సభ్యులుగా ఉన్నారు. కమిటీ మూడు ప్రతిపాదనలు చేసింది అవి...

1. రాజ్యాంగసభను ఏర్పాటు చేసుకోవాలి.
2. స్వదేశీ సంస్థానాలను భారత్‌లో భాగంగానే రాజ్యాంగాన్ని రూపొందించాలి.
3. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేవిధంగా తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు.

- పాకిస్థాన్ ఏర్పాటును క్యాబినెట్ మిషన్ తిరస్కరించింది.

**తాత్కాలిక ప్రభుత్వం-1946**

తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. ఆమేరకు 1946 సెప్టెంబరు 2న కాంగ్రెస్-ముస్లింలీగ్ కలిసి తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

1. జవహర్‌లాల్ నెహ్రూ - విదేశీ వ్యవహారాలు, కామన్ వెల్త్ సంబంధాలు
2. సర్దార్ వల్లభాయ్ పటేల్ - సమాచార ప్రసారాలు, రాష్ట్ర వ్యవహారాలు
3. రాజేంద్రప్రసాద్ - వ్యవసాయం, ఆహారం.
4. జాన్ మత్తాయ్ - పరిశ్రమలు, పౌర సరఫరాలు
5. సర్దార్ బల్‌దేవ్‌సింగ్ - రక్షణ శాఖ
6. బాబూ జగజ్జీవన్‌రామ్ - కార్మికశాఖ
7. సిహెచ్.బాబా - ప్రజా పనులు, గనులు, విద్యుత్
8. లియాఖత్ అలీఖాన్ - ఆర్థికశాఖ
9. అసఫ్ అలీ - రైల్వేలు, ఉపరితల రవాణ
10. సి.రాజగోపాలచారి - విద్య, కళలు
11. జోగిందర్‌నాథ్ మండల్ - న్యాయశాఖ
12. గజ్నాఫర్ అలీఖాన్ - ఆరోగ్య శాఖ
13. అబ్దుర్ రాబ్ నిస్తార్ - పోస్ట్స్, ఎయిర్
14. ఐ.ఐ.చుంద్రిగర్ - కామర్స్



- పైన పేర్కొన్న మంత్రులందరూ వైస్రాయ్ కార్యనిర్వహణ మండలిలో సభ్యులు.
- ఈ మంత్రిమండలికి అధ్యక్షుడు - వైస్రాయ్, ఉపాధ్యక్షుడు - జవహర్‌లాల్ నెహ్రూ.

**గమనిక:** రాజ్యాంగసభ ఏర్పాటు గురించి ప్రతిపాదించిన మొదటి కమిటీ - క్రిప్స్ కమిటీ

**భారత స్వాతంత్ర్య చట్టం**

- దేశం భారత్ - పాక్‌గా విడిపోయింది.
- భారత్‌లో వైస్రాయ్ పదవి, భారత రాజ్య కార్యదర్శి పదవులు అంతమవుతాయి.
- స్వదేశీ సంస్థానాలు తమ ఇష్టానుసారం భారత్‌లో గానీ, పాకిస్థాన్‌లో గానీ విలీనం కావచ్చు.
- రాజకీయ పార్టీల ప్రాతినిధ్యంతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు.
- రాజ్యాంగ పరిషత్‌లో మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలి.
- ఆగస్టు 15 తరవాత బ్రిటిష్ చట్టాలు భారత్‌లో చెల్లవు, స్వదేశీ సంస్థానాలపై కూడా బ్రిటన్ ఆధిపత్యం ఉండదు.
- భారత్, పాక్ తమ ఇష్టానుసారం కామన్‌వెల్త్‌లో కొనసాగవచ్చు.
- రెండు దేశాల సమ్మతి మేరకు బ్రిటన్ పార్లమెంటు గవర్నర్ జనరల్స్‌ను నియమిస్తుంది.
- రాజ్యాంగ పరిషత్‌లు తాత్కాలిక పార్లమెంటుగా పనిచేస్తాయి.
- భారత్, పాక్ మధ్య సరిహద్దులను నిర్ణయించడానికి రాడ్ క్లిఫ్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు.
- కొత్త రాజ్యాంగం అమలులోకి వచ్చేంత వరకు 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారమే పరిపాలన నడుస్తుంది.

**1. హైదరాబాద్:** భారత సైన్యం 1948 సెప్టెంబరు 13 - 17 వరకు హైదరాబాద్‌పై పోలీసు చర్యను నిర్వహించారు.

సెప్టెంబరు 17న మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత సేనలకు లొంగిపోయాడు. ఈ చర్యను ఆపరేషన్ పోలో అంటారు. దీనికి జె.ఎన్. చౌదరి నాయకత్వం వహించారు.

**2. జునాగఢ్:** ఇది భౌగోళికంగా గుజరాత్‌లో ఉంది. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఇది 1948లో భారత యూనియన్‌లో విలీనమైంది.

**3. జమ్మూకాశ్మీర్:** 1947 అక్టోబరు 26న విలీన ఒప్పందం ద్వారా భారత యూనియన్‌లో విలీనమైంది.

- 1947 భారత స్వాతంత్ర్య చట్టం మన దేశంలో బ్రిటిష్‌వారు చేసిన చివరిచట్టం. ఈ చట్టాన్ని యుద్ధం జరగకుండా చేసుకున్న శాంతి ఒప్పందంగా పేర్కొంటారు.
- బ్రిటిష్ పార్లమెంటు రూపొందించిన చట్టాలన్నింటిలో ఇది ఉదాత్తమైంది, ఉన్నతమైంది అని బ్రిటన్ ప్రధాని క్లెమెంటో అట్లీ ప్రశంసించారు.

**అట్లీ ప్రకటన- 1947**

బ్రిటన్ ప్రధాని క్లెమెంటో అట్లీ ఫిబ్రవరి 20న పార్లమెంటులో ప్రసంగిస్తూ 1948 జూన్ 30 నాటికి భారత్‌లో బ్రిటిష్ ప్రభుత్వం అంతమవుతుందని ప్రకటించారు. అట్లీ ప్రకటనను బ్రిటిష్‌వారు జారీచేసిన వాటిలో అత్యున్నతమైందిగా గాంధీ అభిప్రాయపడ్డారు.

ఈ ప్రకటనలో పాకిస్థాన్ ఏర్పాటు అంశం లేదని ముస్లింలీగ్ తీవ్ర నిరసన వ్యక్తపరిచింది భారతదేశ విభజన అంశాన్ని అట్లీ మౌంట్ బాటన్‌కు అప్పగించారు.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

---

# లెటర్ సిరీస్



**పార్ట్-2**

1. a - cb - dec - ef - d - fg - i
   (ఎ) bcdgeh (బి) bcdegh
   (సి) bdcegh (డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ:** ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

a b c / b c d e / c d e f g / d e f g h i

మొదటి సమూహంలో మూడు అక్షరాలు రెండో సమూహంలో నాలుగు అక్షరాలు మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహంలో మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు ఉంటూ అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం వరుసక్రమంలో ఉన్నాయి. మూడో సమూహంలో రెండో సమూహంలోని చివరి మూడు అక్షరాలు ఉంటూ అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం వరుస క్రమంలో ఉన్నాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bcdgeh

2. P - P - Q - P - PQQ - P - PPQ - Q -
   (ఎ) PPPQQPQQ (బి) PPPQQQQQ
   (సి) QPQPQPQQ (డి) ఏదీకాదు

**సమాధానం:** (సి)

**వివరణ:** ఆప్షన్(సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PQ / PPQQ / PPPQQQ / PPPPQQQQ

మొదటి సమూహంలో ఒక PQ రెండో సమూహంలో రెండు Pలు, రెండు Pలు మూడో సమూహంలో మూడు Qలు, మూడు Pలు నాలుగో సమూహంలో నాలుగు Pలు నాలుగు Qలు ఉన్నాయి.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QPQPQPQQ

3. L - LMM - N - - LL -
   (ఎ) LMNNL (బి) LMNLN
   (సి) LLMNN (డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ:** ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

L L L / M M M / N N N / L L L

ప్రతి సమూహంలోను ఒక అక్షరమే మూడుసార్లు ఉంది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు LMNNL

4. a - b - ad - c - db - a - bc
   (ఎ) dcbacd (బి) abcdcd (సి) abccdd (డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ:** ఆప్షన్(ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీల్లో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

a d b c / a d b c / a d b c / a d b c

ఈ సిరీస్‌లో adbc అను సమూహం నాలుగుసార్లు రిపీట్ అయింది. ∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు dcbacd

5. a - c - cb - ab - ca - c - ab - a -
   (ఎ) aabbbccc (బి) abbbccbc
   (సి) bacabbcc (డి) ఏదీకాదు

**సమాధానం:** (సి)

**వివరణ :** ఆప్షన్(సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

abcac / bcaba / cabcb / abcac

ప్రతి సమూహంలోని మొదటి మూడు అక్షరాలు అయిన abc / bca / cab / abc ఈ కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలోని మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదే విధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా, మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలు నాలుగో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మూడో సమూహంలో మొదటి అక్షరం నాలుగో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అంతేకాక ప్రతి సమూహంలోను ఒకటో, మూడో అక్షరాలే నాలుగు, అయిదో అక్షరాలుగా కూడ ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bacabbcc

**పార్ట్-3**

1. d - cba - a - badac - a - a - ba
   (ఎ) abccdd (బి) abcdcd
   (సి) adcbdc (డి) ఏదీకాదు **సమాధానం:** (సి)

**వివరణ :** ఆప్షన్ (సి)లోని అక్షరాలను ప్రశ్నలో ఇచ్చిన ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

dacba / dacba / dacba / dacba

ఈ సిరీస్‌లో dacba అను ఐదు అక్షరాల సమూహం మూడుసార్లు రిపీట్ అయింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు adcbdc

2. P - RP - QRP - Q - RP - QQR -
   (ఎ) QPPQPR (బి) PPPQQR
   (సి) PQPQPR (డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ :** ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ప్రశ్నలో ఇచ్చిన ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PQR / PPQR / PPQQR / PPQQRR

మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహంలో మొదటి సమూహాల్లో అక్షరాలన్నీ ఉంటూ P స్థానంలో మరో 'P' అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలోని అక్షరాలన్నీ ఉంటూ 'Q'స్థానంలో మరో 'Q' అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలోని అక్షరాలన్నీ ఉంటూ 'R' స్థానంలో మరో 'R' అదనంగా చేరింది. ఈవిధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QPPQPR.

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

3. a - cd - ab - ccd - a - abb -
   (ఎ) aabbbd (బి) babdab
   (సి) ababbd (డి) ఏదీకాదు **సమాధానం:** (బి)

**వివరణ :** ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

abcd / aabb ccdd / aaabbb

మొదటి సమూహంలో ఒక abcd, రెండో సమూహంలో రెండు a లు, రెండు bలు, రెండు cలు, రెండు dలు, ఒక సమూహంగా ఏర్పడ్డాయి. మూడో సమూహంలో మూడు aలు, మూడు bల వరకు మాత్రమే ఈ సిరీస్ ఏర్పడింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు babdab

4. ada - b - bc - d - db - b -
   (ఎ) dcaacc (బి) acaccd
   (సి) aacccd (డి) ఏదీకాదు **సమాధానం:** (ఎ)

**వివరణ :** ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ప్రశ్నలో ఇచ్చిన ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

adad / bcbc / adad / bcbc

adad / bcbc అను అక్షరాల సమూహం రెండుసార్లు రిపీట్ అయింది. ∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు dcaacc.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ



# సుమిత్‌దే చెన్నై ఓపెన్

**టాప్-100 ర్యాంకింగ్స్‌లో చోటు**

**చెన్నై:** సూపర్‌ఫామ్‌తో దూసుకెళ్తున్న భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్ స్వదేశంలో జరిగిన టోర్నీలోనూ అదరగొట్టాడు. చెన్నై ఓపెన్‌లో సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో రెండోసీడ్ సుమిత్ 6-1, 6-4తో ఇటలీకి చెందిన టాప్‌సీడ్ లుకా నార్డిని చిత్తు చేశాడు. ఈ ప్రదర్శనతో 26 ఏళ్ల సుమిత్ కెరీర్‌లోనే తొలిసారిగా అత్యుత్తమ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. ప్రస్తుతం 121వ ర్యాంకులోనున్న సుమిత్.. సోమవారం ప్రకటించే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 98వ స్థానానికి చేరుకుంటాడు. సుమిత్‌కు ఇది కెరీర్‌లో 5వ ఏటీపీ చాలెంజర్ ట్రోఫీ కాగా.. సొంతదేశంలో 2వది.

## 'బెల్జియం' మీట్‌లో తేజస్విన్‌కు స్వర్ణం



**న్యూఢిల్లీ:** భారత హైజంప్ స్టార్ తేజస్విన్ శంకర్ అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. బెల్జియంలో జరిగిన గాలా ఎల్మోస్ అథ్లెటిక్స్ మీట్‌లో తేజస్విన్ చాంపియన్‌గా నిలిచాడు. తేజస్విన్ హైజంప్‌లో 2.23 మీటర్లు దూకి స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. గ్రీస్ అథ్లెట్ ఆంటోనియోస్ (2.20 మీ.) రెండో స్థానానికి పరిమితమయ్యాడు.

# నిఖత్.. రజతంతో సరి



**అమిత్, సచిన్‌కు స్వర్ణాలు**
**స్ట్రాంజా బాక్సింగ్**

**సోఫియా (బల్గేరియా):** స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా పోటీపడ్డ తెలంగాణ స్టార్ నిఖత్ జరీన్ ఈసారి రజత పతకంతో సరిపెట్టుకుంది. మహిళల 50 కిలోల ఫైనల్లో వరల్డ్ చాంపియన్ నిఖత్ 2-3తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 20 ఏళ్ల సబీనా బొబొకులోవా చేతిలో ఓటమి చవిచూసింది. ఇక, మహిళల 66 కిలోల కేటగిరీలో భారత బాక్సర్ అరుంధతి 1-4తో ప్రపంచ చాంపియన్ లియు యాంగ్ (చైనా) చేతిలో, పురుషుల 48 కేజీలలో బరుణ్ సింగ్-ఖోర్టీ (కిర్గిస్థాన్) చేతిలో, 67 కిలోలలో రజత్-దులత్ (కజకిస్థాన్) చేతిలో ఓడి రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత పంగల్ 51 కిలోల తుది పోరులో 5-0తో సన్‌ఝర్ (కజకిస్థాన్)ను చిత్తుచేసి స్వర్ణ పతకం సాధించాడు. 57 కిలోల అంతిమ సమరంలో సచిన్ సివాచ్ 5-0తోనే షఖ్‌జోద్ (ఉజ్బెకిస్థాన్)పై ఘన విజయంతో పసిడి పతకం కొల్లగొట్టాడు.

## రంజీ ప్లేట్ ఫైనల్లో హైదరాబాద్

**మళ్లీ చెలరేగిన తనయ్**
**నాగాలాండ్ ఇన్నింగ్స్ ఓటమి**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** లెఫ్టార్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ (6 వికెట్లు), తిలక్ వర్మ (3 వికెట్లు) స్పిన్ మాయాజాలానికి నాగాలాండ్ విలవిల్లాడింది. మరోరోజు ఆట మిగిలుండగానే హైదరాబాద్ ఇన్నింగ్స్ 68 రన్స్‌తో గెలిచి రంజీ ప్లేట్ ఫైనల్లోకి చేరింది. రెండు ఇన్నింగ్స్ (7/63, 6/81)ల్లో కలిపి తనయ్ 13 వికెట్లు తీయడం విశేషం. ఆట మూడో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 20/1తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించిన నాగాలాండ్ 188 రన్స్‌కే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 462/8 (డిక్లేర్), నాగాలాండ్ 206 రన్స్ చేశాయి.

## వాలీబాల్ విజేత రంగారెడ్డి



**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన విజయ్ దేవరకొండ (వీడీ) వాలీబాల్ ఓపెన్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. ఫైనల్లో ఆ జట్టు 15-7, 15-11తో నెల్లూరును ఓడించింది. వాలీబాల్ లీగ్‌లోని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు జెర్సీని ఆ టీమ్ సహ యజమాని, సినీ హీరో విజయ్ దేవరకొండ ఆవిష్కరించారు. విజయ్, బ్లాక్‌హాక్స్ యజమాని అభిషేక్ రెడ్డి విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.

## లీచ్‌కు గాయం.. సిరీస్‌కు దూరం

**లండన్:** భారత పర్యటనలో ఉన్న ఇంగ్లండ్‌కు గట్టిదెబ్బ తగిలింది. సీనియర్ స్పిన్నర్ జాక్ లీచ్.. గాయం కారణంగా టీమిండియాతో మిగిలిన మూడు టెస్టులకు దూరమయ్యాడు. హైదరాబాద్ టెస్టులో అతని ఎడమ మోకాలికి దెబ్బ తగిలింది. దీంతో విశాఖలో జరిగిన రెండో మ్యాచ్‌కు 32 ఏళ్ల లీచ్ అందుబాటులో లేడు. జాక్ స్థానాన్ని భర్తీ చేయకపోవడంతో.. మిగిలిన సిరీస్‌లో స్పిన్ త్రయం హార్ట్‌లీ, రెహాన్, బషీర్‌లపైనే ఇంగ్లండ్ ఆధారపడాల్సి ఉంటుంది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా రాజ్‌కోట్‌లో ఈనెల 15 నుంచి మూడో మ్యాచ్ జరగనుంది.

వరుసగా ఆరు విజయాలు.. భీకరఫామ్‌తో దూసుకెళుతున్న బ్యాటర్లు.. బంతితో బెదరగొడుతున్న బౌలర్లు.. ఇంకేముంది రికార్డు స్థాయిలో ఆరో టైటిల్‌ను ఎగరేసుకు పోదామనుకున్న మన కుర్రాళ్లకు ఆస్ట్రేలియా గట్టి షాకిచ్చింది. గతేడాది తమ సీనియర్ జట్టు మాదిరే అంతిమ సమరంలో భారత్‌ను చిత్తుచేసి అండర్-19 ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచింది.



కెప్టెన్ ఉదయ్ (8)

**1** అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో అత్యధిక స్కోరు (253) సాధించిన జట్టుగా ఆస్ట్రేలియా

**4** ఆస్ట్రేలియాకిది నాలుగో వరల్డ్‌కప్ టైటిల్




ఒత్తిడికి

# చిత్తయ్యారు

**ఫైనల్లో భారత్ ఓటమి**
**ఆస్ట్రేలియాదే అండర్-19 వరల్డ్‌కప్**

**బెనోని:** భారత సీనియర్ జట్టునే కాదు.. యువ ఆటగాళ్ల ఆశల్ని కూడా ఆస్ట్రేలియా చెల్లాచెదురు చేసింది. ఆదివారం జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్‌ను 79 పరుగుల తేడాతో ఓడించిన కంగారూలు విశ్వవిజేతలుగా నిలిచారు. టోర్నీలో ఒక్క ఓటమి లేకుండా ఫైనల్‌కు దూసుకువచ్చిన భారత్ కీలక పోరులో అన్ని విభాగాల్లోనూ విఫలమైంది. గతేడాది నవంబరులో రోహిత్ సేన సైతం వరుస విజయాలతో వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరి ఆసీస్ చేతిలోనే ఓడడం గమనార్హం. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 253 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ హర్జాస్ సింగ్ (55), హర్యాజ్ వీబ్జెన్ (48), ఒలివర్ పీక్ (46 నాటౌట్), హ్యారీ డిక్సన్ (42) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. పేసర్ రాజ్ లింబానికి మూడు, నమన్ తివారికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 43.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. ఆదర్శ్ (47), అభిషేక్ (42) పర్వాలేదనిపించారు. బీర్డ్‌మన్, మెక్‌మిలన్‌కు మూడేసి, వీడ్లెర్‌కు రెండు వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు బీర్డ్‌మన్‌కు దక్కగా.. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా దక్షిణాఫ్రికా పేసర్ మఫాకా నిలిచాడు.

**బ్యాటింగ్ వైఫల్యం**

భారీ ఛేదనలో భారత్ దారుణంగా తడబడింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. టెయిలెండర్ అభిషేక్ పోరాటం కాస్త ఆశలు రేపినా మరో ఎండ్‌లో వికెట్లు లేకపోవడం దెబ్బతీసింది. అయితే తొమ్మిదో వికెట్‌కు తివారి (14 నాటౌట్)తో కలిసి అందించిన 46 పరుగులే ఇన్నింగ్స్‌లో అత్యధికం. సూపర్ ఫామ్‌లో ఉన్న కీలక బ్యాటర్లు ఉదయ్, సచిన్ కనీసం పది పరుగులైనా సాధించలేకపోయారు. ఆరంభంలో ఓపెనర్ ఆదర్శ్ ఓపికను ప్రదర్శించాడు. మూడో ఓవర్‌లోనే సాగిన వికెట్ల పతనం ఎక్కడా ఆగలేదు. పేసర్ బీర్డ్‌మన్, స్పిన్నర్ మెక్‌మిలన్ సంయుక్తంగా భారత్ పతనాన్ని శాసించారు. రెండో వికెట్‌కు ఆదర్శ్, ముషీర్ 37 పరుగులు జత చేశారు. ఓ దశలో భారత్ 122/8 స్కోరుతో ఇబ్బందికరపరిస్థితిలో ఉండగా అభిషేక్, తివారి దాదాపు తొమ్మిది ఓవర్లపాటు ఆసీస్ బౌలర్లను ఎదుర్కొన్నారు. మరో 57 బంతుల్లో 86 రన్స్ కావాల్సిన వేళ అభిషేక్‌ను వీడ్లర్ అవుట్ చేయడంతో ఇక ఎలాంటి ఆశలు లేకపోయింది.

**స్కోరుబోర్డు**

**ఆస్ట్రేలియా:** డిక్సన్ (సి) అభిషేక్ (బి) తివారి 42; కొన్‌స్టాస్ (బి) లింబాని 0; వీబ్జెన్ (సి) ముషీర్ ఖాన్ (బి) తివారి 48; హర్జాస్ (ఎల్బీ) సౌమీ 55; రియాన్ (ఎల్బీ) లింబాని 20; పీక్ (నాటౌట్) 46; మెక్‌మిలన్ (సి అండ్ బి) ముషీర్ ఖాన్ 2; అండర్సన్ (ఎల్బీ) లింబాని 13; స్ట్రాకర్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు: 19; **మొత్తం: 50 ఓవర్లలో 253/7. వికెట్ల పతనం:** 1-16, 2-94, 3-99, 4-165, 5-181, 6-187, 7-221. **బౌలింగ్:** లింబాని 10-0-38-3; తివారి 9-0-63-2; సౌమీ 10-0-41-1; ముషీర్ 9-0-46-1; అభిషేక్ 10-0-37-0; మోలియా 2-0-17-0.

**భారత్:** ఆదర్శ్ (సి) హిక్స్ (బి) బీర్డ్‌మన్ 47; అర్షిన్ (సి) హిక్స్ (బి) వీడ్లెర్ 3; ముషీర్ (బి) బీర్డ్‌మన్ 22; ఉదయ్ (సి) వీబ్జెన్ (బి) బీర్డ్‌మన్ 8; సచిన్ దాస్ (సి) హిక్స్ (బి) మెక్‌మిలన్ 9; మోలియా (సి) వీడ్లెర్ (బి) అండర్సన్ 9; అవనీష్ (సి అండ్ బి) మెక్‌మిలన్ 0; అభిషేక్ (సి) వీబ్జెన్ (బి) వీడ్లెర్ 42; లింబాని (బి) మెక్‌మిలన్ 0; తివారి (నాటౌట్) 14; సౌమీ (సి) హిక్స్ (బి) స్ట్రాకర్ 2; ఎక్స్‌ట్రాలు:18; **మొత్తం: 43.5 ఓవర్లలో 174 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-3, 2-40, 3-55, 4-68, 5-90, 6-91, 7-115, 8-122, 9-168, 10-174. **బౌలింగ్:** వీడ్లెర్ 10-2-35-2; అండర్సన్ 9-0-42-1; స్ట్రాకర్ 7.5-1-32-1; బీర్డ్‌మన్ 7-2-15-3; మెక్‌మిలన్ 10-0-43-3.

## మ్యాక్స్‌వెల్ 'రికార్డు' సెంచరీ



**రెండో టీ20లో ఆసీస్ గెలుపు**
**విండీస్‌తో సిరీస్ కైవసం**

**అడిలైడ్:** ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ రికార్డు మెరుపు సెంచరీ (55 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 120 నాటౌట్)తో విరుచుకుపడడంతో వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా 34 పరుగులతో గెలుపొందింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో టీ20 ఉండగానే సొంతం చేసుకుంది. మొదట ఆసీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు చేసింది. స్వదేశంలో పొట్టి ఫార్మాట్‌లో ఆసీస్‌కిదే అత్యధిక స్కోరు. అలాగే మ్యాక్సీకిది టీ20లలో ఐదో శతకం కావడం విశేషం. ఈ నేపథ్యంలో పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు చేసిన రోహిత్ శర్మ రికార్డును అతడు సమం చేశాడు. ఇంకా..టీ20లలో నాలుగో నెంబర్, ఆ కింది స్థానంలో రెండో అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్‌గానూ గ్లెన్ రికార్డు అందుకున్నాడు. ఛేదనలో కెప్టెన్ పావెల్ (36 బంతుల్లో 63), రస్సెల్ (16 బంతుల్లో 37) పోరాడినా.. విండీస్ 20 ఓవర్లలో 207/9 స్కోరుకే పరిమితమైంది.

## ఉష, మేరీ..మౌనమేల?

**సాక్షి మాలిక్**

**తిరువనంతపురం:** లైంగిక వేధింపుల విషయంలో దిగ్గజ అథ్లెట్లు పీటీ ఉష, మేరీ కోమ్ మహిళా రెజ్లర్ల ఆందోళనకు అండగా నిలవలేదని ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ విమర్శించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ వినేష్ ఫొగట్, బజ్‌రంగ్ పూనియా, మాలిక్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం మేరీ నేతృత్వంలో విచారణ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. 'విచారణ సమయంలో రెజ్లర్ల బాధలను విన్న మేరీ.. మాకు తన మద్దతు ఉంటుందని తెలిపింది. ఐవోఏ అధ్యక్షురాలు ఉష కూడా బాధితుల పక్షానే నిలుస్తానని చెప్పింది. కానీ, ఆ ఇద్దరూ ఇప్పుడు నోరు మెదపడం లేద'ని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సాక్షి వాపోయింది.

# బిజినెస్

## 14 % తగ్గిన ఓఎన్‌జీసీ లాభం

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికరలాభం 14 శాతం క్షీణించి రూ.9,536 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.11,045 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో గ్యాస్, చమురు ధరలు పడిపోవటం పనితీరును దెబ్బతీసిందని పేర్కొంది. కాగా ఈ కాలంలో మొత్తం ఆదాయం కూడా 10 శాతం క్షీణించి రూ.34,789 కోట్లకు చేరింది. కాగా ఒక్కో షేరుకు 80 శాతం (రూ.4) రెండో మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ఆమోదించింది. డివిడెండ్ చెల్లింపులకు గాను కంపెనీ రూ.5,032 కోట్లు కేటాయించింది. గత ఏడాది నవంబరులో ఒక్కో షేరుకు రూ.5.75 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను కంపెనీ నికర లాభం 24 శాతం క్షీణించి రూ.29,767 కోట్లుగా నమోదైంది.

## పబ్లిక్ ఇష్యూకు అకుమ్స్ డ్రగ్స్

**న్యూఢిల్లీ:** అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా కొత్తగా రూ.680 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను జారీ చేయనుండగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు 1.86 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు సంజీవ్ జైన్, సందీప్ జైన్, రూబీ క్యూసీ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ పీటీఈ లిమిటెడ్ తమ వాటాలను విక్రయించనున్నట్లు సెబీకి సమర్పించిన డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది. కాగా ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా కంపెనీ రూ.136 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను రుణాల చెల్లింపుతో పాటు మూలధన అవసరాల నిమిత్తం వినియోగించనుంది.

**గోల్డ్ ప్లస్ గ్లాస్ ఇండస్ట్రీ కూడా..:** ఫ్లోట్ గ్లాస్ తయారీదారు గోల్డ్ ప్లస్ గ్లాస్ ఇండస్ట్రీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూ ద్వారా కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు 1.56 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

# పేటీఎంలో చైనా పెట్టుబడులు!

**పరిశీలించనున్న ప్రభుత్వం**

**న్యూఢిల్లీ:** వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఓసీఎల్) అనుబంధ సంస్థ అయిన పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ లిమిటెడ్‌లో (పీపీఎస్ఎల్) చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోంది. పేమెంట్ అగ్రిగేటర్లు, పేమెంట్ గేట్‌వేల నియంత్రణ మార్గదర్శకాలకు అనుగుణంగా పేమెంట్ అగ్రిగేటర్‌గా పని చేయడానికి లైసెన్సు కోసం పీపీఎస్ఎల్ 2020 నవంబరులో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కి దరఖాస్తు చేసింది. అయితే 2022 నవంబరులో ఆర్‌బీఐ ఆ దరఖాస్తును తిరస్కరిస్తూ ఎఫ్‌డీఐ నిబంధనల్లోని ప్రెస్‌నోట్ 3 నిబంధనలకు కట్టుబడుతూ మరోసారి దరఖాస్తు సమర్పించాలని పీపీఎస్ఎల్‌ను ఆదేశించింది. వాస్తవానికి ఓసీఎల్‌లో చైనాకు చెందిన యాంట్ గ్రూప్ పెట్టుబడులున్నాయి. ఈ మేరకు ప్రెస్‌నోట్ 3కి కట్టుబడుతూ ఓసీఎల్ నుంచి తమకు అందిన పెట్టుబడులకు ఆమోదముద్ర పొందడం కోసం 2022 డిసెంబరు 14వ తేదీన పీపీఎస్ఎల్ కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పీపీఎస్ఎల్‌లో చైనా పెట్టుబడుల వ్యవహారం అంతటినీ ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ ఒకటి పరిశీలనకు చేపట్టింది. కొవిడ్-19 అనంతర కాలంలో దేశీయ కంపెనీల అవకాశవాద టేకోవర్లను నిరోధించడం లక్ష్యంగా ఏ రంగంలోని కంపెనీలో అయినా భారతదేశ సరిహద్దులను పంచుకునే దేశాల నుంచి ఎఫ్‌డీఐలు స్వీకరించడానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని ప్రెస్‌నోట్ 3 నిర్దేశిస్తోంది. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్ఘనిస్థాన్.. మన దేశంతో భూసరిహద్దు పంచుకునే దేశాలు.

**ఇది ఎవరి విషయంలో అయినా జరిగేదే...**

కాగా ఈ వ్యవహారంపై పీపీఎస్ఎల్ ప్రతినిధి ఒకరిని సంప్రదించగా పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సుకు ఎవరు దరఖాస్తు చేసినా ఎఫ్‌డీఐ అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని, తమ విషయంలో కూడా ప్రస్తుతం జరుగుతున్నది రెగ్యులర్ ప్రాసెస్‌లో భాగమేనని వ్యాఖ్యానించారు. పీపీఎస్ఎల్ అన్ని మార్గదర్శకాలను అనుసరించిందని, అవసరమైన పత్రాలన్నింటినీ నిర్దిష్ట కాలపరిమితిలోగా రెగ్యులేటర్‌కు సమర్పించిందని ఆయన చెప్పారు. "అప్పటి నుంచి యాజమాన్య నిర్మాణంలో మార్పు వచ్చింది. పేటీఎం వ్యవస్థాపకుడు కంపెనీలో అతి పెద్ద వాటాదారుగా ఉన్నారు.

2023 జూలైలో ఓసీఎల్‌లో తన వాటాను యాంట్ ఫైనాన్షియల్ 10 శాతం కన్నా తగ్గించుకుంది. ఈ కారణంగా ఇది ప్రయోజనం పొందిన కంపెనీ యాజమాన్యం వర్గీకరణలోకి రాదు. ఓసీఎల్ వ్యవస్థాపక ప్రమోటర్‌కు ప్రస్తుతం 24.3 శాతం వాటా మాత్రమే ఉంది. అందువల్ల చైనా నుంచి ఎఫ్‌డీఐ అన్న మీ అవగాహన పూర్తిగా తప్పు" అని ఆయన స్పష్టం చేశారు. ఓసీఎల్ అసోసియేట్ కంపెనీ అయిన పీపీబీఎల్‌పై గత నెలలో ఆర్‌బీఐ కొన్ని ఆంక్షలు విధించిన నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 11వ తేదీ | | విజయవాడ | 530 |
| హైదరాబాద్ | 545 | విశాఖపట్నం | 555 |
| 12వ తేదీ | | వరంగల్ | 547 |
| చిత్తూరు | 583 | | |
| గోదావరి | 530 | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 122 | గోదావరి | 127 |
| వరంగల్ | 122 | విజయవాడ | 127 |
| కరీంనగర్ | 122 | గుంటూరు | 127 |
| మహబూబ్‌నగర్ | 122 | ఒంగోలు | 127 |
| కర్నూలు | 122 | చిత్తూరు | 133 |
| విశాఖపట్నం | 122 | | |

## పన్ను వసూళ్లలో 20 శాతం వృద్ధి

**ఫిబ్రవరి 10 నాటికి రూ.15.60 లక్షల కోట్లు వసూలు**

**న్యూఢిల్లీ:** ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు శనివారం నాటికి (10 ఫిబ్రవరి) 20 శాతం పెరిగి రూ.15.60 లక్షల కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఇది 80 శాతంతో సమానం. "అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ప్రత్యక్ష పన్ను వసూళ్లలో నిలకడ వృద్ధి నమోదైంది. 2024 ఫిబ్రవరి 10వ తేదీ నాటికి స్థూల వసూళ్లు రూ.18.38 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన వసూళ్లతో పోల్చితే ఇది 17.30 శాతం అధికం" అని సీబీడీటీ ఒక ప్రకటనలో తెలిపింది. రిఫండ్లు వినహాయించగా ఇది రూ.15.60 లక్షల కోట్లుగా ఉన్నాయని, గత ఏడాది ఇదే కాలంలో వసూళ్లతో పోల్చితే ఇది 20.25 శాతం అధికమని ఆ ప్రకటన వివరించింది. సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఇది 80.23 శాతంతో సమానమని పేర్కొంది. సీబీడీటీ అందించిన గణాంకాల ప్రకారం గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు రూ.2.77 లక్షల కోట్లు రిఫండ్లుగా చెల్లింపు జరిగింది. ఇదే కాలంలో కార్పొరేట్ ఆదాయపు పన్నులో (సీఐటీ) 9.16 శాతం, వ్యక్తిగత ఆదాయపు పన్నులో (పీఐటీ) 25.67 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్లు సర్దుబాటు చేసిన అనంతరం నికర వృద్ధి సీఐటీలో 13.57 శాతం, పీఐటీలో 26.91 శాతం ఉంది.

# నష్టాల బాటలోనే..!

గత వారం మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్లో నెలకొన్న బేరిష్‌నెస్ దృష్ట్యా ఈ వారం కూడా నష్టాల బాటలోనే సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిఫ్టీకి 21,600 వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఒకవేళ డౌన్‌ట్రెండ్‌ను సూచిస్తే 21,450/21,250 స్థాయిల వరకు సూచీ పతనం కావచ్చు. నిఫ్టీ 22,000 స్థాయిని అధిగమిస్తే మాత్రం బుల్లిష్‌నెస్ వస్తుంది. ఈ వారం ఎఫ్ఎంసీజీ, ఫైనాన్స్, ఆటోమొబైల్స్, లోహ రంగాల్లోని షేర్లు లాభపడే అవకాశం ఉంది.

**స్టాక్ రికమండేషన్స్**

**గ్రాసిమ్ ఇండస్ట్రీస్:** గత ఏడాది అక్టోబరు నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు డిసెంబరు నుంచి కన్సాలిడేటెడ్ అవుతోంది. రెండు నెలలుగా రూ.2,050 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలకు తగట్టుగా ఉండటంతో శుక్రవారం ఈ షేరు 5.41 శాతం లాభంతో రూ.2,168 దగ్గర క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,150/2,170 శ్రేణిలో ప్రవేశించి రూ.2,250/2,290 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,120 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**బ్యాంక్ ఆఫ్ బరోడా:** డిసెంబరు త్రైమాసికంలో మంచి లాభాలను ఆర్జించటంతో ఈ షేరు దూకుడు కనబరుస్తోంది. జనవరి చివరి వారం నుంచి ఈ షేరుకు డిమాండ్ పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.265.85 వద్ద క్లోజైంది. పొజిషనల్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.260 శ్రేణిలో ప్రవేశించి రూ.290/310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.250 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**అంబుజా సిమెంట్స్:** నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా ట్రేడవుతోంది. కొన్ని నెలలుగా కన్సాలిడేట్ అయిన ఈ కౌంటర్‌లో నవంబరు నెల చివరలో బుల్లిష్‌నెస్ మొదలైంది. ఇప్పటికీ అదే జోరును కనబరుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే సమీప నిరోధ స్థాయి రూ.600ను బ్రేక్ చేసే అవకాశం ఉంది. గత శుక్రవారం ఈ షేరు రూ.576.60 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.570 శ్రేణిలో ప్రవేశించి రూ.620/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.558 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**భారత్ ఫోర్జ్:** సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో ఈ మధ్య స్వల్ప దిద్దుబాటు జరిగింది. జనవరి నుంచి ఇప్పటి వరకు రౌండింగ్ బాటమ్ ఏర్పడింది. పైగా ఫలితాలు బాగుండటంతో షేరు దూసుకుపోతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,319.45 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,300 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,450/1,525 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,275 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


**థెర్మాక్స్ లిమిటెడ్:** గత ఏడాది నవంబరు 30న ఈ కౌంటర్‌లో భారీగా కొనుగోళ్లు జరిగాయి. అప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌ను ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.3,345 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.3,330/3,300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,275 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

## 22,100 పైన బుల్లిష్

**(ఫిబ్రవరి 12-16 తేదీల మధ్య వారానికి)**



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

**అస్ట్రో టెక్**

**గత వారం నిఫ్టీ:** 21,783 (-71)


నిఫ్టీ గత వారం 22,127-21,727 పాయింట్ల మధ్యన కదలాడి 71 పాయింట్ల నష్టంతో 21,783 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,100 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,677, 21,407, 20,182, 19,757 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

**బ్రేకౌట్ స్థాయి :** 22,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,475
**నిరోధ స్థాయిలు:** 21,975, 22,075, 22,175
(21,875 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు:** 21,675, 21,575, 21,475
(21,675 దిగువన బేరిష్)

## గరిష్ఠ స్థాయిల్లో నిలకడ

**టెక్ వ్యూ**



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం చారిత్రక గరిష్ఠ స్థాయి 22,000 వరకు వెళ్లి రియాక్షన్‌లో పడింది. శుక్రవారంనాడు 21,700 పైన రికవరీ సాధించి 21,780 వద్ద ముగిసింది.. టెక్నికల్‌గా గత కొద్ది వారాల సైడ్‌వేస్ ధోరణిని కొనసాగిస్తున్నప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం వల్ల ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అలాగే మద్దతు స్థాయిల కన్నా దిగజారకుండానే కరెక్షన్ పూర్తి చేసుకున్నట్టు కూడా కనిపిస్తోంది. ఫలితంగా పాజిటివ్ కన్సాలిడేషన్ కూడా పూర్తయింది. అందువల్ల మరింత ర్యాలీని ధ్రువీకరించాలంటే చారిత్రక గరిష్ఠ స్థాయి వద్ద ఉన్న నిరోధాన్ని బ్రేక్ చేయాలి. ఇక మిడ్‌క్యాప్ 100 సూచీ మరో 400 పాయింట్ల మేరకు లాభపడినా స్మాల్ క్యాప్ సూచీ మాత్రం ఫ్లాట్‌గా ముగిసింది. శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో పాజిటివ్ ధోరణి కారణంగా ఈ వారం మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమై 22,000 వద్ద పరీక్షకు గురి కావచ్చు. ఫిబ్రవరిలో ఇలా పరీక్ష ఎదుర్కొనడం మూడో సారి.

**బుల్లిష్‌స్థాయిలు:** పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం మానసిక అవధి 22,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 22,150. ఆ పైన మాత్రమే మరింత ర్యాలీకి అవకాశం ఉంటుంది.

**బేరిష్ స్థాయిలు:** మైనర్ మద్దతు స్థాయి 21,650 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21,400. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ కూడా గత వారం 46,000 వద్ద రియాక్షన్‌లో పడినా 45,000 స్థాయిలో రికవరీ సాధించి 45,630 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 46,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 47,000. ఒకవేళ 46,000 వద్ద విఫలమైతే అప్రమత్తతను సూచిస్తుంది.

**పాటర్న్:** మార్కెట్ గత వారం స్వల్పకాలిక 25, 50 డీఎంఏల కన్నా పైన బౌన్స్‌బ్యాక్ సాధించింది. 22,150 వద్ద నిఫ్టీ ట్రిపుల్ టాప్ ఏర్పరచుకుంది. మరింత అప్‌ట్రెండ్ కోసం దీన్ని బ్రేక్ చేయాలి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం మంగళ, శుక్రవారాల్లో తదుపరి రివర్సల్స్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 21,940, 22,000 |
| మద్దతు | 21,800, 21,730 |

www.sundartrends.in

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.


మార్కెట్ చైర్మన్‌ను తీసుకొచ్చి అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు

## పంటపై కూర్చోబెట్టి.. కొంగు లాగి

- మార్కెట్ చైర్ పర్సన్‌ను లాక్కెళ్లిన మహిళా రైతులు
- మార్కెట్ కార్యాలయ ఫర్నిచర్ ధ్వంసం.. చౌరస్తాలో ధర్నా
- పోలీసులతో ఘర్షణ.. అచ్చంపేటలో ఉద్రిక్తత

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 11: ఆరుగాలం శ్రమించి పండించిన వేరుశనగకు గిట్టుబాటు ధర పలకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. పట్టరాని కోపంతో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌ను పంట కుప్పల వద్దకు లాక్కెళ్లారు. వాటిపై కూర్చోబెట్టి ఆమె కొంగు లాగారు. మీద వేరుశనగలు పోశారు. ఇదంతా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో జరిగింది. మార్కెట్‌కు ఆదివారం 30 నుంచి 40 వేల బస్తాల వేరుశెనగ వచ్చింది. మధ్యాహ్నం 1.30 కల్లా టెండర్లు పూర్తి కావాలి. అయితే, పంట ఎక్కువ ఉండడంతో అదనంగా గంట సమయం పట్టింది. రూ.4 వేలు-5 వేల మధ్య ఇద్దరు రైతులకు, రూ.5 వేలు-6 వేల మధ్య 44 మందికి, రూ.6 వేలు-7 వేల చొప్పున 639 మందికి, రూ.7 వేలు-రూ.7,220 వంతున 24 మంది పంటకు ధరలు కేటాయించి తూకం ప్రారంభించారు. ఈలోగా ధర తక్కువగా వచ్చిన రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయం వద్దకు వెళ్లి చైర్‌పర్సన్ బలున అరుణను నిలదీశారు. కోపంతో కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. కుర్చీలను ఎత్తేసి, అద్దాలను పగులగొట్టారు. కొందరు మహిళా రైతులు మార్కెట్ చైర్మన్ అరుణను లాక్కెళ్లి వేరుశనగ కుప్పలమీద కూర్చోబెట్టారు. ఆమెపై వేరుశనగలు పోశారు. అక్కడినుంచి అంబేడ్కర్ చౌరస్తా వద్దకు నడిపించుకుంటూ తీసుకొచ్చి ధర్నాకు దిగారు. మార్కెట్ చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిర్ణయించిన ధరకు అదనంగా రూ.వెయ్యి నుంచి రూ.1500 ఇవ్వాలని కోరారు. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేసి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం రైతులకు నచ్చజెప్పారు. చివరకు టెండర్లను రద్దు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. సోమవారం మళ్లీ టెండర్లు వేయనున్నట్లు తెలిపారు.

## ఇంధన సామర్థ్య నిర్వహణలో తెలుగు రాష్ట్రాలు దేశానికి ఆదర్శం

- సీఐసీ హీరాలాల్ సమారియా

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంధన సామర్థ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిసారించి అన్ని రాష్ట్రాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచాయని సెంట్రల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ) హీరాలాల్ సమారియా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రజలు, సంస్థల్ని ప్రోత్సహిస్తూ విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా మిషన్ లైఫ్ ముందడుగేస్తోందన్నారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బీఈఈ), విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన మిషన్ లైఫ్‌కు సంబంధించి ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2028నాటికి భారత్‌లోని 80 శాతం గ్రామాలు, పట్టణాలు, స్థానిక సంస్థల్లో పర్యావరణ అనుకూల పద్ధతులు అవలంబించేలా ప్రోత్సహించడమే మిషన్‌లైఫ్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయెల్, బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా అడ్వైజర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అలేఖ్య హత్యకేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

- ఏర్పాటు చేయాలని సీఎంను కోరతా: వెడ్మబొజ్జు

ఖానాపూర్, ఫిబ్రవరి 11: అలేఖ్య హత్య కేసులో నిందితులకు సత్వరమే శిక్షపడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఇటీవల నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో అలేఖ్య అనే యువతి ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆదివారం అలేఖ్య కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బొజ్జు పరామర్శించారు. తమ బిడ్డకు జరిగిన అన్యాయం మరో ఆడబిడ్డకు జరగొద్దంటే హంతకుడికి అతనికి సహకరించిన వారిందరికీ ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అలేఖ్య తల్లిదండ్రులు గంగవ్వ, గంగారాం, కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జు.. అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## ప్రిన్సిపాల్ వేధింపులతోనే వైష్ణవి ఆత్మహత్య

**భోజనంపై ఫిర్యాదు చేసిందని కక్ష.. తల్లిదండ్రుల ఆరోపణ**

**పాఠశాల ఎదుట ఆందోళనలో పాల్గొన్న ఆర్‌ఎస్ ప్రవీణ్**

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 11: "భోజనం బాగాలేదని ఉన్నతాధికారులకు చెప్పడమే మా బిడ్డ చేసిన తప్పయింది. అది మనసులో పెట్టుకుని ఆమెను ప్రిన్సిపాల్ ఝాన్సీ వేధించారు. దీంతోనే ఆత్మహత్య చేసుకుంది" అంటూ సూర్యాపేట మండలం ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకులం ఇంటర్ విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి (17) తల్లిదండ్రులు దగ్గుపాటి వెంకన్న, భాగ్యమ్మ ఆరోపించారు. వైష్ణవి శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఫేర్‌వెల్ వేడుకలో పాల్గొని, తల్లిదండ్రులకు వీడియో కాల్ ద్వారా ఆ విషయాలను నవ్వుతూ చెప్పిన ఆమె.. తర్వాత గంటలోనే తరగతి గదిలో తోటి విద్యార్థినులకు విగత జీవిగా కనిపించింది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని వైష్ణవి తల్లిదండ్రులు, విద్యార్థి, కుల సంఘాల వారు ఆదివారం పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. సూర్యాపేట-నేరేడుచర్ల ప్రధాన రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వైష్ణవి కుటుంబాన్ని పరామర్శించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్.. ధర్నాలో పాల్గొని రోడ్డుపై బైఠాయించారు. వైష్ణవి మృతిపై విచారణ అధికారిగా నియమితులైన సూర్యాపేట అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, మూడు రోజుల క్రితమే ఇమాంపేట గురుకులంలో ముగ్గురు విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తల్లిదండ్రులు వచ్చి అడగ్గా, ఏం చెప్పకుండా వారిని గది నుంచి పంపించినట్లు తెలిసింది.


పార్వేట మండపం వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇనుప కంచె

## తిరుమలలో ఏనుగుల గుంపు కలకలం

- పార్వేట మండపం వద్ద ఇనుప కంచె, చెట్లు ధ్వంసం

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం ఏనుగుల సంచారం కలకలం రేపింది. పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపం సమీపంలో శనివారం రాత్రి ఏనుగులు అడవి నుంచి రోడ్డు దాటి డ్యాం వైపు వెళ్లాయి. అదే మార్గంలో తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఏనుగుల పాదముద్రలను బట్టి ఐదారు ఏనుగులుండవచ్చని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఏనుగుల గుంపు పార్వేట మండపం పక్కనే ఉన్న శ్రీగంధ వనం ఇనుప కంచె, చెట్లను ధ్వంసం చేశాయి. రాత్రి వేళ పాపవినాశనం మార్గాన్ని టీటీడీ మూసివేస్తుంది కాబట్టి ఏనుగుల గుంపు సంచారం కారణంగా భక్తులకు ఇబ్బంది కలగలేదు. డ్యాంలో నీటిని తాగేందుకే ఏనుగులు వచ్చి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. గతేడాది కూడా ఇదే సమయంలో ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరించడం గమనార్హం.

# యాదగిరిగుట్టపైకి ఆటోరిక్షాలు

**ప్రారంభించిన ప్రభుత్వ విప్ అయిలయ్య.. జగదీశ్‌రెడ్డి, కవిత, సునీత దేవుడి నిధులు బొక్కారు**


ఆటోలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

- ఈ వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ కోరతాం: అయిలయ్య

యాదాద్రి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టపై ఆటోరిక్షా సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగె, డీసీపీ రాజేశ్‌చంద్ర, దేవాదాయశాఖ అధికారులు జెండాలను ఊపి కొండపైకి ఆటోరిక్షాలను అనుమతించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా కొండపైకి ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్న బడుగుల పొట్టను గత బీఆర్‌ఎస్ సర్కారు వైటీడీఏ అభివృద్ధి పేరుతో కొట్టిందని విమర్శించారు. 2022 మార్చి 22 నుంచి కొండపైన ఆటోలను నిషేధించారని, దీంతో.. 300 మంది ఆటోరిక్షా కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని దుయ్యబట్టారు. వారంతా ధర్నాలు, ఆందోళనలు చేస్తే.. పట్టించుకోకపోగా.. కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. "ప్రస్తుతం గుట్టలో భక్తులకు మొక్కు కొబ్బరికాయలు సమర్పించడానికి కూడా స్థలం లేదు. మరుగుదొడ్లు, డార్మెటరీ హాళ్లు, చలువ పందిళ్లు లేక, ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజుల్లో తాత్కాలిక డార్మెటరీ హాల్‌ను ఏర్పాటు చేస్తాం" అని హామీ ఇచ్చారు. అనంతరం అయిలయ్య కొండపైకి స్వయంగా ఆటోను నడిపారు. అధికారులూ అందులో ప్రయాణించారు.

### దేవుడి నిధులను దండుకున్నారు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత వైటీడీఏ పేరుతో యాదాద్రిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో సగం నిధులను బొక్కేశారని అయిలయ్య ఆరోపించారు. ఆలయ పునర్నిర్మాణంలో ఈఎన్‌సీ గణపతి రెడ్డి అవినీతికి పాల్పడ్డారని, దీనిపై జ్యుడీషియల్ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. యాదగిరిగుట్టలో నిర్మించనున్న మెడికల్ కాలేజీని తరలిస్తున్నారనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ కాలేజీని కొడంగల్‌కు తరలిస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద బిక్షమయ్య గౌడ్ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గుట్టలోనే మెడికల్ కాలేజీని నిర్మిస్తామని స్పష్టం చేశారు.

**డిప్యుటేషన్ల రద్దు..**

# సర్కారు దవాఖానాలపై పిడుగు!

- పాత పోస్టులకు వెళ్లిపోయిన డాక్టర్లు
- స్పెషలిస్టు వైద్యులు లేక నిలిచిన సేవలు
- సాధారణ రోగులకు తీవ్ర ఇబ్బందులు
- సిబ్బంది లేక స్తంభించిన తెలంగాణ డయాగ్నస్టిక్స్
- కొన్ని జిల్లాల్లో కలెక్టర్ల దిద్దుబాటు చర్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఏళ్లుగా డిప్యుటేషన్స్ పేరుతో పాతుకుపోయిన వారిని సొంత ప్లేసులకు పంపాలన్న ప్రభుత్వ నిర్ణయం అభాసుపాలవుతోంది. రోగులకు అవసరం ఉన్న చోట డాక్టర్ల డిప్యుటేషన్లను రద్దు చేసి వారిని వెనక్కి పంపిస్తుండటంతో కొన్ని ఆస్పత్రులలో అత్యవసర వైద్య సేవలు నిలిచిపోయాయి. ఫలితంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాఖలో అన్ని రకాల డిప్యుటేషన్లను, వర్క్‌ఆర్డర్లను రద్దు చేస్తూ ఈనెల 7న ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు. డిప్యుటేషన్‌పై ఉన్నవారంతా ఫిబ్రవరి 8వ తేదీ సాయంత్రం వరకు తిరిగి తమ సొంత పోస్టింగ్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. దాంతో ఆ శాఖ పరిధిలోని వైద్య సిబ్బంది అంతా 8వ తేదీన తమ సొంత ప్లేసులలో రిపోర్టు చేశారు. అయితే, ఈ వ్యవహారం రోగుల ప్రాణాలమీదికొచ్చింది. పర్మినెంటు స్పెషలిస్టు వైద్యులు లేని ఆస్పత్రుల్లో డిప్యుటేషన్లపై పని చేస్తున్న డాక్టర్లు తాజా ఉత్తర్వుల నేపథ్యంలో వెనక్కి వెళ్లిపోయారు. ఉదాహరణకు, ఖమ్మం ప్రభుత్వాస్పత్రి క్యాథ్ ల్యాబ్‌లో కార్డియాలజిస్టు ఇప్పటి వరకూ డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఆయన మంచిర్యాల మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్. తాజాగా సర్కారు డిప్యుటేషన్లను రద్దు చేయడంతో ఆయన మంచిర్యాలకు వెళ్లిపోయారు. దీంతో జిల్లా ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలు నిలిచిపోయాయి. కార్డియాలజిస్టు లేకపోవటంతో హృద్రోగులు వ్యయప్రయాసలకోర్చి హైదరాబాద్ సర్కారు దవాఖానాలకు రావాల్సి వస్తోంది. మరోవైపు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ కేంద్రాల్లో పని చేసే ల్యాబ్ టెక్నీషియన్లు అందరూ కూడా డిప్యుటేషన్ల మీదనే ఉన్నారు. ఇప్పుడు వారంతా వెనక్కు వెళ్లిపోవడంతో టీ డయాగ్నస్టిక్స్ కేంద్రాల్లో సేవలు నిలిచిపోయే ప్రమాదం తలెత్తింది. దీంతో కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు వెంటనే స్పందించి.. ల్యాబ్ టెక్నీషియన్లు అదే ప్లేసులో కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. అయితే, ఇతర ప్రాంతాల్లో మాత్రం రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిప్యుటేషన్ల రద్దుతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రితో ల్యాబ్ సేవలు, ఆదిలాబాద్ రిమ్స్‌లో హెల్ప్ డెస్క్ సేవలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్‌లో ఆదివాసీలు, గిరిజనులకు ఈ పరిణామం ప్రాణసంకటంగా మారింది.

### ఆగమేఘాల మీద ఎఫ్‌ఎస్‌డీ

ఇదంతా ఒక కోణం కాగా, సర్కారు ఇచ్చిన డిప్యుటేషన్ల రద్దు ఆదేశాలను గంటల వ్యవధిలోనే ఉన్నతాధికారులు తుంగలో తొక్కి, తమకు కావలసిన వారికి ఆగమేఘాలపై ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ (ఎఫ్‌ఎస్‌డీ) ఇవ్వటం మరో కోణం. ఈ మేరకు ఓ అధికారిణి ఉదంతం వైద్య ఆరోగ్య శాఖలో చర్చనీయాంశమైంది. ఖమ్మంలో మలేరియా ఆఫీసర్‌గా ఉన్న సదరు అధికారిణి.. కొన్నేళ్లుగా గ్రేటర్ హైదరాబాద్‌లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఇటీవల డిప్యుటేషన్స్ రద్దు అవుతున్నాయని తెలిసి, అదే రోజు ఆమె ఎఫ్‌ఎస్‌డీ ఆర్డర్ తెచ్చుకొని జీహెచ్‌ఎంసీలోనే ఉండిపోయారు. ఆమెకు ప్రజారోగ్య సంచాలకులు ఎఫ్‌ఎస్‌డీ ఆర్డర్ ఇవ్వటంపై వైద్యవర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ఎఫ్ఎస్‌డీ ఆర్డర్ రావాలంటే కనీసం 15-30 రోజుల సమయం పడుతుంది. ఒక్కరోజులోనే ఆగమేఘాలపై ఎఫ్‌ఎస్‌డీ ఎలా ఇస్తారని ఉద్యోగ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించాలని వారు కోరుతున్నారు. డిప్యుటేషన్‌పై పని చేసే వారికి వారి ఒరిజినల్ పోస్టు వద్ద వేతనం లభిస్తుంది కానీ, ఎఫ్‌ఎస్‌డీ మీద ఉన్న వారికి పని చేసే చోటే వేతనం అందుతుంది.

### నేడు డీహెచ్ కార్యాలయం వద్ద ఆందోళన

గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 317 జీవో తప్పిదం వల్ల వర్క్ ఆర్డర్స్ పుట్టుకొచ్చాయని, ఒక్క మెమోతో వాటన్నింటిని అధికారులు రద్దు చేశారని, 317 బాధితులకు న్యాయం చేయాలని, అప్పటివరకు డిప్యుటేషన్స్ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ హెచ్ 1 యూనియన్ రాష్ట్ర కమిటీ సోమవారం డీహెచ్ కార్యాలయం వద్ద ఆందోళనకు పిలుపునిచ్చింది. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని సంఘం నేతలు తెలిపారు.

## కొడంగల్‌కు మెడికల్ కాలేజీ మంజూరు

- నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలలు కూడా
- 220 పడకల ఆస్పత్రిగా సీహెచ్‌సీ అప్‌గ్రేడ్
- 224.50 కోట్లకు అనుమతులు
- జీవో జారీ చేసిన సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యకు సంబంధించి నాలుగు కళాశాలలు కొడంగల్‌కు మంజూరు అయ్యాయి. మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కాలేజీల ప్రారంభానికి అవసరమైన పాలనపరమైన అనుమతులకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 50 ఎంబీబీఎస్ సీట్లతో ఈ కాలేజీని ఏర్పాటు చేయనున్నారు. అలాగే 60 సీట్లతో నర్సింగ్, 50 సీట్లతో ఫిజియోథెరపీ, 30 సీట్లతో పారామెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆ జీవోలో వెల్లడించారు. కాగా, ఈ కళాశాలల భవననిర్మాణ బాధ్యతలను రోడ్లు భవనాలశాఖకు అప్పగిస్తున్నటు ఆ జీవోలో పేర్కొన్నారు. అలాగే అందుకు అవసరమైన నిధులను కేటాయించినట్లు తెలిపారు. వైద్యవిద్య కళాశాలకు రూ.124.50 కోట్లు, నర్సింగ్ కాలేజీకి రూ.46 కోట్లు, ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాల భవనాలకు రూ.27 కోట్లు కేటాయించింది. ఇక కొడంగల్‌లోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(సీహెచ్‌సీ) మెడికల్ కాలేజీల కోసం 220 బెడ్ల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు సర్కారు ఆ జీవోలో పేర్కొంది. అందుకు రూ.27 కోట్లను మంజూరు చేసింది. ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ బాధ్యతలను తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ)కు అప్పగించింది. అలాగే ఇప్పటివరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఈ సీహెచ్‌సీని, వైద్యవిద్య సంచాలకుల పరిధికి తక్షణమే బదిలీ చేస్తున్నట్లు సర్కారు ఆ జీవోలో పేర్కొంది. అంతేకాకుండా కళాశాలల ఏర్పాటుకు అవసరమైన అత్యవసర ధృవపత్రాలు, నిరభ్యంతర పత్రాలను(ఎన్‌వోసీ) కూడా తక్షణమే ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు అదే ఉత్తర్వుల్లో వెల్లడించింది.

## చోరీ కోసం వచ్చి చీర్స్!

**తాళం వేసి ఉన్న ఇంట్లోకి నలుగురి చొరబాటు**

**బంగారం, వెండి, రూ.30 వేల నగదు తస్కరణ**

**విదేశీ మద్యం కనిపించడంతో అక్కడే సిటింగ్**

**పూటుగా తాగేసి ఆ ఇంట్లోనే నిద్రించిన వైనం**

**బాలసముద్రంలో ఘటన.. కేసు నమోదు**

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కరడుగట్టిన దొంగలు. తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగతనం కోసం చొరబడిన వారికి.. విదేశీ మద్యం కనిపించడంతో నోరూరిపోయింది. ఇంకేముంది.. దొరికిన మద్యం తాగి కాసేపు అక్కడే కునుకుతీశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ సుబేదారి పీఎస్ పరిధిలోని బాలసముద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగిందీ ఘటన. బాలసముద్రానికి చెందిన కనపర్తి సత్యనారాయణ హనుమకొండ చౌరస్తాలో వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాల వ్యాపారి. ఈ నెల 7న బాలసముద్రంలోని ఇంటికి తాళం వేసి అమెరికాకు వెళ్లాడు. దీంతో నలుగురు దొంగలు ఆయన ఇంటిని టార్గెట్ చేశారు. శనివారం రాత్రి సుమారు ఒంటిగంటకు సత్యనారాయణ ఇంటికి చేరుకుని.. ఆ ప్రాంగణంలో అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తర్వాత ప్రధాన ద్వారం గొళ్లేన్ని ఇనపరాడ్డుతో పగులగొట్టి లోనికి ప్రవేశించారు. పూజ గదిలోకి వెళ్లి అక్కడి కొంత బంగారాన్ని, వెండి విగ్రహాలను, బీరువాలో ఉన్న సుమారు రూ.30 వేల నగదును దోచుకున్నారు. ఇంట్లో వెతుకుతున్న క్రమంలో వారికి విదేశీ మద్యం బాటిళ్లు కనిపించాయి. ఫ్రిజ్‌లో ఉన్న డ్రైఫ్రూట్స్ తీసుకుని నలుగురూ కలిసి సిట్టింగ్ వేశారు. రెండు బాటిళ్లు తాగి అక్కడే హాయిగా పడుకున్నారు. తెల్లవారుజామున సుమారు 4గంటల సమయంలో నిద్ర లేచి.. చోరీ సొత్తుతో బయటికొచ్చారు. ఆ సమయానికే నిద్ర లేచిన ఇరుగుపొరుగువారు వారిని గమనించి దొంగలంటూ గట్టిగా అరిచారు. దీంతో ఆ నలుగురూ పరుగులు తీశారు. ఈ క్రమంలో తమ చెప్పులు, బూట్లు, టవళ్లు అక్కడే వదిలివెళ్లారు. చుట్టుపక్కల వారు విషయాన్ని అమెరికాలో ఉన్న సత్యనారాయణకు ఫోన్ చేసి చెప్పడంతో.. బంధువులకు ఆయన సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సత్యనారాయణ సోదరుడు కిషన్‌రావు ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులతో పాటు క్లూస్ టీం ఆధారాలు సేకరించారు.

## కామారెడ్డి ఘటన.. ఇద్దరు వైద్యులు, ఓ నర్సు సస్పెన్షన్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి ప్రభుత్వ దవాఖాన ఐసీయూలో ఉన్న రోగిని ఎలుకలు కరిచిన ఘటనపై ప్రభుత్వం కఠినంగా స్పందించింది. ఈ ఘటనకు బాధ్యులైన ఇద్దరు వైద్యులు, ఓ నర్సును సస్పెండ్ చేసింది. జిల్లా కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నామంటూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ త్రివేణి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ కావ్య, ఐసీయూ జనరల్ మెడిసిన్ ఇన్‌చార్జి డాక్టర్ వసంత్ కుమార్, డ్యూటీ నర్స్ జి.మంజుల విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ చర్యలు తీసుకున్నారు.రోగిని ఎలుక కరిచిన ఘటనలో ఇద్దరు వైద్యులను సస్పెండ్ చేయడాన్ని టీచింగ్ గవర్నమెంటు డాక్టర్స్ అసోసియేషన్ ఖండించింది. రోగికి వైద్యం అందించడమే వైద్యుల బాధ్యతని స్పష్టం చేసింది. ఈ సస్పెన్షన్‌ను నిరసిస్తూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వైద్యులు నల్లబాడ్జీలతో సోమవారం విధులకు హాజరవుతారని తెలిపింది. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే టీచింగ్ వైద్యులందరితో రాష్ట్ర వ్యాప్త సమ్మె చేస్తామని హెచ్చరించింది.

# అభ్యంతరకరంగా నేతల భాష

**మేధావులు, రచయితల అభిశంసనపత్రం**

**'తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిభాష' పై**

**హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం**


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పత్రికల సంపాదకులు, రాజకీయ విశ్లేషకులు, కవులు, రచయితలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో రాజకీయనాయకులు మాట్లాడుతున్న భాష పట్ల మేధావులు, సామాజికవేత్తలు, న్యాయకోవిదులు, కవులు, రచయితలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో ఉన్నవారు వాడే భాష సభ్యంగా ఉండాలని వారంతా అభిప్రాయపడ్డారు. 'తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిభాష' అంశంపై.. మాదాపూర్‌లోని దస్‌పల్లా హోటల్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పాల్గొన్నవారంతా.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులు వాడుతున్న భాషను నిరసిస్తూ, అభిశంసన పత్రాన్ని విడుదల చేశారు. నాయకుల ప్రసంగాలు, చర్చాగోష్ఠుల్లో పరస్పర నిందలు ప్రధానం కావడం బాధాకరమన్నారు. రాజకీయాలతో సంబంధం లేని వారి కుటుంబ సభ్యులను కూడా దుర్భాషలాడటం పట్ల విచారం వ్యక్తం చేశారు. సభ్యత, బాధ్యత కలిగిన పౌరులంతా ఈ తరహా అసభ్యకరమైన భాషను అభిశంసించాలని కోరారు. సంస్కార రహితంగా ఎవరు మాట్లాడినా, వారిపై నిరసనలు తెలియజేస్తామని ప్రకటించారు. పత్రికలు, చానళ్లు కూడా నాయకుల అభ్యంతరకర వ్యాఖ్యలను ప్రసారం చేయకూడదని.. ప్రచురణకు స్వీకరించకుండా బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై త్వరలోనే అన్ని మీడియా కార్యాలయాలకూ త్వరలోనే లేఖలు రాయనున్నట్లు తెలిపారు. పరస్పర గౌరవంతో ఆరోగ్యకరమైన చర్చజరగాల్సిన ప్రజాస్వామ్య దేశంలో తిట్లదండకాలకు చోటు ఉండకూడదని ఆకాంక్షించారు. దుర్భాషలాడుకొనే కుసంస్కృతికి వ్యతిరేకంగా పౌర స్పృహను పెంచేలా రెండు తెలుగు రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సీనియర్ జర్నలిస్ట్ కె.రామచంద్ర మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురాం, విశ్రాంత ఐఏఎస్‌లు కాకి మాధవరావు, సుజాతారావు, ప్రొఫెసర్ హరగోపాల్, సామాజిక కార్యకర్త సుధ గోపరాజు, ప్రముఖ కవులు కె.శివారెడ్డి, అందెశ్రీ, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్, 'ఈనాడు' ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు వల్లీశ్వర్, కె.శ్రీనివాసరెడ్డి, మాశర్మ, డానీ, ఎమెస్కో విజయ్ కుమార్, ప్రముఖ రచయిత డి.చంద్రశేఖర్ రెడ్డి, మల్లేపల్లి లక్ష్మయ్య, మాడభూషి శ్రీధర్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, విశ్లేషకుడు తెలకపల్లి రవి పాల్గొన్నారు.

# మేడారంలో భక్త జన సందోహం

## వనదేవతల దర్శనానికి 10 లక్షల మందికి పైగా భక్తుల రాక


భక్తులతో కిటకిటలాడుతున్న వనదేవతల గద్దెల ప్రాంగణం

ములుగు, ఫిబ్రవరి 11: మేడారం జాతర ఇంకా ప్రారంభం కాకముందే వనదేవతల దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు జాతర జరగనుంది. 2 నెలల ముందు నుంచే భక్తుల రాక మొదలవ్వగా.. జాతర సమీపిస్తుండడంతో తాకిడి రోజురోజుకి పెరిగిపోతోంది. ఆదివారం 10 లక్షల మందికిపైగా భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో వ్యాపారాలు చేసుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. ములుగు మండలం జాకారం-భూపాల్‌నగర్ స్టేజీ మధ్య జరుగుతున్న రహదారి విస్తరణ పనుల వల్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆదివారం సాయంత్రం ఓ లారీ గుంతలో దిగబడడంతో దాదాపు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

### 23న సీఎం రేవంత్‌రెడ్డి రాక...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 23న మేడారం జాతరకు వచ్చి సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటారని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. వనదేవతలను ఆదివారం దర్శించుకున్న మంత్రి సీతక్క జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కోటిన్నర మందికి పైగా భక్తులు జాతరకు వచ్చే అవకాశం ఉండడంతో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రపతి, గవర్నర్‌ను కూడా ఆహ్వానించామని వారు కూడా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతకు ముందు ఏటూరునాగారం మండలంలో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

### వేడుకగా నాగోబా జాతర

ఇంద్రవెల్లి: రాష్ట్రంలో రెండో అతి పెద్ద గిరిజన ఉత్సవం నాగోబా జాతర ఘనంగా జరుగుతోంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ప్రధాన ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. జాతరలో మూడో రోజు, ఆదివారం.. నాగోబా ప్రధాన ఆలయం వెనుక మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో పెర్సాపేన్, బాన్ దేవతలకు ప్రత్యేక పూజలు జరిగాయి. కొత్తగా బేటింగ్(పరిచయం) అయిన కోడళ్లు మర్రి చెట్టు వద్ద ఉన్న బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి బాన్ దేవత ఆలయం ముందు ఉన్న పాత పుట్టను తొలగించారు. మెస్రం వంశీయులు పాత భాన్ దేవతల ప్రతిమలను పవిత్ర జలంతో శుద్ధి చేశారు. కోడళ్లు కొత్త పుట్టలను తయారు చేసి భాన్ దేవతకు పూజలు చేశారు. ఇక, జాతరలో అత్యంత ప్రధానంగా భావించే గిరి దర్బార్ సోమవారం జరగనుంది.

### రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యల కేసు..

## బాల్క సుమన్‌కు నోటీసులు

- రేవంత్‌పైనా కేసు పెట్టాలి: సుమన్

హైదరాబాద్/మంచిర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఇటీవల మంచిర్యాలలో జరిగిన బీఆర్ఎస్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డిపై సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐసీపీ 294-బి, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆదివారం హైదరాబాద్‌లో సుమన్‌కు నోటీసులు ఇచ్చి.. విచారణకు రావాలని కోరారు. దీనిపై బాల్క సుమన్ స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం తనపై అక్రమంగా కేసు నమోదు చేయించిందని ఆరోపించారు. ఉద్యమంలో ఎన్నో కేసులను ఎదుర్కొని పోరాడిన పార్టీ తమదని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. పరుష పదజాలంతో దూషించానని తనపై కేసులు పెట్టిన ప్రభుత్వం.. కేసీఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌పై కూడా కేసులు పెట్టాలని డిమాండ్‌చేశారు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులపై అడ్డగోలుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టాలని అన్నారు.

## రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేస్తే ఊరుకోం

- చరిత్రను మరిపించేందుకు సీఎం కుట్ర: వినోద్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చిహ్నంలోని కాకతీయ తోరణం, చార్మినార్‌లు రాజకీయ వ్యవస్థకు చిహ్నాలని, వాటిని తీసేస్తామనడం సరికాదని బీఆర్ఎస్‌నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ఆ గుర్తులను తొలగిస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క దీనిపై స్పందించాలని, సీఎం నిర్ణయాన్ని రాష్ట్ర మంత్రులందరూ వ్యతిరేకించాలన్నారు. తెలంగాణ ఘన చరిత్రను కనుమరుగు చేసి చారిత్రక సందర్భాలను మరిపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్రకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కాకతీయులు అగ్రవర్ణాల వారు కాదని, నిరుపేదల కోసం పాలన సాగించారని.. చార్మినార్ హైదరాబాద్‌కు గుర్తు మాత్రమేకాకుండా అదొక గేట్‌వే అన్నారు. సీఎం ఆలోచన వెనుక ఆంధ్రామేధావుల ప్రభావం ఉందని, ఎవరో చెప్పిన వాటిని నమ్మి ఇలా ప్రవర్తించడమేమిటని ప్రశ్నించారు.

## కేసీఆర్‌తో ఉద్యమకారులు ఎవరూ లేరు

- గజ్జెల కాంతం, పిడమర్తి రవి

పంజాగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం కేసీఆర్ వెంట తెలంగాణ ఉద్యమకారులు ఎవరూ లేరని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ గజ్జెల కాంతం, తెలంగాణ విద్యార్థి జేఏసీ మాజీ ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఆయన తన కుటుంబ లాభం కోసమే ఉద్యమకారులను వాడుకున్నారని, శ్రీకాంతాచారి తల్లి మొదలు ప్రతి ఉద్యమకారుడిని అణిచివేశారని ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల పేరు ఉచ్చరించే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని 15న లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. 2009-14 వరకు ఉద్యమంలో పాల్గొన్న వారితో పాటు 1969 తొలి దశ ఉద్యమకారులను ఆహ్వానిస్తున్నామన్నారు.

## ప్రజలను సీఎం తప్పుదోవ పట్టించారు: నామా

ఖమ్మం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రజలను తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణ ప్రాజెక్టులపై తాను అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలను వక్రీకరించారని పేర్కొన్నారు. తెలంగాణను పోరాడి తెచ్చుకున్నది సాగునీళ్ల కోసమేనని, కేసీఆర్ ఎప్పుడూ తెలంగాణ ప్రజల ప్రయోజనాల విషయంలో రాజీపడలేదని వ్యాఖ్యానించారు.

## అలా ఉత్తర్వులిస్తే నష్ట పోతాం: గురుకుల జేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వకుండా.. 317 జీవోను పూర్తిగా అమలు చేయకుండానే కొత్తవారికి నియామక పత్రాలు ఇస్తే 10 వేల మంది నష్టపోతారని గురుకుల జేఏసీ పేర్కొంది. ఈనెల 14న నియామక ఉత్తర్వులు ఇవ్వడానికి ముందే జీవో 317 సమస్యల పరిష్కారానికి తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని, ఈ విషయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చొరవచూపాలని గురుకుల జేఏసీ ప్రతినిధులు ఎ.మధుసూదన్, ప్రభుదాస్ తదితరులు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యేక కార్యాచరణ చేపడతామని వారు పేర్కొన్నారు.

## బీసీలకిచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించి హామీని నిలబెట్టుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ సంక్షేమానికి ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు బడ్జెట్ ద్వారా కేటాయిస్తామని, మహాత్మాజ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. బీసీల సంక్షేమానికి కేటాయించిన రూ.8వేల కోట్లు ఏమాత్రం సరిపోవని, బీసీ డిక్లరేషన్ ప్రకారం రూ.20వేల కోట్లు కేటాయించాలని జాజుల డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

### సీఎం రేవంత్‌ను కలిసిన బొంతు రామ్మోహన్.. త్వరలో కాంగ్రెస్‌లోకి!

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల ముంగిట ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మరో బిగ్‌షాక్. జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వారం రోజుల్లో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకొంటారని సమాచారం. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని రామ్మోహన్ భావిస్తున్నట్లు, ఇదే విషయాన్ని సీఎం రేవంత్ వద్ద ప్రస్తావించగా.. ఆయన పరిశీలిద్దామని చెప్పినట్లు తెలిసింది. విద్యార్థి దశలో ఏబీవీపీలో, ఆ తరువాత బీజేవైఎంలో క్రియాశీలంగా వ్యవహరించిన బొంతు రామ్మోహన్.. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలిచిన రామ్మోహన్‌కు మేయర్‌గా అవకాశం దక్కింది. కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న రామ్మోహన్.. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించారు. ఇందుకు కేటీఆర్ హామీ ఇచ్చినప్పటికీ.. పార్టీ అధినేత కేసీఆర్.. భేతి సుభాష్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. తిరిగి ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉప్పల్ టికెట్ కోసం ప్రయత్నించగా.. ఆయనకు మరోసారి నిరాశే ఎదురైంది. దీంతో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనైనా మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో ఏదో ఒక చోట నుంచి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని రామ్మోహన్ కోరినట్టు తెలిసింది. కానీ, ఇందుకు వారి నుంచి సానుకూల సంకేతాలు రాలేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యే సీఎం రేవంత్‌ను కలిసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుత మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా ఇటీవల సీఎంను కలిశారు. పాలనాపరమైన అంశాల కోసమేనని ఆమె చెప్పినప్పటికీ.. తాజా పరిణామాల నేపథ్యంలో మేయర్ అడుగులు ఎటువైపు? అన్న చర్చ కూడా జరుగుతోంది. మరోవైపు ప్రస్తుత డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి దంపతులూ పార్టీని వీడుతారన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీకి జీహెచ్ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కటి కూడా దక్కని విషయం తెలిసిందే. దీంతో లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రేటర్‌లో పార్టీ బలోపేతం లక్ష్యంగా కాంగ్రెస్ ఆపరేషన్‌ఆకర్ష్‌కు తెర తీస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లను చేర్చుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే 14 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లతో పార్టీ నేతలు సంప్రదింపులు జరిపినట్లు సమాచారం.

# జగన్‌తో కుమ్మక్కై రాష్ట్రాన్ని దెబ్బతీశాడు

### ఏ ముఖంతో కేసీఆర్ నల్లగొండ వస్తాడు?.. ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి

- ఆ రోజు నిరసనలు: మంత్రి కోమటిరెడ్డి
- సభను అడ్డుకుంటాం: రాజగోపాల్‌రెడ్డి



నల్లగొండ/చండూరు, ఫిబ్రవరి 11: కేసీఆర్ ఏ ముఖం పెట్టుకొని నల్లగొండకు వస్తాడని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయకుండా నల్లగొండను ఎడారిగా మార్చిన వ్యక్తి.. ఈ నెల 13న నల్లగొండకు ఎలా వస్తున్నాడని నిలదీశారు. కేసీఆర్ ముక్కు నేలకు రాసి, నల్లగొండ ప్రజలకు క్షమాపణ చెప్పి, రావాలని సూచించారు. ఏపీ మంత్రి రోజా పెట్టిన రొయ్యల పులుసు తిన్న కేసీఆర్.. రాయలసీమను రతనాల సీమ చేస్తానన్నాడని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏపీ సీఎం జగన్‌తో కలిసి బిర్యానీ తిని, కృష్ణా జలాలపై ఒప్పందాలు చేసుకొని.. తెలంగాణకు అన్యాయం చేశాడని ధ్వజమెత్తారు. ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. కేసీఆర్ జగన్‌తో కుమ్మక్కై. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీశాడన్నారు. ఆయన రాకను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు నల్లగొండలో నిరసన కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కుర్చీ వేసుకుని పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చి మోసం చేశాడన్నారు. నల్లగొండలోని గడియారం సెంటర్‌లో పింక్ కుర్చీ, పింక్ టవల్‌ను వేసి కేసీఆర్ ఫొటోను పెట్టి నిరసన తెలియజేస్తారని.. ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేసి, అప్పట్లో కేసీఆర్ ఏం మాట్లాడాడో ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. కేసీఆర్ కుమార్తె ఇక్కడ బతుకమ్మ ఆడి, ఢిల్లీలో లిక్కర్ దందా చేసిందని ధ్వజమెత్తారు. 6 గ్యారెంటీల అమలు కోసం బడ్జెట్‌లో రూ.53 వేల కోట్లు ప్రవేశపెట్టామని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు కూడా కేటాయింపులు చేశామని చెప్పారు. ఆర్ఆర్ఆర్ పనులు నిలిచిపోవడానికి సోమేశ్‌కుమారే కారకుడని, రూ.25వేల కోట్లతో త్వరలో రోడ్డును నిర్మిస్తామని తెలిపారు.

**సభను అడ్డుకుంటాం: రాజగోపాల్‌రెడ్డి**

జిల్లా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికే కేసీఆర్ నల్లగొండలోసభ నిర్వహిస్తున్నాడని, ఆ సభను అడ్డుకుంటామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. ఏపీ సీఎం జగన్‌తో అంటకాగిన కేసీఆర్, కేఆర్ఎంబీ ఫైళ్లపై సంతకం పెట్టి కేంద్రానికి అప్పజెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. 2016లో చర్లగూడెం ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన కేసీఆర్, రెండేళ్లలోనే పూర్తి చేస్తానన్న హామీ ఏమైందని నిలదీశారు. ప్రజలు పార్టీలకతీతంగా కేసీఆర్ సభను బహిష్కరించాలని పిలుపునిచ్చారు.కాగా, నల్లగొండ సభను నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తం గా కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

**తొక్కుకుంటూ వెళ్తాం: లింగయ్య యాదవ్**

కేసీఆర్ నిర్వహించనున్న సభకు ఎవరైనా అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నిస్తే వారిని తొక్కుకుంటూ వెళతామని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం బహిరంగ సభ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు.

## కేసీఆర్ నీళ్ల సెంటిమెంట్!

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధమైంది. ప్రాజెక్టుల అప్పగింత విషయంలో ప్రభుత్వ విధానమేంటి? ఈ వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర ఏంటన్నది ప్రజలకు తెలియజెప్పాలని నిర్ణయించింది. ఇందుకోసం సోమవారం శాసనసభలో ఈ అంశంపై చర్చ చేపట్టనుంది. దీనికి పార్టీ ఎమ్మెల్యేలను సిద్ధం చేసేందుకు ప్రజాభవన్‌లో ఆదివారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించింది. కృష్ణానది పుట్టు పూర్వోత్తరాలు, నదిపై ఉన్న ప్రాజెక్టులు, వివాదాలు, నీటి వాటాలు తదితరాలపై మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత ప్రతిపాదన, దానిపట్ల గత బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం, ఏపీ సీఎం జగన్‌తో కుదుర్చుకున్న అవగాహన వంటి వాటిని వివరించారు. అవగాహన సదస్సులో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. కాగా, శాసనసభలో సోమవారం చేపట్టనున్న చర్చలోనూ ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక కేసీఆర్ సభ జరిగే రోజు (మంగళవారం) ఎమ్మెల్యేలను ప్రభుత్వం ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డ పరిశీలనకు తీసుకువెళ్లనుంది. సదస్సు ముగిసిన అనంతరం ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణా జలాలకు సంబంధించి శాసనసభలో సోమవారం స్పష్టత ఇస్తామన్నారు. నల్లగొండలో కేసీఆర్ సభ ప్రారంభమయ్యే లోపునే తెలంగాణ ప్రజలకు నిజాలు చెబుతామన్నారు. తెలంగాణ నీళ్లను ఏపీ సీఎం జగన్ కోసం కేసీఆర్.. ఏపీకి తరలించారని ఆరోపించారు. ఈ విషయాన్ని జగనే ఏపీ అసెంబ్లీలో చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణకు ఉమ్మడి పాలకుల కంటే కేసీఆర్ చేసిన అన్యాయమే ఎక్కువన్నారు.

# మహీ... మనోడే!

### హార్సిలీహిల్స్‌కు చేరిన 'యాత్ర'లో కొత్త కోణం

- అసలు పేరు వారణాసి మహేందర్ రెడ్డి
- తల్లిది పులివెందుల... తండ్రిది పుంగనూరు
- 2019 ఎన్నికలముందే జగన్‌తో డీల్
- 'యాత్ర'కు దర్శకత్వం.. ప్రచారానికి పంచ్ డైలాగులు
- 'నేను విన్నానూ... నేను ఉన్నానూ' అనిపించింది ఆయనే ఇప్పుడు 'యాత్ర-2' దర్శకత్వం, నిర్మాణం
- వచ్చే ఎన్నికలకూ సేవ అందించేలా 'ప్యాకేజీ'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



వారణాసి మహేందర్ రెడ్డి సన్ ఆఫ్ రాఘవరెడ్డి! ఈ పేరు ఎప్పుడైనా.. ఎక్కడైనా విన్నట్లు గుర్తుందా? పోనీ... 'యాత్ర-2' దర్శక, నిర్మాత మహీ వి.రాఘవ అంటే తెలుసా? నిన్నటిదాకా తెలియకపోయి ఉండొచ్చుకానీ... 'హార్సిలీహిల్స్' కథ విన్నాక కచ్చితంగా తెలిసే ఉంటుంది. అసలు విషయం ఏమిటంటే... మహీ వి.రాఘవ అసలు పేరు వారణాసి మహేందర్ రెడ్డి! అన్నమయ్య జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన హార్సిలీహిల్స్‌లో 'మినీ సినీ స్టూడియో' పేరిట రెండెకరాలు కట్టబెడుతున్నది ఆయనకే! అసలు ఎవరీ 'మహీ వి.రాఘవ' అని ఆరా తీస్తే... ఆయన ఇంకెవరో కాదని, ముఖ్యమంత్రి జగన్‌కు 'మనోడే' అని తెలిసింది. అంతేకాదండోయ్... ఆయనకు పులివెందుల మూలాలు కూడా ఉన్నాయి. మహీ తండ్రిది పుంగనూరు నియోజకవర్గం సదుం. తల్లిది పులివెందుల. ఎటు చూసినా మనోడి కిందే లెక్కే. సినీ పరిశ్రమలోకి రాకముందు, ఆ తర్వాత కూడా ప్రతి ఏటా వేసవిలో ఆయన హార్సిలీహిల్స్‌కు వెళ్లే వారు. కొద్ది రోజులు బస చేయడం అలవాటుగా చేసుకున్నారు. రాయలసీమలో హార్సిలీహిల్స్‌లాంటి ప్రదేశాలే లేవు. వేసవి కాలంలో కూడా చల్లగా ఉండడంతోపాటు ప్రకృతి రమణీయత ఉట్టిపడే ఆ ప్రదేశంలో తనకూ కొంత స్థలం ఉంటే ఎంత హాయో అని అప్పుడే కలలు కనేవారు. ఆయన చిన్నప్పటి నుంచి కంటున్న కల ఇప్పటికి సాకారమవుతోంది.

**సేవకు ప్రతిఫలం...**

జగన్‌తో మహీకి 'క్విడ్ ప్రోకో' తరహా డీల్ కుదిరింది. వీరిది 'యాత్ర-2'తో మొదలైన బంధం కాదు. 2019లోనే ఇది మొదలైంది. అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్న సమయంలో... ఆయనను, వైఎస్‌నూ కీర్తిస్తూ తీసిన 'యాత్ర' చిత్రానికి మహీ వి.రాఘవ దర్శకత్వం వహించారు. జగన్ ఎన్నికల ప్రచారంలో పనికొచ్చేలా కొన్ని పంచ్ డైలాగులను కూడా రాసిచ్చారు. 'నేను విన్నానూ.. నేను ఉన్నానూ' అంటూ జగన్ తీసిన దీర్ఘాలు గుర్తున్నాయి కదా! ఆ మాటలు మహీ వి.రాఘవ సృష్టించినవే. ఇప్పుడు... 2024 ఎన్నికల ముందు 'యాత్ర-2' పేరుతో మరో సినిమా తీశారు. 'యాత్ర'కు మహీ వి.రాఘవ దర్శకుడు మాత్రమే! అచ్చంగా జగన్‌ను కీర్తిస్తూ తీసిన సీక్వెల్ సినిమా నిర్మాణంలో ఆయన కూడా భాగస్వామి అయ్యారు. యాత్ర-2 ప్రకటన, షూటింగ్, విడుదల ఒక అంకం! హార్సిలీహిల్స్‌లో పదెకరాల స్థలం కోసం నేరుగా సీఎం జగన్‌కు దరఖాస్తు, దీనిపై ఫైల్ పెట్టాలంటూ సీఎం కార్యదర్శి ధనుంజయ రెడ్డి ఆదేశాలు, జిల్లా కలెక్టర్‌కు లేఖ, అక్కడి తహసీల్దార్‌కు ఆదేశాలు, శుక్రవారం స్థల పరిశీలన... ఇది మరో అంకం! ఇవి రెండూ ఒకేకాలంలో ముందుకు కదిలాయి. యాత్ర-2కు ముందు దరఖాస్తు పెట్టుకోగా... సినిమా విడుదలైన శుక్రవారమే మదనపల్లె ఆర్డీవో ఈ స్థలాన్ని పరిశీలించి, రెండెకరాల కేటాయింపునకు లైన్ క్లియర్ చేయడం గమనార్హం. ఈ రెండెకరాలు తీసుకున్నందుకు... 2029 ఎన్నికల్లోనూ మహీ వి.రాఘవ వైసీపీకి తన సేవలు అందించాల్సి ఉంటుందని సమాచారం!

## ఢిల్లీలో కాంగ్రెస్ జెండా పాతుదాం: పొన్నం



కొత్తూర్/రవీంద్రభారతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్ జెండా పాతేందుకు సమాయత్తం కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు అమలు చేయలేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడించి ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలమూరు న్యాయ యాత్ర ఆదివారం రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం పెంజర్లలో కొనసాగింది. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం సమావేశంలో మాట్లాడుతూ.. పదవులు పోయాయన్న అక్కసుతో పసికూన వయసులోనే ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు మాటల దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉండగా బెంజ్ కార్లలో తిరిగిన నాయకులు.. ఇప్పుడేమో ఆటోలు ఎక్కుతూ డ్రామాలకు తెరతీస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా దశాబ్ద కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తమ ఆకాంక్షలను నెరవేర్చని బీఆర్ఎస్, బీజేపీ నేతలను నిలదీయాలని ప్రజలకు పొన్నం పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల అధ్యయనానికే తాను న్యాయ యాత్ర చేపట్టినట్టు వంశీచంద్‌రెడ్డి తెలిపారు. కాగా, మైనింగ్ కాంట్రాక్టుల్లో వడ్డెర కులస్తులకు ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. వడ్డెరలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన వడ్డెరల ఆత్మగౌరవ సభలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కర్ణాటక బీసీ సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ తంగ్డేలతో కలిసి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. వడ్డెర వసతి గృహ నిర్మాణానికి తనవంతు సహకారమందిస్తామన్నారు. వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటుతో పాటు మైనింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ విషయంలో సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. వడ్డెరలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. వడ్డెర సంఘం డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కర్ణాటకలో వడ్డెరులు ఎస్సీ జాబితాలో ఉన్నారని.. తెలంగాణలో వారిని ఎస్సీల్లో చేర్చాలని కర్ణాటక మంత్రి శివరాజ్ కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తానన్నారు.

## నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై సోమవారం చర్చ జరగనుంది. రూ.2,75,891 కోట్లతో ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా, ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలు, వాటికి చేసిన కేటాయింపులపైనే అసెంబ్లీలో చర్చ జరగనున్నట్లు సమాచారం. పథకాల అమలుకు నిధుల కేటాయింపులు సక్రమంగా జరగలేదని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆరోపిస్తున్నారు. సరిపడే నిధులు లేకుండా పథకాలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాలపైనే ప్రభుత్వాన్ని నిలదీయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఉన్నట్లు సమాచారం. దీంతో వారికి దీటుగా సమాధానం చెప్పేందుకు కాంగ్రెస్ నేతలు సన్నద్ధమవుతున్నారు.

# బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు

- సర్వే సంస్థలతో కేసీఆర్ దుష్ప్రచారం
- బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్.. బీఆర్ఎస్ మిలాఖత్: బండి సంజయ్
- 20 నుంచి విజయ సంకల్ప యాత్రలు
- బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ: కిషన్‌రెడ్డి
- మేడిగడ్డకు మా ఎమ్మెల్యేలు వెళ్లరు: లక్ష్మణ్



విజయసంకల్ప యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి, తదితరులు

సిరిసిల్ల/జగిత్యాల/హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చీకొట్టిన బీఆర్ఎస్‌తో పొత్తు ఎందుకు పెట్టుకుంటామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడిస్తుందని తెలిపారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి, చందుర్తి మండలాల్లో.. జగిత్యాల జిల్లా కథలాపూర్‌మండలం సిరికొండ, దూలూరు, దుంపెట, తాండ్య్రాల, అంబారిపేట, కలికోట గ్రామాల్లో సంజయ్ రెండో రోజు ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకోబోతున్నాయంటూ కేసీఆర్ కొన్ని సర్వే సంస్థల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారీగా కలిసి పనిచేస్తున్నాయని, గత ఎన్నికల్లోనూ బీజేపీని దెబ్బతీసేందుకు అలాంటి దుష్ప్రచారం చేశాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉండబోతోందని సర్వేలు చెబుతున్నాయన్నారు. బడ్జెట్ కేటాయింపులతో కాంగ్రెస్ అసలు స్వరూపం బయటపడిందని, హామీల పేరుతో మోసం చేసి అధికారం చేపట్టినట్లు ప్రజలకు అర్థమైందని అన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలకు ఎన్ని నిధులు అవసరమవుతాయో చెప్పాలని.. బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయించారో సమాధానం ఇవ్వాలని సంజయ్ డిమాండ్ చేశారు.

**20 నుంచి విజయ సంకల్ప యాత్రలు**

మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్న వారిని కలుసుకునేందుకు ఈ నెల 20 నుంచి విజయ సంకల్ప యాత్రలు చేపడుతున్నామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో మార్చి 1 వరకు ఈ యాత్రలు కొనసాగుతాయని చెప్పారు. ప్రతీ రోజు 2-3 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్రలు కొనసాగేలా రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో రోడ్ షోలు ఉంటాయని తెలిపారు. మోదీకి ఎదురు నిలిచే శక్తి ఏ కూటమికీ లేదని స్పష్టం చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో కలిసి కిషన్‌రెడ్డి విజయ సంకల్ప యాత్రల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో 17 పార్లమెంటు స్థానాల్లోనూ బీజేపీ పోటీ చేస్తుందని కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్ స్థానాలతో పాటు మెజారిటీ సీట్లు గెలుచుకోబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ఐదు పార్లమెంటు క్లస్టర్లలో విజయ సంకల్ప యాత్రలు కొనసాగనున్నాయి. కొమురం భీం యాత్ర, శాతవాహన యాత్ర, కాకతీయ యాత్ర, భాగ్యనగర యాత్ర, కృష్ణమ్మ యాత్రలు మార్చి 1న భాగ్యనగరంలో కలిసే విధంగా రూట్‌మ్యాప్ రూపొందించారు.

**మేడిగడ్డకు మా ఎమ్మెల్యేలు వెళ్లరు**

రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ సందర్శనకు ఆహ్వానిస్తే తమ పార్టీ ఎమ్మెల్యేలు వెళ్లబోరని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము ఈ ప్రాజెక్టు వద్దకు ఎప్పుడో వెళ్లి వచ్చామని, మేడిగడ్డ కుంగిన ఘటనపై ఫోటోలు, వీడియోలు కూడా వచ్చాయని.. అక్కడ ఒక కొత్తగా చూసేదేముందని ప్రశ్నించారు.

# వచ్చే నైరుతి ఆశాజనకం!

- గతేడాది కంటే మెరుగ్గా వర్షాలు
- వాతావరణ నిపుణుల విశ్లేషణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించే వ్యవసాయ రంగానికి మేలుచేసే నైరుతి రుతుపవనాల సీజన్ ఆశాజనకంగా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చే జూన్ నుంచి సెప్టెంబరు వరకు గతేడాది సీజన్‌లో కంటే మెరుగైన వర్షాలు కురుస్తాయని విశ్లేషిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో గతేడాది నుంచి కొనసాగుతూ, ప్రస్తుతం బలంగా ఉన్న ఎల్‌నినో క్రమేపీ బలహీనపడనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమవుతాయి. తరువాత జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడుతుందని, ఆగస్టు నాటికి లానినా ఏర్పడుతుందని నిపుణులు వివరించారు. ఈ మేరకు దేశీయ, అంతర్జాతీయంగా పలు వాతావరణ సంస్థలు చేపట్టిన మోడళ్లను పరిగణనలోకి తీసుకొని వచ్చే నైరుతిలో మంచి వర్షాలు కురుస్తాయని విశ్లేషించారు.

**భారత ఉపఖండంపై ప్రభావం**

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో కొనసాగితే ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలపై దాని ప్రభావం పడుతుంది. పసిఫిక్‌లో ఉపరితల ఉష్ణోగ్రతలు వేడిగా ఉండటంతో ఎండల తీవ్రత పెరగడం, వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో పాటు కొన్నిచోట్ల ప్రకృతి విపత్తులు.. అంటే వరదలు, తుఫాన్లు, వడగాడ్పులు సంభవిస్తుంటాయి. ముఖ్యంగా భారత ఉపఖండంపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గతేడాది నైరుతి సీజన్ నాలుగు నెలల్లో సాధారణ వర్షపాతం 868.6 మి.మీ.కు గాను 820 మి.మీ. నమోదైంది. జూన్‌లో తీవ్రమైన ఎండలు, వర్షాభావం కొనసాగింది. జూలైలో కొంతవరకు వర్షాలు కురిసినా మళ్లీ ఆగస్టులో వర్షం జాడ లేదు. సెప్టెంబరులో ఎక్కువగా వర్షాలు కురిసినా అప్పటికే అనేక చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. గతేడాది దేశ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసిన ఎల్‌నినో... 2024లోనూ కొనసాగుతోంది. వచ్చేనెల వరకు దీని తీవ్రత కొనసాగి తరువాత ఏప్రిల్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమవుతాయని నిపుణులు చెబుతున్నారు. వచ్చే జూన్, జూలైల్లో లానినా అభివృద్ధి చెందుతుందని భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ పేర్కొన్నారు.

**వర్షాలు పడినా.. ఎండలూ ఎక్కువే**

పలు వాతావరణ మోడళ్లను పరిశీలించిన మీదట.. త్వరలో ఎల్‌నినో ముగిసి తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని, తరువాత లానినా ఏర్పడే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ సీనియర్ అధికారి డి.శివానందపాయ్ అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో తీవ్రత నేపథ్యంలో గత వేసవి కంటే ఈ ఏడాది వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని ఇప్పటికే ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించిందని, అయితే రానున్న నెలల్లో తటస్థ పరిస్థితులు ఏర్పడిన తరువాత లానినా వస్తే ఎండలు అంత తీవ్రంగా ఉండకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా జూన్ నాటికి లానినా వచ్చే అవకాశాలున్నాయని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ట్రోపికల్ మేనేజ్‌మెంట్‌కు చెందిన శాస్త్రవేత్త రోక్సీ మాథ్యూ అంచనా వేశారు. దీనివల్ల నైరుతి రుతుపవనాలు అనుకున్న సమయానికి వచ్చి, మంచి వర్షాన్ని ఇచ్చినా... వేసవి తీవ్రత మాత్రం కొనసాగుతుందన్నారు. ఇంకా తుఫాన్ల తీవ్రత పెరగడం, కుంభవృష్టిగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి



ప్రజా రచయిత్రుల వేదిక నూతన కార్యవర్గం

## ట్రోలింగ్ భూతాన్ని తరిమికొడతాం

**‘ప్రరవే’ రాష్ట్ర మహాసభల్లో పలువురు వక్తల శపథం**

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 11: అభ్యుదయ శక్తులను, సామాజిక కార్యకర్తలను కలవరపెడుతున్న ట్రోలింగ్ భూతాన్ని తరిమికొడతామని పలువురు వక్తలు శపథం చేశారు. ఈ విష సంస్కృతిని మనో ధైర్యంతో ఎదుర్కొనాలని, సంఘటితమై పోరాడాలని బాధితులకు సూచించారు. ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో శని, ఆదివారాల్లో ప్రజా రచయిత్రుల వేదిక (ప్రరవే) రాష్ట్ర ఏడో మహాసభలు నిర్వహించారు. ప్రముఖ యాంకర్ ఉదయభాను, జర్నలిస్టు తులసి చందు, ప్రముఖ సామాజిక కార్యకర్త అరుణ గోగులమండ, నాస్తికవాది బైరి నరేష్ తదితరులు ట్రోలింగ్‌కు గురైన సందర్భంలో తమ పరిస్థితిని, దానిని ఎదుర్కొన్న తీరును ఆదివారం సభలో వివరించారు. ప్రముఖ కవయిత్రి శీలా సుభద్రాదేవి అధ్యక్షతన జరిగిన సభలో కవయిత్రి కాత్యాయినీ విద్మహే సంకలనం చేసిన ‘నారి సారించిన నవల’ పుస్తకాన్ని స్త్రీవాద కవయిత్రి శిలాలోలిత ఆవిష్కరించారు. అనంతరం టీఎస్‌పీఎస్సీ మాజీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ దేశంలో భిన్న భావజాలాలను అణగదొక్కడం ద్వారా ఒకే భావజాలాన్ని రుద్దే చర్యలు అమలవుతున్నాయన్నారు. ఇందుకోసం ప్రత్యేక నెట్‌వర్క్ పనిచేస్తున్నదని ఆరోపించారు. ప్రజా గాయని విమలక్క మాట్లాడుతూ ట్రోలింగ్ బాధితులకు అండగా నిలుస్తామని ప్రకటించారు. ట్రోలింగ్ బాధితుల కథనాలతో ముద్రించిన ‘ట్రోల్’ పుస్తకాన్ని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా శనివారం ఆవిష్కరించారు. వీక్షణం సంపాదకుడు, విరసం మాజీ నేత ఎన్.వేణుగోపాల్ ప్రసంగిస్తూ ఎన్ఐఏ దాడులు తన మనోధైర్యాన్ని, పనితీరును దెబ్బతీయబోవన్నారు. రాజకీయంగా కూడా ట్రోలింగ్ సమస్య పెచ్చుమీరుతోందని, దీనికి బీజేపీనే కారణం అని నిందించారు. కాగా, ప్రరవే జాతీయ అధ్యక్ష కార్యదర్శులుగా అనిశెట్టి రజిత, ఎండ్లూరి మానసలను ఎన్నుకున్నారు. సమన్వయకర్తగా పి.రాజ్యలక్ష్మి, కోశాధికారిగా కొమ్రాజు రామలక్ష్మి, ఏపీ అధ్యక్షురాలిగా పి.అమరజ్యోతి, కార్యదర్శిగా కేఎన్ మల్లీశ్వరి, సమన్వయకర్తగా కాపూరి శారద, నియామక ప్రతినిధిగా జహాఆరా, కార్యవర్గ సభ్యులుగా మందరపు హైమవతి, రచన శృంగవరపు, లక్ష్మీసుహాసిని, తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులుగా తిరునగరి దేవకీదేవి, కాత్యాయిని విద్మహే, సమన్వయకర్తగా బండారి సుజాత, నియామక ప్రతినిధిగా తాళ్లపల్లి యాకమ్మ, కార్యవర్గ సభ్యులుగా శాంతి ప్రబోధ, షహనాజ్ బేగం, పాత శ్రీలక్ష్మి, కొలిపాక శోభారాణి, గిరిజన ప్రతనిధిగా కుంజ కళ్యాణిలను నియమించారు.

## తెలంగాణకు ఎన్టీపీసీ వెలుగులు

**టీఎస్‌టీపీపీ రెండో యూనిట్ ట్రయల్ సక్సెస్**

జ్యోతినగర్, ఫిబ్రవరి 11 : పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) స్టేజ్-1 ఆదివారం పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 2వ యూనిట్‌కు నిర్వహించిన ట్రయల్ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ఈ యూనిట్ పూర్తి స్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడంతో మొత్తం 1600 మెగావాట్ల (800 మెగావాట్ల 2 యూనిట్లు) మొదటి దశ సంపూర్ణమైంది. గత గురువారం యూనిట్‌కు సంబంధించి ట్రయల్ ఆపరేషన్ ప్రారంభించారు. 72 గంటల పాటు కొనసాగిన ట్రయల్ ఆపరేషన్ గ్రాండ్ సక్సెస్ అయింది. 2వ యూనిట్లో 800 మెగావాట్లకు పైగా లోడ్‌తో ఉత్పత్తి కొనసాగింది. ట్రయల్ ఆపరేషన్ చివరి దశను ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు వివిధ విభాగాల జీఎంలు జీజీ సురేష్, సంజీవ్ సాహా, సంతోష్ తివారి, మోహన్‌రెడ్డి, అలోక్ కుమార్ త్రిపాఠి, తదితర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ట్రయల్ రన్ ఆపరేషన్ పూర్తవడంతో మరో రెండు, మూడు రోజుల్లో రెండో యూనిట్‌ను కమర్షియల్ ఆపరేషన్‌గా (సీవోడీ) ప్రకటించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణకే సరఫరా చేస్తారు. రెండో దశలో 2400 మెగావాట్ల ప్రాజెక్టును నెలకొల్పాల్సి ఉంది.

## బస్సు టికెట్‌తోపాటే శ్రీశైలంలో దర్శనం బుకింగ్

**రోజుకు 1,200 మందికి.. ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు**

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాట్లు చేయనుంది. బస్సు సీటు రిజర్వేషన్‌తో పాటే స్వామివారి దర్శనానికి టికెట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. స్పర్శ దర్శనానికి 200 మంది, అతిశీఘ్ర దర్శనాలకు 500 మంది, శీఘ్ర దర్శనాలకు 500 మంది(మొత్తం 1200మందికి) ప్రయాణికులకు అవకాశం కల్పించేందుకు దేవస్థానంతో టీఎస్ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేసి దర్శన టిక్కెట్ల రిజర్వేషన్లు ప్రారంభించనున్నారు.

## ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ ప్రకటించాలి

**ఆర్టీసీ కార్మిక సంఘాల డిమాండ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు తక్షణమే పీఆర్సీ ప్రకటించాలని ఆర్టీసీ టీఎంయూ, ఎన్ఎంయూ, టీజేఎంయూ, ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్‌లు.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించి న్యాయ సమ్మతమైన డిమాండ్‌లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరాయి. తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 2013 పీఆర్సీ బకాయిలు 50 శాతం బాండ్స్ చెల్లింపులకు రాష్ట్రప్రభుత్వం రూ.280 కోట్లు విడుదల చేయడం పట్ల టీఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మౌలానా, టీజేఎంయూ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుద్దాల అశోక్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు సంబంధించి అపాయింట్ డే తేదీని ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

## అంబేడ్కర్ వర్సిటీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

**ఈ నెల 29 ఆఖరు తేదీ**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ (బీ.ఏ/బీ.కాం/బీ.ఎస్సీ) కోర్సులు, పీ.జీ (ఎం.ఏ/ ఎం.కాం/ ఎమ్మెస్సీ) కోర్సులతోపాటు పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల అయినట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈ నెల 29 చివరి తేదీ అని, ఆలస్య రుసుం రూ. 200తో మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల కోసం 73829 29570/580 లేదా 040-23680222/333/555 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## టీడీపీ గెలిచాక ఏటా డీఎస్సీ

**జగన్ నాలుగేళ్లు పడుకొని..టీచర్ ఉద్యోగాలపై దగా: లోకేశ్**



శ్రీకాకుళం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడితే ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రకటించారు. ఊరికో ప్యాలెస్ కట్టుకున్న జగన్.. ఉత్తరాంధ్రకు ఏం చేశాడని నిలదీశారు. తామొచ్చాక ఈ ప్రాంతం నుంచి వలసలు లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. ‘శంఖారావం’ పేరుతో శ్రీకాకుళం జిల్లాలో ఆదివారం ఆయన ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో సభలు నిర్వహించారు. జగన్ ప్రభుత్వ అరాచక పాలనపై విరుచుకుపడ్డారు. నాలుగేళ్లు పడుకొని ఇప్పుడు డీఎస్సీ అంటున్నారని ఆక్షేపించారు. ‘ప్రభుత్వంలో 2.30 లక్షల పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి జగన్ మడమ తిప్పాడు. డీఎస్సీలో కేవలం 6వేల పోస్టులు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారు. టీడీపీ పాలనలో లక్షా 30 వేల పోస్టులు భర్తీ చేశాం. మళ్లీ వస్తే ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం’ అని ప్రకటించారు.

## చకచకా ఉద్యోగ పరీక్షల ఫలితాలు




(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించి, త్వరితగతిన భర్తీ ప్రక్రియ పూర్తి చేసేందుకు టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం 8,180 గ్రూపు-4 పోస్టులకు సంబంధించిన పరీక్షల ఫలితాలను వెల్లడించింది. త్వరలోనే జిల్లాల వారీగా మెరిట్ జాబితాలు రూపొందించి, పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయనుంది. అలాగే, ఇతర పోస్టుల భర్తీ విషయంలోనూ చర్యలు తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. వీటిలో ముఖ్యంగా లైబ్రేరియన్లు (71), డ్రగ్ఇన్‌స్పెక్టర్లు(18), జూనియర్ లెక్చరర్లు(1392), అసిస్టెంట్ ఇంజనీర్లు(833), వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు(185), ఉద్యాన అధికారులు(22), టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ ఓవర్‌సీర్ పోస్టుల(175)తోపాటు అకౌంట్స్ ఆఫీసర్స్, పాలిటెక్నికల్ లెక్చరర్లు, భూగర్భ అధికారులు, వ్యవసాయ అధికారులు, ఏఎంవీఐ పోస్టులు ఉన్నాయి. అగ్రికల్చర్ ఆఫీసర్లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ పరీక్షలకు సంబంధించిన తుది కీ విడుదల చేశారు. వారంలోగా ఈ పోస్టుల ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది.

### సుప్రీంలో విత్‌డ్రా తర్వాత గ్రూప్-1

గ్రూపు-1 పోస్టుల భర్తీ కోసం మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సైతం టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే పూర్తి చేయగా.. సుప్రీంకోర్టులో కేసు కొంత వరకు అడ్డంకిగా ఉంది. పేపర్ లీకేజీతో మొదటి సారి గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దవ్వగా.. రెండోసారి నిర్వహించిన ప్రిలిమినరీ సందర్భంగా అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడంతో అక్రమాలకు అవకాశాలున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. ఓఎంఆర్ షీట్ల సంఖ్యలోనూ తేడాలున్నాయని కోర్టుకు విన్నవించారు. హైకోర్టు ఆ పరీక్షను రద్దుచేయడంతో.. గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లింది. అప్పట్లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం 503 పోస్టులతో.. మరో 60 పోస్టులను కలిపి కొత్త లేదా రివైజ్డ్ నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆ అప్పీల్ అడ్డంకిగా ఉంది. ఈనెల 19న సుప్రీంకోర్టులో అప్పీల్‌పై విచారణ జరగనుంది. కొత్త సర్కారు ఇప్పటికే ఆ అప్పీల్‌ను విత్‌డ్రా చేసుకుంటామని పేర్కొంటూ పిటిషన్ వేసింది. అంటే.. ఈనెల 19న పిటిషన్ విత్‌డ్రాకు కోర్టు అంగీకరిస్తే.. ఆ తర్వాత ఏమాత్రం ఆలస్యం చేయకుండా నోటిఫికేషన్ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

### మెగా డీఎస్సీకి చకచక..

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో 5,089 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ పోస్టులకు మరో 6 వేల పోస్టులను జత చేసి, మెగా డీఎస్సీ నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే వారంలోనే ఈ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

# దేశమంతా ఏపీ గంజాయే

## హిమాచల్ ప్రదేశ్ మలానా క్రీమ్, కేరళ ఇడుక్కిగోల్డ్ రకాలను తోసిరాజని ‘శీలావతి’ గంజాయికి గిరాకీ

- నాలుగేళ్లలో 23 లక్షల కిలోల పట్టివేత
- అందులో 70 శాతం.. శీలావతి రకమే!
- ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో విశ్వరూపం
- అక్కడి నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు..
- స్థానికంగా కిలో గంజాయి రూ.పది వేలే
- రాష్ట్రాలు మారేకొద్దీ రూ.1.2 లక్షలకు
- ఎకరా సాగుతో 6 నెలల్లో 9 లక్షల లాభం!

(విశాఖపట్నం, పాడేరు-ఆంధ్రజ్యోతి)



ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో గంజాయి తోట (ఫైల్), (ఇన్‌సెట్‌లో) శీలావతి రకం ఎండు గంజాయి

దేశ ఆర్థిక రాజధాని ముంబై పబ్బుల్లో ఏపీ గంజాయే! కోల్‌కతా పాన్ షాపుల్లో ఏపీ గంజాయే!! తెలంగాణలోని పలు జిల్లాల్లో గల్లీ గల్లీలో ఏపీ గంజాయే!! భారతదేశంలో అటు హస్తిన నుంచి ఇటు తమిళనాట చెన్నై దాకా.. ఎందెందు వెదకి చూచిన అందందు ఏపీ గంజాయి జాడలే!! ప్రజల శారీరక, మానసిక, ఆర్థిక ఆరోగ్యాలను కొల్లగొట్టే ఈ మహమ్మారి.. ఆసేతుహిమాచలం విశ్వరూపం చూపుతోంది. దీనికి కారణం.. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పండించే అత్యంత నాణ్యమైన ‘శీలావతి’ రకం గంజాయి. గతంలో హిమాచాల్‌ప్రదేశ్‌లో పండే మలానా క్రీమ్ రకానికి, కేరళలో ఎక్కువగా పండించే ఇడుక్కి గోల్డ్ రకం గంజాయికి దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉంది. కానీ.. నాణ్యతలో ఆ రెండింటికన్నా మెరుగ్గా ఉండడం, ధర తక్కువ కావడంతో శీలావతి రకానికి గిరాకీ విస్తృతంగా పెరిగిపోయింది. ఎంతగా నంటే.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో గడిచిన నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పట్టుకున్న 23 లక్షల కిలోల గంజాయిలో 70 శాతం.. అంటే దాదాపుగా 16 లక్షల కిలోలకు పైగా ఏపీ నుంచి సరఫరా అయిందే! ఇదంతా దొరికిన గంజాయి లెక్క. తనిఖీలకు దొరక్కుండా అధికారుల కళ్లు గప్పి తరలించింది కూడా కలుపుకొంటే భయం కలిగించే లెక్క అవుతుందది.

### ఏమిటీ దీని ప్రత్యేకత?

శీలావతి రకం గంజాయి రారాణిగా చలామణి అవడానికి కారణం.. ఏవోబీ ప్రాంతంలోని వాతావరణం, నేల స్వభావం. అవే ఈ గంజాయికి ఓ రకమైన ప్రత్యేకతను తెచ్చాయి. శీలావతి గంజాయి మొక్క చూడడానికి అచ్చం బంతిపూల మొక్కలా ఉంటుంది. అంతే ఎత్తు పెరుగుతుంది. ఈ పంటకు నీరు ప్రధానం. గెడ్డలు, వాగులు ఉన్న ప్రాంతాల్లోనే సాగు చేస్తారు. రబీ సీజన్‌లో సమీపంలోని గెడ్డల నుంచి నీటిని మళ్లిస్తారు. శాస్త్రీయంగా ఎకరానికి 200 చోట్ల చిన్నపాటి గోతులు తవ్వుతారు. ఒక్కో గోతిలో 15-20 విత్తనాలు నాటుతారు. అవి వారంలో మొలకెత్తి నెల రోజుల్లో మొక్క దశకు చేరుకుంటాయి. చీడపీడలు పట్టిన ఆకులను వెంటనే తొలగిస్తారు. పురుగుల మందు పిచికారీ చేస్తారు. ఏటా జూలైలో పంట వేస్తే.. ఆ తర్వాత ఐదు నెలలకు (డిసెంబరుకు) పంట చేతికి వస్తుంది. జనవరిలో కోత కోస్తారు. పంట కోతకు వచ్చినప్పుడు వ్యాపారులు రైతు దగ్గరకే వచ్చి తీసుకువెళతారు. రవాణా బాధ్యత కూడా రైతుది కాదు. వ్యాపారులదే.

### తొమ్మిది రెట్ల ఆదాయం..

ఏవోబీలో శీలావతి, రాజహంస, కాలపత్రి.. అనే మూడు రకాల గంజాయి ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ మూడింటిలోనూ శీలావతి రకానికే డిమాండ్ ఎక్కువ. శీలావతి సాగు వల్ల ఎక్కువ ఆదాయం వస్తుంది. అందుకే పెద్ద సంఖ్యలో రైతులు పండిస్తున్నారు. ఒక ఎకరా భూమిలో గంజాయి సాగుకు లక్ష రూపాయలలోపే ఖర్చవుతుండగా, 500 కిలోల మేలైన శీలావతి (నాణ్యమైన రకం) దిగుబడి వస్తోంది. స్మగ్లర్లు సైతం గిరిజనుల ఇళ్ల వద్దకే వచ్చి కిలో రూ.10 వేలు (ప్రస్తుతం) చొప్పున చెల్లించి ఎండు గంజాయిని తీసుకువెళతారు. వాటి ప్యాకింగ్, మైదాన ప్రాంతాలకు తరలింపు అంతా స్మగ్లర్లే చూసుకుంటారు. ఎకరా భూమిలో లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి గంజాయి సాగు చేస్తే కేవలం ఆరు నెలల వ్యవధిలో రూ.తొమ్మిది లక్షల లాభం చేతికందుతుంది. ఏజెన్సీలో మరే పంటకూ ఇంత లాభాలు రావడం లేదు. అందుకే ఎక్కువ మంది గంజాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. చాలామంది వ్యాపారులు ఆదివాసీలకు డబ్బు ఎర చూపి వారితో శీలావతి పండిస్తున్నారు. అమాయక గిరిజనుల వద్ద నుంచి కిలో రూ.10 వేలకు కొనుగోలు చేస్తున్న ఈ మాఫియా ముఠాలు ఎంత ఎక్కువ దూరానికి రవాణా చేస్తే అంతమేర దాని ధరను పెంచుతూ పోతున్నారు. విశాఖ నుంచి తెలంగాణకు చేరుకునే సరికి దాని ధర రూ.50 వేలకు పెరిగి.. ముంబై, కోల్‌కతా వంటి నగరాలకు చేరుకునేసరికి రూ.80 వేల నుంచి రూ.1.2 లక్షల దాకా పలుకుతోంది.

### పలు రాష్ట్రాలకు..

విశాఖ మన్యం ప్రాంతంలో, ఒడిశాలోని కోరాపుట్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు గంజాయి రవాణా అవుతోంది. గతంలో స్థానిక వ్యాపారులే ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేవారు. కానీ, ఇప్పుడు పలు రాష్ట్రాల నుంచి వ్యాపారులు నేరుగా ఏవోబీ సరిహద్దులకు వచ్చి గంజాయి కొని, తమ తమ రాష్ట్రాలకు తీసుకెళ్తున్నారు. కొందరైతే గిరిజనులకు సాగుకు అవసరమైన డబ్బు కూడా ముందే ఇచ్చేసి.. పంట వచ్చాక మొత్తం తామే తీసుకెళ్తున్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి రూ.కోట్లల్లో సంపాదిస్తున్నారు. వీరి ద్వారా.. తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గోవా, ఈశాన్య రాష్ట్రాలకు ఈ గంజాయి ఎక్కువగా సరఫరా అవుతున్నట్టు సమాచారం. అక్కడ ఈ గంజాయిని పోలీసులు పట్టుకుంటే.. మూలాలు ఎక్కువగానే ఏపీలోనే తేలుతుండడం రాష్ట్రానికి చెడ్డ పేరు తెస్తోంది. అంతేకాదు.. విశాఖ, చుట్టుపక్కల జిల్లాల్లోనూ యువత ఈ మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి మత్తు కారణంగా ఆయా జిల్లాల్లో నేరాల రేటు పెరుగుతుండడం కూడా ఆందోళన కలిగిస్తోంది.

గంజాయి సాగును కట్టడి చేయాలని కేంద్రం ఎన్‌సీబీని ఏర్పాటు చేసింది. నదరన్ సెక్టార్‌లోని ఐదు రాష్ట్రాల (ఏపీ, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్)లో గంజాయిని ఎక్కువగా పండిస్తుండడంతో ఇటువైపు దృష్టి పెట్టింది. గంజాయి సాగును కట్టడి చేసే కార్యక్రమాల్లో భాగంగా అధికారులు.. అక్టోబరు నుంచి శాటిలైట్ సాయంతో అనుమానాస్పద ప్రాంతాల్లో ఫొటోలు తీస్తున్నారు. ఎక్కడైనా గంజాయి సాగు అవుతున్నట్టు కనిపిస్తే.. భౌతికంగా నిర్ధారించు

### శాటిలైట్ చిత్రాలుతీసి..

కోవడానికి గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీలను పంపుతున్నారు. ఆ తరువాత పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, రెవెన్యూ అధికారులు వెళ్లి పంటను నాశనం చేస్తారు. రైతుతోపాటు, సాగుకు అడ్వాన్సులు ఇచ్చిన వ్యాపారుల వివరాలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. గంజాయి కేసులో మూడుసార్లు కంటే ఎక్కువసార్లు దొరికితే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెడుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గతం కంటే ఇప్పుడు సాగు విస్తీర్ణం తగ్గిందే తప్ప పూర్తిగా నిర్మూలన కాలేదు.

విశాఖపట్నంలోని సెంట్రల్ జైలులో 914 మంది ఖైదీలను ఉంచడానికే ఏర్పాట్లు ఉన్నాయి. కానీ ఇక్కడ ఇప్పుడు 1,770 మంది ఖైదీలు ఉన్నారు. వారిలో 70శాతం మంది గంజాయి కేసుల్లో దొరికినవారే. రిమాండ్ ఖైదీలు 1,395 మంది కాగా, శిక్ష పడినవారు 375 మంది. రిమాండ్ ఖైదీలలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టయి వచ్చినవారు 1,300 మంది వరకు

### విశాఖ జైలులో..

ఉన్నారు. వీరిలో 90 శాతం మంది గిరిజనులే కావడం గమనార్హం. గంజాయి కేసు నమోదు చేస్తే నిందితుడికి ఆరు నెలల వరకు బెయిల్ ఇవ్వరు. బెయిల్ కోసం ఏ లాయర్ వద్దకు వెళ్లినా రూ.లక్ష వరకూ ఇవ్వాల్సి ఉంటుంది. గిరిజనులకు అక్షరజ్ఞానం లేకపోవడం, అంత డబ్బులు ఖర్చుపెట్టే స్థోమత లేకపోవడంతో చాలామంది బెయిల్ పిటిషన్లు వేయలేక జైళ్లలోనే మగ్గిపోతున్నారు. అంతేకాదు.. ఈ కేసుల్లో శిక్ష పడితే.. ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు అవుతారు.

## మాకేంటి!?

(మొదటిపేజీ తరువాయి)

కూడా చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పవర్ ప్లాంటులో పనులకు బ్రేక్ పడింది. 20 రోజులుగా సివిల్ పనులు పూర్తిగా స్తంభించాయి. నిజానికి, పవర్ ప్లాంట్ ప్రధాన కాంట్రాక్టు సంస్థ బీహెచ్ఈఎల్. కాంట్రాక్టును దీనికే జెన్‌కో కట్టబెట్టింది. బీహెచ్ఈఎల్ దానిని పనులవారీగా 20 వరకూ సంస్థలకు సబ్ కాంట్రాక్టుకు ఇచ్చింది. వీటిలో కొన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలకు అనుకూలంగా వ్యవహరించాయని, వీటికి ఇసుక, కంకర, డస్టు సరఫరా కాంట్రాక్టులు కూడా బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు, అప్పటి ప్రజా ప్రతినిధులకు సన్నిహితులైన వారికే ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధి, మరో కీలక ప్రజా ప్రతినిధి కలిసి ఇసుక, కంకర, డస్టు కాంట్రాక్టులను ఆపివేయాలని ఇటీవల హెచ్చరించారు. దాంతో, వాటి సరఫరా నిలిపివేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సదరు నేతల సూచనలతో కొన్ని కాంట్రాక్ట్ సంస్థలు తాజాగా ఇసుక, కంకర, డస్టు సరఫరాకు కొత్త వారితో ఒప్పందాలు చేసుకున్నాయని తెలుస్తోంది. మరోవైపు, కీలక ప్రజా ప్రతినిధి ఇటీవల ప్లాంటులో పనులు నిర్వహిస్తున్న అన్ని కంపెనీల ప్రతినిధులతో సమావేశమై, తమకు ‘అనుకూలం’గా ఉండాలని, గత ప్రభుత్వంలో కొనసాగించినట్లే తమతో ‘వ్యవహారాలు’ కొనసాగించాలని, లేకపోతే కాంట్రాక్టులను ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. మిగిలిన కాంట్రాక్టులకు సంబంధించి కూడా తమ అనుయాయులతో ఒప్పందాలు చేసుకోవాలని కాంట్రాక్ట్ సంస్థల నిర్వాహకులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. వీటన్నిటికీ తోడు, దాదాపు నాలుగు నెలలుగా భారీ మొత్తంలో బిల్లులు సైతం పెండింగ్‌లో పడి ఉన్నాయి. వీటన్నిటి నేపథ్యంలో, కాంట్రాక్టర్లు సివిల్ పనులను పూర్తిస్థాయిలో నిలిపివేశారు. సీసీ రోడ్లు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలు, ప్లాంటులో బాయిలర్లు, చిమ్నీల నిర్మాణాల్లో సీసీ పనులు, ఎర్త్ వర్క్స్, యాష్ పాండ్ నిర్మాణం తదితర పనులన్నీ నిలిచిపోయాయి. మెకానికల్, ఎలక్ట్రికల్ వర్క్స్ తదితరాలు మాత్రం నామమాత్రంగా కొనసాగుతున్నాయి. పనుల్లో మెజార్టీ భాగం ఆగిపోవడంతో ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికులు, సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు. అయితే, ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని, రూ.2 వేల కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ క్లియర్ చేయకుండా ఇలాగే సతాయిస్తే భవిష్యత్తులో పనులు కొనసాగించలేమని కాంట్రాక్ట్ సంస్థలు ఉన్నతాధికారులకు తేల్చిచెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# ఏపీలో ప్రజాప్రభుత్వం రావాలి

## అర్జునుడికి కృష్ణుడిలా.. జనమే బాబుకు సారథులవ్వాలి.. జస్టిస్ గోపాలగౌడ పిలుపు

**మాజీ సీఎంపై విక్రమ్ పూల రాసిన ‘మహాస్వాప్నికుడు’ పుస్తకావిష్కరణ**



‘మహాస్వాప్నికుడు’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీం మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ తదితరులు

విజయవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ‘మహాభారత యుద్ధం 18 రోజులు నడిచింది. అర్జునుడికి కృష్ణుడు సారథిలా పనిచేశాడు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలంతా సారథుల్లా పనిచేయాలి’ అని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ పిలుపిచ్చారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న చంద్రబాబు సభలు మహాసముద్రాన్ని తలపిస్తున్నాయని.. అయితే ఎన్నికల్లో గెలుపునకు ఇదొక్కటే సరిపోదన్నారు. ప్రజలంతా సారథుల్లా పనిచేసి రాష్ట్రంలో రాజకీయ చరిత్రను మార్చాలని సూచించారు. ఎన్ఆర్ఐ కోడూరి వెంకట్ ప్రచురణకర్తగా, పాత్రికేయుడు విక్రమ్ పూల.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై రాసిన ‘మహా స్వాప్నికుడు’ పుస్తకావిష్కరణ ఆదివారం విజయవాడలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలగౌడ ప్రసంగించారు. ‘రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పుడే రాష్ట్రానికి, దేశానికి మంచి భవిష్యత్ ఉంటుంది. చంద్రబాబు రాష్ట్రానికే కాకుండా.. దేశానికే మంచి రాజకీయ నాయకత్వాన్ని అందించారు. రాజకీయ మేధావి. ఆయన చతురత దేశానికి అవసరం. నిరంతరం దేశం, ప్రజలు, సమాజాభివృద్ధి కోసం ఆలోచిస్తారు. ప్రజలు, యువకులు, రైతుల అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డారు. దేవెగౌడ, ఐకే గుజ్రాల్ వంటి వారిని ప్రధానులను చేయడంలో ఎంతో కీలకంగా వ్యవహరించారు. ఐటీ విప్లవం వచ్చినప్పుడు దాని ఫలితాలను యువతకు అందించవచ్చని అప్పటి ప్రధాని వాజపేయికి వివరించి సైబరాబాద్‌కు శ్రీకారం చుట్టారు. బిల్ గేట్స్, బిల్‌క్లింటన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి యువతకు బాబు మంచి ఉపాధి అవకాశాలను చూపించారు. ఆయన దేశ రాజకీయ భవిష్యత్‌కు దిక్సూచి. మహాస్వాప్నికుడు పుస్తకంలో చంద్రబాబు రాజకీయ ప్రయాణంలో ఎలాంటి కష్టాలు అనుభవించారో రచయిత విక్రమ్ చాలా స్పష్టంగా రాశారు’ అని వివరించారు.

### బాబు విశ్వనరుడు: రచయిత

రచయిత విక్రమ్ పూల మాట్లాడుతూ.. చంద్రబాబు విశ్వనరుడని చెప్పారు. ఆయనకు కులం, మతం, ప్రాంతం ఉండవన్నారు. తాను రాసిన పుస్తకాల్లో ఇది నాల్గోదని..‘అధినాయకుల అంతరంగాలు’, ‘ఎన్టీఆర్ అసెంబ్లీ ప్రసంగాలు, రాజకీయ ప్రసంగాలు’, ‘శకపురుషుడు’ సావనీర్‌ను ప్రజల ముందుకు తీసుకొచ్చామని చెప్పారు. పుస్తకంలోని అంశాలపై చర్చ జరగాలని.. భవిష్యత్‌లో మరికొన్ని పుస్తకాలు తీసుకురావాలని భావిస్తున్నానని తెలిపారు.

# పెళ్లికి బాజా మోగింది...

(మొదటిపేజీ తరువాయి)



ఆ రోజునే తమ పెళ్లి రోజుగా ఖరారు చేసుకున్నారు. లెక్కల్లో చెప్పాలంటే.. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఫిబ్రవరి 14న దాదాపు 60 వేల కల్యాణాలు జరుగుతున్నట్టు అంచనా. ఆ తర్వాత ముహూర్తాలకు నిశ్చయమైన కల్యాణాలను కూడా కలుపుకొంటే ఈ సీజన్‌లో దాదాపు 2 లక్షల వివాహాలు జరగనున్నాయి. గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో కేవలం 10 నుంచి 12 దాకా మాత్రమే మంచి ముహూర్తాలు ఉండడం.. అవి కూడా ఎక్కువ మంది జన్మనక్షత్రాలకు సరిపడకపోయే స్థితి ఉండడంతో అప్పట్లో వివాహాలు పెద్దగా జరగలేదు. అప్పుడు వాయిదా వేసుకున్నవారు కూడా మాఘ మాసానికి ప్రాముఖ్యం ఇచ్చి.. మూణ్నెల్లు ముందుగానే ఫంక్షన్ హాళ్లను బుక్ చేసేసుకోవడంతో.. ఆ తర్వాత ముహూర్తాలు నిర్ణయించుకున్నవారికి కల్యాణ వేదికలు దొరకడమే కష్టంగా మారే పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నార్సింగి, కోకాపేట్, ఎల్బీనగర్, చైతన్యపురి, నాగోలు, ఉప్పల్, విజయాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని భారీ ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు చాలా వరకూ బుక్ అయిపోయాయి. కొన్నిచోట్ల ఫంక్షన్‌హాళ్ల రోజువారీ అద్దె రూ.2 నుంచి 5 లక్షల వరకు ఉన్నప్పటికీ వాటిని బుకింగ్ చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దిగువ మధ్య తరగతి కుటుంబాలు తమస్థాయికి తగిన విధంగా చిన్న ఫంక్షన్ హాళ్లు, బాంకెట్ హాళ్లు, కమ్యూనిటీ భవనాలను ఎంచుకుంటున్నారు. ఫంక్షన్ హాళ్లతోపాటు కల్యాణ మండపాలు నిర్మించే డెకరేటర్స్, వధువులకు అలంకరణ చేసే బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, షామియానా సప్లయర్స్, మంగళవాయిద్యాల వారు, ఆర్కెస్ట్రా, కేటరింగ్ వారికి కూడా డిమాండ్ బాగా పెరిగిపోయింది. గుత్తకు మాట్లాడుకుని వీరందరినీ సమకూర్చి నిర్విఘ్నంగా శుభకార్యాన్ని జరిపే ఈవెంట్ మేనేజర్లు ఇప్పుడు ఫోన్ కాల్‌కు దొరికే పరిస్థితి లేదు. దీంతో.. కొద్దిగా లేటుగా ముహూర్తాలు నిర్ణయించుకున్నవారు వీటన్నింటికీ ఆదరాబాదరాగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాల్సి వస్తోంది.

### ఏప్రిల్ 26 దాటితే.. శ్రావణంలోనే!

ఫిబ్రవరి: 13, 14, 17, 18, 24, 28, 29
మార్చి: 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30
ఏప్రిల్: 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26

...ఈతేదీలు దాటితే మళ్లీ మంచి ముహూర్తాలు శ్రావణమాసంలోనే. అందుకే చాలా మంది ఇప్పుడే ముహూర్తాలు పెట్టుకున్నారు. పరీక్షల సీజన్ కావడంతో ఇప్పుడు కుదరని వారు శ్రావణానికి తమ ప్రణాళికలను మార్చుకుంటున్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*